సూర్య 18 వ వసంతంలోకి ...

visit us @ http://epaper.suryaa.com

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

గురువారం | 6 ఫిబ్రవరి 2025 | విజయవాడ

సంపుటి 18 | సంచిక 106

| పేజీలు 10+8 | వెల: రూ. 6.50

Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi







అనుగ్రహం


శ్రీ క్రోధి నామ సంవత్సరం దక్షిణాయణం - హేమంత ఋతువు, మాఘమాసం శు.నవమి రా.1.03, కృత్తిక రా.9.51, వర్జ్యం ఉ.10.35 నుంచి 12.05 వరకు
రాహుకాలం మ.1.30 నుంచి 3.00 వరకు దుర్ముహూర్తం ఉ.10.20 నుంచి 11.06 వరకు తిరిగి మ.2.52 నుంచి 3.57 వరకు

## త్రివేణి సంగమంలో ప్రధాని

# పుణ్యస్నానం

- సంగమ్ వద్ద బోట్‌లో విహారం
- ఘాట్ నుంచి పడవలో మహాకుంభమేళా స్థలికి రాక
- సాధు సంతులతో ప్రధాని భేటీ - పలు అంశాలపై చర్చ
- మహాకుంభ మేళా ఏర్పాట్లపై ప్రధాని అధికారులతో సమీక్ష

అతిపెద్ద ఆధ్యాత్మిక కార్యక్రమం మహాకుంభమేళాకు ఒక భారతదేశం నుంచే కాక.. ప్రపంచ వ్యాప్తంగా నలు దిక్కుల నుంచి భక్తులు పోటెత్తుతున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ మహాకుంభమేళాలో పాల్గొన్నారు. సంగమ్ వద్ద బోట్ ఆయన విహరించారు. ప్రధాని త్రివేణి సంగమంలో పుణ్య స్నానం చేశారు.



6 లో




6 లో

## ఢిల్లీ పీఠం

# కమలానిదే

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ముగిసింది.. సీలంపూర్, జంగ్‌పూర్, అకోలా నియోజకవర్గాలు మినహా మిగతా ప్రాంతాల్లో ప్రశాంతంగా ముగిసింది. కాగా.. సాయంత్రం 5 గంటల వరకు 58 శాతం పోలింగ్ నమోదయ్యింది. పలు నియోజకవర్గాల్లో ఆప్, బీజేపీ అభ్యర్థుల మధ్య టఫ్ ఫైట్ ఉంది. గెలుపుపై అటు బీజేపీ, ఇటు ఆప్ నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ కూడా కొన్ని నియోజకవర్గాల్లో గట్టి పోటీ ఇస్తున్నట్లు పేర్కొంటున్నారు. కాగా.. ఢిల్లీలో అంచనాలను మించి పోలింగ్ శాతం నమోదవడంతో అంచనాల్లో పార్టీలు తలమునకలవుతున్నాయి. 2020 ఎన్నికల్లో సాయంత్రం 5 గంటల వరకు 44.52 శాతం పోలింగ్ నమోదైంది.. 2025లో సాయంత్రం 5 గంటల వరకు 58 శాతం పోలింగ్ గత ఎన్నికలతో పోలిస్తే 13 శాతం పోలింగ్ పెరిగింది.

- పలు జాతీయ ఛానెల్స్ ఎగ్జిట్ పోల్స్ అంచనాలు
- ఈ సారి బీజేపీ, ఆప్ మధ్య గట్టి పోటీ
- 2020 ఎన్నికలతో పోలిస్తే పెరిగిన 13 శాతం ఓటింగ్
- గెలుపోటములపై ప్రభావం చూపే అవకాశం

## ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు

# ప్రశాంతం

- ఓటు వినియోగించుకున్న ముర్ము, రాహుల్
- స్వచ్ఛ రాజకీయాలు ఎక్కడంటూ కాంగ్రెస్ నేత ప్రశ్న



6 లో

## నష్టాల్లో స్టాక్ మార్కెట్‌లు

- అమెరికా-చైనా వాణిజ్య యుద్ధ భయాలు
- 312 పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్
- 42 పాయింట్లు కోల్పోయిన నిఫ్టీ



5 లో

### కాంగ్రెస్ బీసీ డిక్లరేషన్

## వంద శాతం అబద్ధం

- రేవంత్ సర్కారు నిబద్ధత నకిలీ
- డిక్లరేషన్ పేరిట తప్పుడు లెక్కలు
- ప్రభుత్వానికి దేనిపై కూడా స్పష్టత లేదు
- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

సూర్య వెబ్‌సైట్

సూర్య ఈ - పేపర్

### బీఆర్‌ఎస్, బీజేపీ

## కుట్రలు సాగవు

- ఆ పార్టీల తప్పుడు ప్రచారాలను బీసీ ప్రజలు నమ్మొద్దు
- టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్



3 లో

తెలంగాణలో ప్రస్తుతం ఎస్సీ వర్గీకరణ, కులగణన అంశాలు హాట్ టాపిక్గా మారాయి. మంగళవారం ప్రత్యేకంగా శాసనసభ, మండలి సమావేశాలు నిర్వహించి మరీ సీఎం రేవంత్ రెడ్డి సర్కార్ వాటిని ఆమోదించింది. అయితే బీసీ కులగణనపై ప్రతిపక్ష, స్వపక్ష నేతల నుంచి కాంగ్రెస్ ప్రభుత్వంపై పెద్దఎత్తున విమర్శలు వస్తున్నాయి. బీసీ జనాభా తగ్గించి చూపే ప్రయత్నం చేశారంటూ బీఆర్‌ఎస్, బీజేపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## ఏపీలో ఎన్‌సిసి డైరక్టరేట్‌ను ఏర్పాటు చేయండి

మానవవనరుల సామర్థ్యాన్ని పెంపొందించేందుకు ఎన్ సిసి మౌలిక సదుపాయాల వృద్ధి ద్వారా ఎపిలోని క్యాడెట్లకు మెరుగైన అవకాశాలను కల్పించేందుకు సహకారం అందించాలని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ను రాష్ట్ర మంత్రి నారా లోకేష్ కోరారు.




2 లో

## 9 కాదు 11 శాతం కావాలి

ఎస్సీ వర్గీకరణ.. లోపాలు సరిదిద్దాలి : మందకృష్ణ మాదిగ

ఎస్సీల వర్గీకరణ కోసం 30 ఏళ్లుగా పోరాడామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక జాతీయ మందకృష్ణ మాదిగ అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించిన ఎస్సీ వర్గీకరణ రిజర్వేషన్ల వాటాల్లో మాదిగలకు అన్యాయం జరిగిందని కృష్ణ మాదిగ ఆరోపించారు.



3 లో

### ప్రజా సమస్యల పరిష్కారమే

## ప్రభుత్వ ధ్యేయం


గాంధీభవన్‌లో మంత్రుల ముఖాముఖిలో పాల్గొన్న మంత్రి సీతక్క

హైదరాబాద్ గాంధీ భవన్‌లో బుధవారం మంత్రి సీతక్క మంత్రులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా వినడం, తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవడమే ప్రభుత్వ ధ్యేయమని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున కార్యకర్తలు, ప్రజలు హాజరై తమ వినతులను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు.



3 లో

## అంతా ఇంతే!




అమెరికాకు మనం టెర్రరిస్టుల్లా కనపడుతున్నామేమో సార్

# అదంతా కల్పితం

- సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారంపై ఈటల ఫైర్
- ఈటలకు కేసీఆర్ ఫోన్.. క్లారిటీ ఇచ్చిన ఈటల రాజేందర్



3 లో

బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ తన గురించి సోషల్ మీడియాలో జరుగుతున్న వివాదాస్పద ప్రచారంపై స్పష్టత ఇచ్చారు. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ తనను ఫోన్ చేసి మళ్లీ కలిసి పని చేయాలని పిలిచారన్న వార్తలు పూర్తిగా నిరాధారమైనవని తేల్చిచెప్పారు. నేనంటే గిట్టని వారు, సోషల్ మీడియాలో ఉండే సైకోలు, శాడిస్టులు మాత్రమే ఇలాంటి ప్రచారం చేస్తున్నారు. ఇందులో ఎలాంటి నిజం లేదు అని ఖండించారు. తాను చాలా కాలంగా బీఆర్‌ఎస్, కేసీఆర్ విషయంలో తన స్పష్టమైన అభిప్రాయాన్ని చెబుతూనే ఉన్నప్పటికీ, కొంతమంది కావాలనే తనపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు.

### ఏపీలో త్రిబుల్

## ఇంజన్ సర్కార్

- ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి గెలుపునకు మంత్రి ప్రచారం
- తొలి ప్రాధాన్యత ఓటును కూటమి అభ్యర్థికి వేయాలని వినతి
- ఎన్నికల కోడ్ తరువాత మెగా డీఎస్సీ
- రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ విజయం సాధించాలి




2 లో

# 42% బిసి రిజర్వేషన్లు

## అందని ద్రాక్షేనా?

- వివాదాల నడుమ పూర్తయిన బీహార్ కులగణన
- తెలంగాణలో సమగ్ర కుటుంబ సర్వే పేరుతో కుల గణన పూర్తి
- అసలు బిసిల జనాభా యాభై శాతం పైమాటే అంటున్న సంఘాలు
- గత ప్రభుత్వం అధికారంలో బిసి రిజర్వేషన్ శాతం తగ్గింది



6 లో

ఎప్పటి నుండో దేశంలో జనగణనతో పాటు కులగణన కూడా జరగాలన్న డిమాండ్‌లు వినిపిస్తూ ఉన్నాయి. 2015లో కర్ణాటక కులగణన వైపు అడుగులు వేస్తే తర్వాత 2023లో వివాదాల నడుమ బీహార్ కూడా కులగణన పూర్తి చేసింది. ఆ తర్వాత ఈ కుల గణన ఇంకెక్కడా జరగలేదు.



# ఏపీలో ఎన్‌సిసి డైరక్టరేట్‌ను ఏర్పాటు చేయండి

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : ఆంధ్రప్రదేశ్ లో మానవవనరుల సామర్థ్యాన్ని పెంపొందించేందుకు ఎన్ సిసి మౌలిక సదుపాయాల వృద్ధి ద్వారా ఏపిలోని క్యాడెట్లకు మెరుగైన అవకాశాలను కల్పించేందుకు సహకారం అందించాలని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ను రాష్ట్ర మంత్రి నారా లోకేష్ కోరారు. ఆంధ్రప్రదేశ్ లోని 5 ఎన్ సిసి గ్రూపులు, 43 యూనిట్ల పరిధిలో 75వేలమందికి పైగా క్యాడెట్లు ఉన్నారు, రాష్ట్ర విభజన తర్వాత ఎన్ సిసి డైరక్టరేట్ తెలంగాణాలో ఉండిపోయింది. ఏపిలో ప్రత్యేకంగా ఎన్ సిసి డైరక్టరేట్ ను ఏర్పాటు చేయండి. ఏపి రాజధాని అమరావతిలో ఇందుకు అవసరమైన స్థలాన్ని కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నాం. ఏపిలో ఎన్ డైరక్టరేట్ ఏర్పాటుకు రూ.25 కోట్ల నిధులతోపాటు అడిషనల్ డిజి ర్యాంకు అధికారి, ఇతర సిబ్బందిని నియమించండని కోరారు. ఏపిలోని 5 ఎన్ సిసి గ్రూపు హెడ్ క్వార్టర్స్ లో ఎన్ సిసి ట్రైనింగ్ అకాడమీలను ఏర్పాటు చేయాలన్నారు.. ఇందుకోసం రూ.25కోట్ల నిధులు అవసరం. అత్యధిక తీర ప్రాంతం గల ఏపిలో ప్రస్తుతం ఉన్న 43 ఎన్ సిసి యూనిట్లను అప్ గ్రేడ్ చేయండి. అవసరమైన చోట అదనపు నేవల్ ఎన్ సిసి యూనిట్లు మంజూరు చేయండి. ఏపిలో ఎన్ సిసిని బలోపేతం చేయడంలో భాగంగా అన్ని టెక్నికల్ స్క్వాడ్రన్లను ఫ్లయింగ్ యూనిట్లుగా మార్చి, ప్రతి స్క్వాడ్రన్ కు మైక్రో లైట్లను అందించండి. నూరుశాతం కేంద్రం నిధులతో ఐదు ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ కేంద్రాలను మంజూరు చేయాలని మంత్రి లోకేష్ కోరారు.

# కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వశాఖకు చొరవచూపండి

## ● పార్లమెంటు, అసెంబ్లీలలో బీసీ రిజర్వేషన్ల కోసం వత్తిడి తేవాలి ● కేంద్ర బడ్జెట్ లో బిసిల సంక్షేమానికి రూ.లక్ష కోట్లు కేటాయించాలి ● మంత్రి నారా లోకేష్‌ను కలిసిన రాజ్యసభ సభ్యుడు కృష్ణయ్య



న్యూఢిల్లీ: ఢిల్లీ పర్యటనలో ఉన్న రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ ను రాజ్య సభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య కలిశారు. ఈ సందర్భంగా పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని మంత్రి లోకేష్ కు అందజేశారు. బీసీలకు హక్కులు, అవకాశాల కోసం రాజ్యాంగంలో స్పష్ట ంగా పొందుపర్చినప్పటికీ వారి అభివృద్ధికి ఇంతవరకు నిర్మాణాత్మకమైన చర్యలు లేవు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 340 ప్రకారం 1953లో కాకాకలేల్కర్ కమిషన్, 1978లో మండల్ కమి షన్‌ను నియమించారు. కమీషన్లు ఆయా కులాల విద్యా, వృత్తి, సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులను అధ్యయనం చేసి వారి అభివృద్ధికి సిఫార్సులను సమర్పించాయి. కానీ, ఆ సిఫార్సులు ఇప్పటికీ అమలుకు నోచుకోలేదు. దేశంలో 70కోట్ల మందికి పైగా ఉన్న బీసీ జనాభా అభివృద్ధి చెందకపోతే భారత్ సూపర్ పవర్ గా మారడం అసా ధ్యం. దేశంలోని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు బీసీల కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖలను కలిగి ఉన్నాయి, రాష్ట్రాలను పర్యవేక్షించడానికి, సమన్వయం చేయడానికి కేంద్ర ప్రభుత్వ స్థాయిలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ అవ సరం. ఇందుకోసం తెలుగుదేశం పక్షాన చొరవ చూపండి. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో 50% రిజర్వేషన్లు కల్పించేందుకు బీసీ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టేలా వత్తిడి తేవాలి. బీసీలకు అసెంబ్లీ, పార్లమెంట్‌లో రిజర్వేషన్లు కల్పించాలని ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ అసెంబ్లీల్లో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపించారు. బీసీలకు పార్లమెంట్, అసెంబ్లీల్లో రిజర్వేషన్లు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం బీసీ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టేలా వత్తిడి తేవాలి. బీసీ, ఓబీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలి. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లకు సంబంధించి రాజ్యాంగాన్ని సవరించి జనాభా దామా షా ప్రకారం బీసీ రిజర్వేషన్లను అమలుచేయాలి. ఎస్సీ, ఎస్టీలకు మాదిరిగా సామాజిక భద్రతా చట్టాన్ని ఓబిసిలకు కూడా విస్తరించాలి. ప్రైవేటు రంగంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను అమలుచేయాలి. సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులు, నేషనలైజ్డ్ బ్యాంక్ చైర్మన్లు, యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్, రైల్వే రికట్‌మెంట్ బోర్డు, పబ్లిక్ లిమిటెడ్ కంపెనీల చైర్మన్లు, కార్పొరేషన్లు, యూనివర్సిటీల వైస్ ఛాన్సలర్లు, కేంద్ర స్థాయిలోని ఇతర బోర్డుల అధిపతుల నియామకాల్లో జనాభా ప్రకారం బీసీలకు 50% కోటా కల్పించాలి.

## బాపట్ల డిపో పరిధిలోని కొత్త రూట్లలో
# బస్సులు ఏర్పాటుకు వినతి




ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : బాపట్ల డిపో పరిధిలో కొత్త రూట్లలో బస్సుల ఏర్పాటుకు కృషి చేయాలని రవాణా శాఖ మంత్రి రాంపప్రసాద్ రెడ్డిని బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు సచివాలయంలో మంత్రి ఛాంబర్ లో మర్యాదపూర్వకంగా కలిసి కోరారు. 2022లో కొత్తగా ఏర్పాటైన బాపట్ల జిల్లాకు బాపట్ల జిల్లా కేంద్రంగా మారిందని, అయితే ప్రజల నుంచి డిమాండ్ పెరిగినప్పటికీ జిల్లా హెడ్ క్వార్టర్స్ అంటే బాపట్ల నుంచి స్టేట్ హెడ్ క్వార్టర్స్, ఇతర ముఖ్య ప్రాంతాలకు బస్సుల ఫ్రీక్వెన్సీ, సర్వీసుల ఫ్రీక్వెన్సీని ఇంతవరకు పెంచలేదన్నారు.

కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టితో ప్రజలకు మెరుగైన రవాణా సేవలు కల్పించాలని మంత్రి గారిని ఎమ్మెల్యే గారు కోరారు. రవాణా శాఖ మంత్రి సానుకూలంగా స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## వాహనశ్రేణిలోని డ్రైవర్ మృతిపై
# సీఎం చంద్రబాబు సంతాపం

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : ముఖ్యమంత్రి వాహనశ్రేణిలో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తోన్న ఎండీ అమీన్ బాబు గుండెపోటుతో మరణించారు. అమీన్ బాబు మృతిపట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంతాపం వ్యక్తం చేశారు. సీఎం కాన్వాయ్‌లోని వాహనశ్రేణిలో డ్రైవర్‌గా సుదీర్ఘకాలంగా అమీన్‌బాబు విధులు నిర్వహిస్తున్నారు. అర్ధరాత్రి గుండెపోటు రావడంతో ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ తెల్లవారుజామున అమీన్ మృతి చెందారు. విషయం తెలుసుకున్న ముఖ్యమంత్రి ఘటనపై విచారం వ్యక్తం చేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. ప్రభుత్వ పరంగా అమీన్ కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని సీఎం భరోసా ఇచ్చారు.




## కేంద్రమంత్రి రాజ్ నాథ్ సింగ్‌కు
# కృతజ్ఞతలు తెలిపిన ఎంపి కేశినేని




ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ ను రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ తో పాటు ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) సహచర ఎంపీలతో కలిసి బుధవారం డిల్లీలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలవటం జరిగింది. కేంద్రమంత్రి రాజ్ నాథ్ సింగ్ ను మంత్రి నారా లోకేష్ శాలువాతో సత్కరించటంతో పాటు శ్రీ వెంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిమను బహుకరించారు. అనంతరం కేంద్ర మంత్రి రాజ్ నాథ్ సింగ్ మంత్రి నారా లోకేష్, ఎంపిలతో రాష్ట్ర ప్రగతిని వేగవంతం చేయడానికి సంబంధించిన అనేక విషయాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) గత పాలకుల అనాలోచిత విధానాలతో లక్షల కోట్ల అప్పుల్లో మునిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేంద్రప్రభుత్వం అండగా ఉంటూ రాష్ట్రాభివృద్ధికి సహకరిస్తున్నందుకు కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి పార్లమెంటరీ పార్టీ నేత లావు శ్రీకృష్ణ దేవరాయులు, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు, కేంద్ర భారీ పరిశ్రమ, ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, ఎంపి గంటి హరీష్ మాధుర్, ఎంపి బస్తిపాటి నాగరాజు, బిజెపి ఎంపి సీఎం రమేష్, రాజ్యసభ ఎంపి సానా సతీష్ పాల్గొన్నారు.

## అమరావతి ఏపీ జేఏసీ
# 8వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : ఏపీజేఏసీ అమరావతి 8వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు బుధవారం విజయవాడ లెనిన్ సెంటర్లోని రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ భవన్ ప్రాంగణంలో రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు ప్రధాన కార్యదర్శి పలిశెట్టి గారి ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ముందుగా ఏపీజేఏసీ అమరావతి జెండా ఆవిష్కరణ చేసి కేక్ కటింగ్ చేశారు. అనంతరం ఉద్యోగుల ఆశాజ్యోతి కామ్రేడ్ తోట సుధాకర్ ప్రసాద్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

# ఉప ముఖ్యమంత్రికి వైరల్ ఫీవర్



స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వైరల్ జ్వరంతో ఇబ్బందిపడుతున్నారు. జ్వరంతోపాటు స్పాండిలైటిస్ బాధపెడుతోంది. వైద్యుల సూచన మేరకు ప్రస్తుతం విశ్రాంతి తీసుకొంటున్నారు. వీటి మూలంగా గురువారం నాటి రాష్ట్ర క్యాబినెట్ సమావేశానికి హాజరు కాలేకపోవచ్చు.

# అప్లికేషన్ గడువు పొడిగింపు



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : ఎక్సైజ్ కమిషనర్ నిశాంత్ కుమార్ మచిలీపట్నం, వుయ్యూరు ఎక్సైజ్ స్టేషన్లను సందర్శించి అప్లికేషన్ ప్రక్రియ, ఎక్సైజ్ నేరాలు తదితర అంశాలపై సమీక్షించారు. పర్యటన సందర్భంగా అధికారులతో మాట్లాడుతూ ఐడి లిక్కర్‌ను ఏ పరిస్థితుల్లోనూ సహించబోమని, అక్రమ మద్యం వ్యాపారులను కఠినంగా శిక్షించాలని ఆదేశించారు. నవోదయం 2.0 ని కఠినంగా అమలు చేయాలని, ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా పనులు నిర్వహించాలన్నారు. అప్లికేషన్ దాఖలుకు మరింత సమయం కల్పించేందుకు గడువును ఫిబ్రవరి 8 సాయంత్రం 5 గంటల వరకు పొడిగిస్తున్నట్లు ప్రకటించారు. వుయ్యూరు ఎక్సైజ్ స్టేషన్ లో అప్లికెంట్లతో నిశాంత్ కుమార్ మాట్లాడి, ఎవరైనా సమస్యలు ఎదుర్కొంటున్నారా అని విచారించారు. అప్లికెంట్లు సులభమైన అప్లికేషన్ ప్రక్రియపై సంతృప్తి వ్యక్తం చేస్తూ, ఎక్సైజ్ శాఖ కార్యశైలిని అభినందించారు. మరోవైపు, బైండ్ ఓవర్ విధించిన వ్యక్తుల విషయంలో కఠిన ఆదేశాలు జారీ చేశారు. తిరిగి నేరపూరిత కార్యకలాపాల్లో పాల్గొంటే, రెవిన్యూ అధికారులతో కలిసి వారిపై వేసిన బాండ్ మొత్తాన్ని వసూలు చేయాలని, తద్వారా నేరస్థుల్లో చట్టం పట్ల భయం పెంచాలని సూచించారు. ఈ సందర్భంగా నిశాంత్ కుమార్ తనను కలిసిన మీడియాతో మాట్లాడుతూ అక్రమ మద్యం వ్యాపారాన్ని అరికట్టేందుకు, పారదర్శకతను పెంపొందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. చట్టాన్ని కచ్చితంగా అమలు చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. అధికారులు ప్రజల శాంతి భద్రతల పరిరక్షణలో సక్రమ చర్యలు తీసుకోవాలని ఆదేశించామన్నారు.

# చట్టపరిధికి లోబడి సహజ న్యాయసూత్రాలకు అనుగుణంగా రీసర్వే

## ● సిసిఎల్ఎ ఛీఫ్ కమీషనర్ జయలక్ష్మి ● విజయవంతగా రీసర్వే డిప్యూటీ తాహసీల్దార్‌ల రాష్ట్ర స్థాయి శిక్షణ, సమీక్ష సదస్సు

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : చట్టపరిధికి లోబడి సహజ న్యాయ సూత్రాలను అన్వయిస్తూ రీసర్వే కార్యక్రమాన్ని పూర్తి చేయాలని సిసిఎల్ఎ ఛీఫ్ కమీషనర్ జి.జయలక్ష్మి స్పష్టం చేసారు. గతంలో జరిగిన తప్పిదాలను అధికమిస్తూ సజావుగా రీసర్వే వ్యవహారాలను పూర్తి చేయాలని సూచించారు. బుధవారం గుంటూరు నాగార్జునా విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి రీసర్వే డిప్యూటీ తాహసీల్దార్ శిక్షణ, సమీక్ష కార్యక్రమానికి సిసిఎల్ఎ ఛీఫ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జయలక్ష్మి మాట్లాడుతూ రీసర్వే డిటిలకు విస్త్రత అధికారాలు కల్పించటం జరిగిందని వాటిని సమస్యల పరిష్కారానికి వినియోగించాలన్నారు. కొందరు చేసిన తప్పిదాల వల్ల రెవిన్యూ రికార్డులలో నెలకొన్న లోపాలను అధికమించి భవిష్యత్తు తరాలకు ఉపయోగపడేలా స్పష్టమైన రికార్డుల రూపకల్పనకు మార్గం సుగమం చేయాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయిడు రీసర్వే ప్రాజెక్టు పట్ల ప్రత్యేక దృష్టి సారించాలని, వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా పనులు పూర్తి చేసి హక్కు దారుల మన్ననలు పొందాలన్నారు. అధికారులు తమ పరిజ్ఞానాన్ని ప్రజా సమస్యల పరిష్కారానికి వినియోగించాలని, తాము ఇచ్చే ఉత్తర్వులలో స్పష్టత ఉండాలని అదేశించారు. తప్పులు చేసే వారిని ఉపేక్షించబోమని, కఠిన చర్యలకు వెనుకాడబోమని హెచ్చరించారు. సర్వే సెటిల్మెంట్, భూమి రికార్డుల సంచాలకులు డాక్టర్ ప్రభాకర్ రెడ్డి కీలకోపన్యాసం చేస్తూ రీసర్వే అధికారులు ప్రజలకు జవాబుదారిగా, రైతుల సంతృప్తే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. అందుబాటులో ఉన్న చట్టాలను అయా సమస్యల వారిగా అన్వయింప చేసుకుని న్యాయమైన ఉత్తర్వులు వెలువరించాలన్నారు. ప్రస్తుతం రీసర్వేకు తగిన సమయం ఇచ్చినందున ఎట్టి పరిస్థితులోనూ తప్పులకు అవకాశం ఉండకూడదన్నారు. రెవిన్యూ సదస్సులలో 2,80,000 ఫిర్యాధులు వచ్చాయని, యంత్రాంగం సమర్ధవంతంగా పనిచేసి భవిష్యత్తులో ఈ సమస్యలు ఎదురు కాకుండా చూడాలన్నారు. క్షేత్ర స్థాయిలో ఎదురయ్యే సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే అవసరమైన చర్యలు తీసుకుంటామని, వాటి పరిష్కారానికి అవసరమైతే చట్ట సవరణకు కూడా వెనుకాడబోమని అన్నారు. సర్వే సెటిల్మెంట్, భూమి రికార్డుల అదనపు సంచాలకులు గోవిందరావు మాట్లాడుతూ బ్రిటీష్ కాలం తరువాత అధునిక పరిజ్ఞానం వినియోగించి చేస్తున్న రీసర్వే విజయవంతం కావాలంటే ప్రతి ఒక్క అధికారి సమస్యలను లోతుగా అవగాహన చేసుకుని పరిష్కారం చూపాలని కోరారు.




## కుప్పం నియోజకవర్గం సమాగ్రాభివృద్ధికి
# అధికారులతో సీఎంవో సమీక్షలు


ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : కుప్పం నియోజకవర్గాన్ని రాష్ట్రానికి ఆదర్శ నియోజకవర్గం గా మార్చే దిశగా అడుగులు పడుతున్నాయి. నియోజకవర్గాన్ని రాష్ట్రానికే తలమానికంగా తీర్చిదిద్దుతానని చంద్రబాబు గతంలో హామీ ఇచ్చారు. అందులో భాగంగా కుప్పం నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా తీర్చిదిద్దేందుకు సీఎంవో సమీక్షలు నిర్వహిస్తోంది. ముఖ్యంగా ఆ నియోజకవర్గంలో గ్రీవెన్స్ లోని ఫిర్యాదులతో పాటు భూ వివాదాలు, భూసమస్యల సత్వర పరిష్కారం కోసం చర్యలపై అధికారులతో చర్చిస్తున్నారు. అంతేకాకుండా కుప్పాన్ని అభివృద్ధి పథంలో ముందుంచాలనే సీఎం ఆదేశాల మేరకు సీఎంవో కార్యాచరణ రూపొందించింది. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, రైతులకు లాభసాటి వ్యవసాయం, ప్రకృతి వ్యవసాయం, సాగు, తాగు నీటి ఎద్దడికి పరిష్కారం వంటి అనేకమైన సమస్యలపై అధికారులకు సీఎంవో దిశానిర్దేశం చేస్తోంది. అంతే కాకుండా ప్రతి ఇంటికి సోలార్ ద్వారా విద్యుత్ వెలుగులు పంచాలనే చేపట్టిన సూర్యఘర్ పథకాన్ని పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టి విజయవంతంగా అమలు చేస్తున్నారు. కుప్పం బస్టాండ్ ను మోడరన్ బస్టాండ్ గా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టారు.

# రాష్ట్రంలో అభివృద్ధికి ట్రిబుల్ ఇంజన్ సర్కార్

## ● ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి గెలుపునకు మంత్రి ప్రచారం ● తొలి ప్రాధాన్యత ఓటును కూటమి అభ్యర్థికి వేయాలని వినతి ● ఎన్నికల కోడ్ తరువాత మెగా డీఎస్సీ ● రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ విజయం సాధించాలి

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : ఫిబ్రవరి 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులను యువత తమ తొలి ప్రాధాన్యత ఓటును ఉభయగోదావరి జిల్లాల నియోజకవర్గ పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంకు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని మంత్రి కందుల దుర్గేష్ పిలుపు నిచ్చారు.. బుధవారం నిడదవోలు పరిధిలోని కానూరు వైనాట్ ఫంక్షన్ హాల్ లో జిల్లా ఇన్చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు ఆధ్వర్యంలో కూటమి శ్రేణులను ఎమ్మెల్సీ ఎన్నికలకు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ సమాయత్తం చేశారు.. గ్రాడ్యుయేట్ ఓటర్లుగా నమోదైన యువత నూటికి నూరు శాతం కూటమి అభ్యర్థికి ఓటు వేసే విధంగా రానున్న 20 రోజుల్లో అవగాహన కల్పించాలని ఈ సందర్భంగా కూటమి శ్రేణులకు మంత్రి దుర్గేష్ దిశా నిర్దేశం చేశారు. నేటి నుంచే కార్య క్షేత్రంలోకి దిగి యువతకు అవగాహన కల్పించాలన్నారు. ఇంకా ఎవరైనా గ్రాడ్యుయేట్లు ఓటర్లుగా నమోదు కాకపోయి ఉంటే నమోదు చేయించాలని సూచించారు. ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వచ్చే విజయంతో పరిపూర్ణత చేకూరుతుందని తెలిపారు. అత్యధిక మెజార్టీతో కూటమి అభ్యర్థిని గెలిపించుకోవాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. అంతేకాదు రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సైతం కూటమి విజయ దుందుభి మోగించాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో ప్రతిపక్షం లేదని, వారు తమ అభ్యర్థిని పోటీలో నిలబెట్టే సాహసం చేయరని మంత్రి తెలిపారు. అయినప్పటికీ పార్టీ శ్రేణులు జాగ్రత్తగా తమ కర్తవ్యాన్ని నిర్వర్తించాలన్నారు.. మితిమీరిన విశ్వాసంతో కాకుండా ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలన్నారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ కూటమి పార్టీల శ్రేణులకు పలు అంశాలను వివరించారు.. గడిచిన ఏడు నెలల కాలంలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను సంక్షేమ పథకాలను పట్టభద్రులైన యువతకు వివరించాలన్నారు.. గత ప్రభుత్వం వృద్ధులు, వితంతువులకు ఇచ్చే పెన్షన్ ను రూ. 1000 కి పెంచేందుకు ఐదేళ్లు సమయం తీసుకుంటే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 15 రోజుల్లోనే ఎన్టీఆర్ భరోసా పెన్షన్ క్రింద రూ. 4 వేల పెన్షన్ ఇస్తుంది అన్న విషయం గుర్తు చేశారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు 15వేల రూపాయల పెన్షన్ ఇస్తున్నామని గుర్తు చేయాలన్నారు. గత ప్రభుత్వం రైతులకు ఇవ్వాల్సిన రూ. 1600 కోట్ల ధాన్యం సొమ్మును బకాయి పెడితే ఈ ప్రభుత్వం అధికారంలోకి రాగానే నాబార్డ్ సాయంతో తీర్చింది అన్న విషయం గుర్తు చేయాలన్నారు. రైతు తాను ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యాన్ని అమ్ముకున్న 24 గంటల్లోనే వాళ్ళ అకౌంట్ కు సొమ్ము జమ చేస్తున్నామని తెలపాలన్నారు.. పట్టభద్రులైన యువత ఓటు వేసేటప్పుడు కేవలం పేరా బత్తుల రాజశేఖర్ ఫోటో, దాని పక్కనున్న సర్కిల్లో ఒకటో నెంబర్ వేయడమే లక్ష్యంగా ముందుకెళ్లాలని తెలిపారు. ఈ సందర్భంగా ద్రోణాచార్యుడి కథను ఉదాహరించారు. కేంద్ర, రాష్ట్రస్థాయిలోని కూటమి ప్రభుత్వాల ఆధ్వర్యంలో రాష్ట్రంలో ఈ అభివృద్ధిని కొనసాగించాలి అంటే ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థిని గెలిపించాలని యువత కి తెలపాలని అన్నారు. అభివృద్ధి అనేది డబుల్ ఇంజిన్ సర్కార్ అంటారు కానీ ఏపీలో అభివృద్ధి అనేది ట్రిబుల్ ఇంజిన్ సర్కార్ అన్నారు.. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి సంక్షేమ పథకాలు పట్టభద్రులకు అందాలి, చేరాలి అంటే కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని కోరారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన అనంతరం తొలి సంతకం మెగా డీఎస్సీ పైనే చేశామన్న విషయాన్ని గుర్తు చేయాలన్నారు. ఎన్నికల కోడ్ అనంతరం మెగా డీఎస్సీ అమలు చేయబోతున్నామన్నారు. తద్వారా నిరుద్యోగ యువతకు లక్షలాది ఉద్యోగాలు కల్పించే దిశగా పయనిస్తామన్నారు. రాబోయే ఐదేళ్ల కాలంలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించి తీరాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పనిచేస్తున్నారన్నారు. ఈ విషయమై ఇప్పటికే క్యాబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు జరిగిందన్నారు. ఆరుగురు మంత్రులతో కూడిన క్యాబినెట్ సబ్ కమిటీలో తాను ఒక సభ్యుడు నన్న విషయం మంత్రి దుర్గేష్ గుర్తు చేశారు.. త్వరలోనే నిరుద్యోగ యువతకు ఇచ్చిన మాట ప్రకారం నిరుద్యోగ భృతిని సైతం అమలు చేసి తీరుతామన్నారు. గత ప్రభుత్వం డీఎస్సీ వేయకుండా నిరుద్యోగులను దగాపరిచిందన్నారు.. ఈ విషయాలన్నీ పట్టభద్రులైన యువతకు చెప్పి పేరా భక్తుల రాజశేఖరం విజయానికి కృషి చేయాలన్నారు. సాధారణ ఎన్నికల్లో అఖండ విజయం సాధించిన తర్వాత ప్రస్తుతం శాసనమండలి ఎన్నికలు వచ్చాయని గుర్తు చేశారు. ఎన్నికల్లోను విజయం సాధించి పరిపూర్ణత చేకూర్చాలని యువతను కోరాలని క్యాడర్ కు మంత్రి దుర్గేష్ తెలిపారు

గడచిన ఐదేళ్లలో రాష్ట్రాన్ని అతలాకుతలం చేసిన వైఎస్సార్ సీపీ ని ఇంటికి పంపి కూటమి ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకొచ్చేందుకు అహర్నిశలు శ్రమించిన కార్యకర్తలకు ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఇన్చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు, నిడదవోలు నియోజకవర్గం టిడిపి ఇన్చార్జ్, మాజీ శాసనసభ్యులు బూరుగుపల్లి శేషారావు, ఎమ్మెల్సీ ఎన్నికల నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ శాసనసభ్యులు, మాజీ ఉపసభాపతి బూరుగడ్డ వేదవ్యాస్, రాజమండ్ర పార్లమెంట్ నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్, మాజీ మంత్రివర్యులు కేఎస్ జవహర్, బిజెపి రాజమండ్ర అధ్యక్షులు టి.నాగేంద్ర, బూరుగుపల్లి రాఘవం, నిడదవోలు మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, బిజెపి అధ్యక్షులు బండి సత్యనారాయణ, టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు దాసరి సత్యనారాయణ, బీజేపీ సీనియర్ నాయకులు వర్మ, కూటమి నాయకులు, కూటమి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




## తిరుమలలో అన్యమత
# ఉద్యోగస్తులపై బదిలీ వేటు



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : తిరుమల కొండపై అన్య మత ప్రచారం, టీటీడీలో అన్యమత ఉద్యోగస్తుల విషయంలో చైర్మన్ బీఆర్ నాయుడు సీరియస్ గా స్పందించారు. టీటీడీ సంస్థలలో అన్యమత ఉద్యోగులపై బదిలీ వేటు వేశారు. టీటీడీ మహిళ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ ఆయుర్వేద కళాశాల ప్రిన్సిపాల్, టీటీడీ అనుబంధ విద్యాసంస్థలోని లెక్చరర్లు, వసతి గృహ వార్డెన్లు, తదితరులు మొత్తం 18 మందిని బదిలీ చేశారు. ఇటీవల తిరుమలలో మాంసాహారం దొరకడం వివాదాస్పదంగా మారిన విషయం తెలిసిందే టీటీడీలో ఉన్నత స్థాయిలో అన్యమతాలకు చెందిన వారు ఉన్నారని విమర్శలు వినపడుతున్నాయి. కొండపై మాంసాహారం, గంజాయి, మద్యం దొరుకుతున్నాయని, దీనివల్ల తిరుమల స్తోత్రం పదా అన్యమత ప్రచారం చాపకింద నీరులా విస్తరిస్తోందని భక్తులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అప్రమత్తమైంది. టీటీడీలో సంస్కరణలు మొదలు పెట్టింది. అన్యమత ప్రచారం తిరుమల పవిత్రతకు భంగం కలిగిస్తున్న వారిని గుర్తించి 69 మందితో కూడిన ఓ జాబితాను టీటీడీ రూపొందించారు. వీరిలో టీటీడీ ఉద్యోగులతోపాటు ఇతర శాఖల ఉద్యోగులు కూడా ఉన్నారు. వీరిని బదిలీ చేయాలని బోర్డు నిర్ణయం తీసుకున్నది.

సూర్య
విజయవాడ
గురువారం
6 ఫిబ్రవరి 2025



సంపాదకీయం
editpage@suryaa.com

మరోమారు స్వదేశంలో తమకు తిరుగులేదని నిరూపించింది టీం ఇండియా జట్టు.ఇంగ్లాండ్ జట్టుతో జరిగిన ఐదు మ్యాచ్ ల టీ 20 సిరీస్ లో సూర్యకుమార్ సారథ్యంలోని టీం ఇండియా 4 - 1 తేడాతో చేజిక్కించుకొని సత్తా చాటిన తీరు ఎంతైనా అభినందనీయం.ముఖ్యంగా ముంబై వేదికగా జరిగిన చివరి టీ 20 మ్యాచ్ లో యువ ఆటగాడు ఓపెనర్ అభిషేక్ శర్మ ఇంగ్లాండ్ జట్టు యొక్క బౌలింగ్ శ్రేణిని చిన్నాభిన్నం చేసి,ఊచకోత కోసి పరుగుల సునామి సృష్టించడమే కాదు కేవలం 54 బంతుల్లో ( 7 ఫోర్లు,13 సిక్స్ లతో కలుపుకొని ) 135 పరుగులను సాధించడంలో టీం ఇండియా ఏకంగా 150 పరుగుల తేడాతో ఇంగ్లాండ్ జట్టును చిత్తు చిత్తుగా ఓడించగలిగింది.ఈ మేటి తుఫాన్ ఇన్నింగ్స్ తో అభిషేక్ శర్మ భారత జట్టు తరపున అంతర్జాతీయ టీ 20 ల్లో అత్యధిక వ్యక్తిగత స్కోరు సాధించిన ప్లేయర్ గా ఒక అరుదైన,చిరస్మరణీయమైన రికార్డును తన పేర లిఖించుకున్నాడు అనే మాట అక్షర సత్యం. అంతకుముందు టీం ఇండియా తరపున శుబ్ మన్ గిల్ మాత్రమే ( 126 నాటౌట్ ) పరుగులను న్యూజిల్యాండ్ జట్టుపై సాధించిన విషయం మన దరికి విదితమే.అంతేకాదు భారతజట్టు తరపున రోహిత్ శర్మ ( 35 బంతుల్లో (శ్రీలంక పై ) సెంచరీ సాధించి అగ్ర స్థానంలో ఉండగా తర్వాత ఇప్పుడు అభిషేక్ శర్మ 37 బంతుల్లో ఇంగ్లాండ్ జట్టుపై సెంచరీ నమోదు చేసి అతి తక్కువ బంతుల్లో సెంచరీ నమోదు చేసిన బ్యాట్స్ మ్యాన్ లలో టీం ఇండియా తరపున రెండో స్థానంలో నిలువడం ఎంతైనా హర్షణీయం. అదేమాదిరి ఈ 5 మ్యాచ్ ల టీ 20 సిరీస్ లో అభిషేక్ శర్మ తో పాటు తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా,శివం దూబే,రింకూ సింగ్ లు కూడా అడపదడప తమ బ్యాట్ కు పని చెప్పడం,బౌలింగ్ లో వరుణ్ చక్రవర్తి,రవి బిష్ణోయ్ తమ స్పిన్ మాయాజాలాన్ని ప్రదర్శించడం,ఇక చివరి టీ 20 మ్యాచ్ లో సీనియర్ పేస్ బౌలర్ మొహమ్మద్ షమీ తన తడాఖ చూపి 3 వికెట్లు సాధించడం వెరసి టీం ఇండియాకు 5 మ్యాచ్ ల టీ 20 సిరీస్ విజయం నల్లేరు మీద నడకే అయ్యింది.

ఏదిఏమైనా ఇంగ్లాండ్ వంటి అత్యంత పటిష్టమైన మేటి ప్రొఫెషనల్

## అభిషేక్ ముందు ఇంగ్లీష్ బౌలర్లు వెలవెల

జట్టుపై సూర్యకుమార్ సారథ్యంలోని టీం ఇండియా జట్టు తమ సంపూర్ణ అధికార్యాన్ని కనబరచి సిరీస్ ను చేజిక్కించుకోవడం అనేది ముమ్ముందు భారత క్రికెట్ కు ఎంతో మేలు చేకూర్చే ఓ సానుకూలాంశం అనడంలో ఎలాంటి సందేహానికి తావు లేదు.అంతేకాదు అత్యంత వేగానికి, దూకుడైనా ఆటతీరుకు మారుపేరైనా టీ 20 ఫార్మాట్ లో టీం ఇండియా ఈ విధమైన స్ఫూర్తిదాయక ఛాంపియన్ ఆటతీరుతో ప్రపంచ మేటి జట్ల ఆటకట్టిస్తూ తమ సత్తా చాటుతుండటంతో అశేష కోట్లాది మంది భారత క్రికెట్ అభిమానుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి.ఏమైనా ఇప్పుడు టీ 20 ఫార్మాట్ లో టీం ఇండియా ఓ అభేద్యమైన జట్టుగా రూపుదాల్చడం,భారత క్రికెట్ లోని యువ ఆటగాళ్లు తమ స్థాయికి తగ్గ ఆటతీరును కనబరుస్తుండటం వెరసి మన భారత క్రికెట్ జట్టు ఈ విభాగంలో ఒక తిరుగులేని జట్టుగా అవతరించింది అనే మాట సత్యదూరం కాదు.జైహింద్! జయ జయహో భారత క్రికెట్ జట్టు!



# ఎమ్మెల్సీ ఎన్నికల్లో చేతులెత్తేసిన బిఆర్ఎస్?

■ తెలంగాణలో జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల పోటీకి దూరం ■ ఓటమి భయమా? వ్యూహాత్మకమా? ■ తెలంగాణ ఉద్యమం నుండి ఉద్యమ పార్టీకి కలిసి వచ్చిన ఉత్తర తెలంగాణ ■ ఉత్తర తెలంగాణలోని పోటీకి దూరంగా ఉండడం ప్రశ్నార్థకం ■ ఉద్యమంలో కరీంనగర్ ఇటు వరంగల్ ఎమ్మెల్సీల ఎన్నికలు ■ గత ప్రభుత్వ హయంలో కరీంనగర్ ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీల ఓటమి ■ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక సిట్టింగ్ ఎంబాల్ సింగ్ కోల్పోయిన బిఆర్ఎస్ ■ ఇప్పటికే ఎమ్మెల్సీ అభ్యర్థులను ప్రకటించిన బిజెపి ■ భవిష్యత్తులో బిఆర్ఎస్ కు ఎన్నికలు ప్రశ్నార్థకమే

విద్య వెంకట్
తెలంగాణ బ్యూరో - 9391618181

తెలంగాణ ఉద్యమానికి కలిసి వచ్చిన ఉత్తర తెలంగాణ లో ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు బీఆర్ఎస్ జంకుతోంది. గత ప్రభుత్వ హాయంలోనే ఉపాధ్యాయ పట్టభద్రుల ఎన్నికల్లో పరాజయం పాలైన బిఆర్ఎస్ పోటీ చేసేందుకు విముఖత చూపుతున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే భారతీయ జనతా పార్టీ, అధికార కాంగ్రెస్ అభ్యర్థులను ప్రకటించగా బిఆర్ఎస్ మాత్రం ఇంతవరకు ఎలాంటి ప్రకటన చేయకపోవడంతో పోటీ విషయంలో చేతులెత్తేసినట్లు తెలుస్తోంది. మరోవైపు ఎన్నికల ప్రక్రియ లో ప్రధాన పార్టీలు దూసుకెళ్తుండగా ఎమ్మెల్సీ ఎన్నికలకు నామినేషన్ దాఖలు ప్రక్రియ మొదలైనా బీఆర్ఎస్లో చడీ చప్పుడూ కనిపించడం లేదు. ఎంపీ ఎన్నికల రిజల్ట్స్ రిపీట్ అయితే ఉన్న కాస్త పరువు పోతుందని ఆ పార్టీ పెద్దలు భయపడుతున్నారా? అందుకే పోటీకి దూరంగా ఉంటున్నట్లు సంకేతాలు పంపుతుందా? గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీకి ఆశావహులు కొందరు ముందుకు వస్తున్నా వారికి సానుకూల సంకేతాలు అందుకే రావడం లేదా? ఎన్నికల్లో ఓటమి పాలైతే పార్టీ గ్రాఫ్ మరింత తగ్గిపోతుందని పోటీకి సంశయిస్తుందా? కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలతో పాటు ఖమ్మం, వరంగల్, నల్గొండ టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి ఈ నెల 27న ఎన్నికలు జరగనున్నాయి . రెండు టీచర్ ఎమ్మెల్సీ స్థానాల్లో , ఒక పట్ట భద్రుల స్థానానికి నామినేషన్ల ప్రక్రియ కూడా మొదలైంది. ఆ ఎన్నికల్లో గులాబీ పార్టీ అభ్యర్థులను నిలబెడుతుందా? లేక ఎవరికైనా మద్దతు ఇస్తుందా అనేది చర్చగా మారింది. ఇప్పటి వరకు అభ్యర్థులను ప్రకటించకపోవడంతో అసలు ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తుందా లేదా అనే చర్చ బీఆర్ఎస్ వర్గాల్లో నడుస్తోంది. ఇంతకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ వ్యూహం ఏంటి అనేది రాజకీయ వర్గాలకు అంతుపట్టకుండా తయారైంది. అసెంబ్లీ ఎన్నికల్లో 39 స్థానాలకే పరిమితమై అధికారం కోల్పోవడం, పార్లమెంట్ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా దక్కించుకోలేక పోవడంతో పాటు ఏకంగా సగం స్థానాల్లో డిపాజిట్లు కోల్పోవడంతో గులాబీ కేడర్ పూర్తిగా ఢీలా పడిపోయింది.ఆ తర్వాత జరిగిన ఖమ్మం, వరంగల్, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం ఉప ఎన్నికల్లో కూడా బీఆర్ఎస్ సిట్టింగ్ స్థానాన్ని కాపాడుకోలేకపోయింది. అందుకే త్వరలో జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థులను నిలబెట్టేందుకు పార్టీ పెద్దలు సంకోచిస్తున్నారంట. నాలుగు ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం కాంగ్రెస్ పార్టీకి సిట్టింగ్ స్థానంగా ఉంది. గత ఎన్నికల్లో జీవన్ రెడ్డి ఎమ్మెల్సీగా మొదటి ప్రాధాన్యత ఓట్లతో గెలిచారు. అప్పుడు బీఆర్ఎస్ అధికారంలో ఉంది.

అయితే గత ఎన్నికల్లో బీఆర్ఎస్ అధికారికంగా అభ్యర్థిని నిలబెట్టలేదు. అప్పట్లో వేరే అభ్యర్థికి మద్దతు ఇచ్చింది. ఇప్పుడు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎలాంటి వ్యూహాలు అనుసరిస్తుంది అనేది చర్చనీయాంశంగా మారింది. ఇదే సమయంలో బీఆర్ఎస్ టికెట్ కోసం నేతలు తమవంతు ప్రయత్నాలు చేస్తున్నారు.

కరీంనగర్ మాజీ మేయర్ రవీందర్ సింగ్, కార్పొరేషన్ మాజీ చైర్మన్ చిలుముల రాకేష్ కుమార్, టీఎన్జీవో రాష్ట్ర మాజీ అధ్యక్షుడు దేవీప్రసాద్, ప్రయివేటు విద్యాసంస్థల సంఘం నేత శేఖర్రావు టిక్కెట్ ఆశిస్తున్నారు. వారు కేసీఆర్ ను కలిసి తమకు పోటీ చేసే అవకాశం కల్పించాలని ఇప్పటికే కోరారు.

ఇక కరీంనగర్, నిజామాబాద్ , మెదక్, ఆదిలాబాద్ టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి గతంలో జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ తరపున పాతూరి సుధాకర్ రెడ్డి పోటీ చేసి ఓడిపోయారు. అధికారంలో ఉన్నప్పుడే ఓడిపోయిన ఆ స్థానం నుంచి ఇప్పుడు బీఆర్ఎస్ అభ్యర్థి రంగంలోకి దిగడం అనుమానమే అంటున్నారు. ఖమ్మం, వరంగల్ , నల్గొండ టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గతంలో పిఆర్టియూ నుండి గెలిచిన పూల రవీందర్ బీఆర్ఎస్లో చేరారు. గత ఎన్నికల్లో బిఆర్ఎస్ నుండి పోటీ చేసిన పూల రవీందర్ పరాజయం పాలయ్యారు. దాంతో టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అధికారికంగా అభ్యర్థులను నిలబెడుతుందా లేదా అన్నది క్లారిటీ లేకుండా పోయింది. ఎన్నికల్లో పోటీపై గులాబీ పార్టీ ముఖ్య నేతలు సైలెంట్ గా ఉంటున్నారు. బీజేపీ మూడు ఎమ్మెల్సీ స్థానాల్లో తమ అభ్యర్థులను ప్రకటించింది. కాంగ్రెస్ పార్టీ సైతం తమ అభ్యర్థులపై కసరత్తులు చేస్తోంది. మెదక్ , కరీంనగర్ , నిజామాబాద్ , ఆదిలాబాద్ గ్రాడ్యుయేట్ అభ్యర్థిని ప్రకటించింది .. ఇక కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్, నిజామాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం పరిధిలోనే కేసీఆర్, కేటీఆర్, హరీశ్రావులు ఎమ్మెల్యేలుగా ఉన్నారు. కవిత ఎమ్మెల్సీగా అక్కడ నుంచే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అయినా ఈ ఎన్నికల్లో పోటీకి బీఆర్ఎస్ సంశయిస్తుండటం ఆ పార్టీ దైన్య స్థితికి అద్దం పడుతోందంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ఏడాదిలోనే ప్రజల్లో వ్యతిరేకత పెరిగిపోయిందని బీఆర్ఎస్ ఉదరగొడుతుంది. అయినా ఎమ్మెల్సీ ఎన్నికలకు దూరంగా ఉండటంతో కేసీఆర్ వ్యవహా శైలిలో ఇంక మర్పురాలేదని, అదే ఒంటెద్దు పోకడ పోతున్నారని గులాబీ శ్రేణులు గుర్రుగా కనిపిస్తున్నాయి. ఒకవైపు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల గెలుపే లక్ష్యంగా ముందుకు తీసుకెళ్తుండగా తామేమి తక్కువ కాదని భారతీయ జనతా పార్టీ ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించి ప్రచారంలో దూసుకెళున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో బిఆర్ఎస్ ఇంతవరకు అభ్యర్థులను ప్రకటించలేకపోగా ఎలాంటి ప్రకటన చేయకపోవడంతో ఇక పోటీ విషయంలో తప్పుకున్నట్లేనని మేధావులు చర్చించుకోవడం విశేషం.




# ఎట్టకేలకు గ్రూప్ - 1 కు లైన్ క్లియర్... కానీ.... ?

■ జిఓ నెం 29 పై ఎలాంటి స్పష్టత ఇవ్వని ధర్మాసనాలు ■ ఇంతకీ ఇది రాజ్యాంగ బద్ధమేనా!? కాదా? అన్నది మీమాంశే ■ అసలు జాబితాలో బీసీ,ఎస్సీ,ఎస్టీ అభ్యర్థులకు అన్యాయం జరిగిందన్నదే వివాదం ■ ఓపెన్ కోటాలో ఎంపికైన రిజర్వేషన్ అభ్యర్థులను పరిగణలోకి తీసుకోకపోవటం అన్యాయం ■ తుది తీర్పులో 'ఆలస్యం' అనే కారణంతో పిటిషన్లను కొట్టివేయడం సమంజసమేనా?

భాస్కర్ యలకంటి
8919464488

తెలంగాణలో గ్రూప్-1నియామక ప్రక్రియలో భాగంగా తెచ్చిన జీవో 29 రాజ్యాంగ బద్ధమా!? కాదా!? అని తేల్చకుండా కోర్టులు దాటవేత ధోరణిని ప్రదర్శించాయి. రాజ్యాంగ రక్షణదారుగా పేర్కొనే సుప్రీం కోర్టు సైతం ఎటూ తేల్చకుండా ఇటీవల జీవో 29 మీద దాఖలైన పిటిషన్లను కొట్టివేసింది. ఆదినుంచి జీవో 29 మీద వివాదం కొనసాగుతూనే ఉన్నది. ఈ నేపథ్యంలో జీవో 29 లో ఏముంది? వివాదం ఎందుకు రాజుకుంది? కోర్టులు ఎలా స్పందించాయో పరిశీలిద్దాం!

తెలంగాణలో గత సంవత్సరం కొలువు తీరిన రేవంత్ సర్కార్ గ్రూప్ -1 నియామక ప్రక్రియలో భాగంగా జీవో 29 జారీ చేసింది. దీని ప్రకారమే నిర్వహించిన ప్రిలిమ్స్ పరీక్ష ద్వారా మెయిన్స్ కు 1:50 జాబితాను ఎంపిక చేసింది. జాబితాలో బీసీ,ఎస్సీ,ఎస్టీ అభ్యర్థులకు అన్యాయం జరిగిందని వివాదం రాజుకుంది. నోటిఫికేషన్ సమయంలో జీవో ను పబ్లిక్ డొమైన్ లో పెట్టకుండా దాచారని రిజర్వేషన్ అభ్యర్థులకు అన్యాయం జరిగిందని ఆరోపిస్తూ పెద్దఎత్తున విద్యార్థులు ఆందోళన చేపట్టిన విషయం తెలిసిందే. దీనికి పలు రాజకీయ పార్టీలు సైతం మద్దతు ప్రకటించాయి. జీవో 29 ప్రకారం నోటిఫికేషన్ లో ప్రకటించిన అన్ని పోస్టులకు గాను ప్రిలిమ్స్ స్థాయిలో ఎలాంటి రిజర్వేషన్లను పాటించకుండా 1:50 చొప్పున మెయిన్స్ జాబితా ఎంపిక చేసి అందులో రిజర్వేషన్ల వారీగా షార్ట్ ఫాల్ జరిగిన చోట అదనంగా ఆయా రిజర్వేషన్ అభ్యర్థులను అదనంగా తీసుకోవడం జరిగింది. ఓపెన్ కోటాలో ఎంపికైన రిజర్వేషన్ అభ్యర్థులను సైతం ఓపెన్ కేటగిరి కింద లెక్కించకుండా రిజర్వేషన్ అభ్యర్థులుగా పరిగణించారు. దీపేందర్ యాదవ్ కేసులో అలా చేయడం తప్పని తీర్పునిచ్చింది. అందుకు విరుద్ధంగా గ్రూప్-1 మెయిన్స్ ఎంపిక జాబితా ఉండడం వివాదానికి కారణంగా మారింది.

అవకాశం కోల్పోయిన బీసీ,ఎస్సీ,ఎస్టీ అభ్యర్థులు న్యాయం కోసం కోర్టు మెట్లు ఎక్కారు. హైకోర్టు సింగిల్ బెంచ్ లో సుమారు నెలరోజుల పాటు సుదీర్ఘ వాదనలు విన్న తర్వాత కూడా కొండను తవ్వి ఎలుకను పట్టినట్లుగా జీవో 29 రాజ్యాంగ బద్ధమా!? కాదా!? తేల్చకుండానే దాఖలైన పిటిషన్ లను కొట్టివేయడం విస్మయాన్ని కలిగించిందని పలువురు రాజ్యాంగ నిపుణులు వాపోయారు. న్యాయం జరగలేదని భావించిన పలువురు అభ్యర్థులు హైకోర్టు డివిజన్ బెంచ్ ను ఆశ్రయించారు. ప్రస్తుతం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా వ్యవహరిస్తున్న అప్పటి డివిజన్ బెంచ్ న్యాయమూర్తి సుజోయ్ పాల్ విచారించి తుది తీర్పులో 'ఆలస్యం' అనే కారణంతో పిటిషన్లను కొట్టివేయడం జరిగింది. గతంలో మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తిగా పనిచేసిన సుజోయ్ పాల్ జీవో 29 తరహా జీవోను రద్దు చేయడం గమనార్హం. అట్లే వికలాంగుల కోటా విషయంలో హారిజంటల్గా రిజర్వేషన్లు అమలు చేయమని గతంలో సుప్రీంకోర్టు రాజేష్ కుమార్ దారియా కేసులో ఇచ్చిన తీర్పును సైతం పరిగణలోకి తీసుకోకుండా నోటిఫికేషన్ లో పేర్కొన్నట్లు వర్టికల్ గా అమలు పరచడాన్ని పరోక్షంగా సమర్థించినట్లయింది. న్యాయశీలత పరిశీలనలో 'ఆలస్యం' అనే అంశాన్ని పరిగణలోకి తీసుకోరాదని గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును సైతం పక్కనపెట్టి ఇచ్చిన హైకోర్టు తీర్పును పలువురు రాజ్యాంగ నిపుణులు ఆక్షేపిస్తున్నారు.

కింది కోర్టులలో న్యాయం జరగడం లేదని భావించిన అభ్యర్థులు సుప్రీంకోర్టును ఆశ్రయించగా విచారణకు స్వీకరించిన పీజీ నరసింహ ధర్మాసనం కూడా జీవో 29 రాజ్యాంగబద్ధమా?కాదా? అనే విషయాన్ని చర్చించకుండానే ఇప్పటికే పరీక్షలు పూర్తి అయినందున జోక్యం చేసుకోలేమని చేతులెత్తేసింది. న్యాయం చేయాల్సిన కోర్టులే ఇలా రాజ్యాంగ విరుద్ధంగా ఉన్న జీవోలను పరిశీలించకపోవడంతో వాటిని పరోక్షంగా సమర్థించినట్లు అవుతుందని పలువురు న్యాయ నిపుణులు బాహాటంగానే విమర్శిస్తున్నారు. గతంలో 2011 గ్రూప్-1 నోటిఫికేషన్ పరీక్షలు నిర్వహించబడి ఇంటర్వ్యూలు కూడా పూర్తయిన తర్వాత కోర్టులు జోక్యం చేసుకొని తిరిగి పరీక్షలు నిర్వహించింది కదా! ఇప్పుడు ఎందుకు జోక్యం చేసుకోలేదని ప్రశ్నిస్తున్నారు. గమ్యం చేరే క్రమంలో దారి తప్పుగా ఉంటే సరైన గమ్యాన్ని చేరుకోలేమని ఆ దారి సరైనదా? కాదా? అని నిర్ణయించాల్సిన బాధ్యత కోర్టులపై ఉన్నదని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ప్రభుత్వాలు తెచ్చిన జీవోలు రాజ్యాంగ విరుద్ధంగా ఉన్నాయని కోర్టులో సవాలు చేయబడితే ఆలస్యం కారణంగా న్యాయపరిశీలన చేయకూడదా? అట్లే ఉద్యోగ నియామక ప్రక్రియ రాజ్యాంగ విరుద్ధంగా ఉన్ననూ ప్రక్రియ అంతిమదశలో ఉన్నప్పుడు కోర్టులు జోక్యం చేసుకోరాదా? అనే విషయాలను కోర్టులు స్పష్టం చేయాల్సి ఉన్నది. అట్లే ప్రభుత్వాలు తీసుకువచ్చే జీవోలు రాజ్యాంగం కల్పించిన అతి సున్నితమైన రిజర్వేషన్ల అమలు విషయములో విరుద్ధంగా ఉన్ననూ పరిశీలించకూడదా? అనేది కూడా తేల్చాల్సి ఉంది. వీటి పైన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి మరియు భారత రాష్ట్రపతి తక్షణమే స్పందించి రాజ్యాంగానికి విఘాతం కలిగించకుండా రాజ్యాంగ పరిరక్షణకు నడుం బిగించాలని పలువురు ప్రజాస్వామికవాదులు, రాజ్యాంగ పరిరక్షకులు కోరుతున్నారు.

# బడ్జెట్ × గణతంత్ర రాజ్యం

■ గణతంత్రానికి వజ్రోత్సవం పూర్తయినా కానరాని మార్పులు ■ మధ్యతరగతికి ప్రయోజనాలంటూనే నడ్డి విరుస్తున్న పాలకులు ■ బడా వ్యాపార రాజకీయ అగ్రవర్ణాలకి మేలు చేసేలా బడ్జెట్ రూపకల్పనలు ■ ఏ రాష్ట్రంలో ఎన్నికలుంటే అక్కడ రాజకీయ ప్రయోజనాలకే కేటాయింపులు ■ అందుకే దేశ వ్యాప్త పాలకులు, ప్రజలలో వినిపిస్తున్న ఆందోళన గళాలు

భారతదేశం స్వాతంత్రాన్ని, గణతంత్ర రాజ్యాన్ని సాధించుకొని 75 సంవత్సరాలు పూర్తి ఐన కూడా దేశంలో సామాజికంగా రాజకీయంగా ఆర్థికంగా సాంస్కృతికంగా ఉన్నతమైన మార్పులు రాలేదు దానికి ప్రధాన కారణం దేశాన్ని పాలిస్తున్న అగ్రవర్ణ పాలకుల స్వార్థపూరిత అసమర్థ పాలన మూలంగానేనని గత చరిత్రను చూస్తే అర్థమవుతున్నది. మొన్న ఫిబ్రవరి.1 న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ లో ఈసారి మధ్యతరగతి ప్రజలకు ఎక్కువగా మేలు చేసే విధంగా ఉన్నదని బిజెపి నాయకులు, ఎన్డీఏ మిత్ర పార్టీల నాయకులు చెప్తున్నారు.

మధ్యతరతి కానీ వాస్తవంగా తాజా బడ్జెట్ ని దేశ ప్రజలకి పంచిపెడితే ప్రతి తలకి ఒకటి నుండి మూడు రూపాయలు వరకు వస్తది అంటే ఆ మూడు రూపాయలతో నేడు ఒక మధ్య తరగతి వ్యక్తి ఏ విధంగా సామాజికంగా రాజకీయంగా ఆర్థికంగా మెరుగు పడగలరు..? కేంద్ర ప్రభుత్వన్ని నడిపే ఎన్డీఏ వ్యక్తులు సమాధానం చెప్పాలి. మొన్న జనవరి 26 తో 76 వ గణతంత్ర దినోత్సవన్ని పూర్తి చేసుకున్నము, అసలు గణతంత్ర రాజ్యం అంటే ఏంటి దేశంలో ఉన్న ప్రతి తలని లెక్కించి దేశంలోని సంపదలో ప్రతి తలకు సమానంగా వాటా పంచడమే గణతంత్ర రాజ్యానికి నిదర్శనం. ఈ గణతంత్ర రాజ్య వ్యవస్థని అంబేద్కర్ ఆనాటి జంబూద్వీప గణ రాజ్యపాలకుడైన సామ్రాట్ అశోక మహారాజ్ పాలన నుండి గ్రహించి భారత రాజ్యాంగ గ్రంథంలో ఆయా విలువను పొందుపరిచాడు. కానీ నేడు దేశాన్ని పాలిస్తున్న కేంద్ర ప్రభుత్వాన్ని నడుపుతున్న ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ని క్షుణ్ణంగా గమనిస్తే ఏమి అర్థమవుతున్నదంటే, ఈ బడ్జెట్ పూర్తిగా బడా వ్యాపార రాజకీయ అగ్రవర్ణాలకి మేలు చేసేదిగా, నిరుపేదలైన 90% బీసీ ఎస్సీ ఎస్టీ మధ్యతరగతి సామాన్య ప్రజలకి సామాజికంగా రాజకీయంగా ఆర్థికంగా మరింత బలహీనులు చేసేదిగా నిరూపణ కాపాడుతున్నది.ఈ ఏడాది బీహార్, ఢిల్లీలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న మూలంగా రాజకీయ ప్రయోనలు దృష్టిలో పెట్టుకొని బిజెపి పార్టీకి ఓట్లు సీట్లు పెరిగేలా బడ్జెట్ ని తీర్చిదిద్దినట్టుగా ఆయా గణాంకాలను పూర్తిగా పరిశీలిస్తే స్పష్టమవుతున్నది.

కానీ అసలు బడ్జెట్ అంటే ఏంటి ఒక ఆర్థిక సంవత్సర కాలంలో దేశంలో వచ్చే సంపాదని, చేయబోయే ఖర్చును దృష్టిలో పెట్టుకొని అంచనా వేసి ఆదాయ వ్యయాల పట్టికే బడ్జెట్. అంటే దేశంలో ఉన్న ప్రతి తల నుండి ఎంత ఆదాయం వస్తున్నది మరల ఎంత ఖర్చు చేయబోతున్నాము అంచనా వేసి బడ్జెట్ ని రూపొందిస్తారు. మరి భారతదేశం అంటే ఒక్క ఢిల్లీ, బీహార్ మరియు బిజెపి పాలిత రాష్ట్రాలు మాత్రమే కాదు కదా..! 28 రాష్ట్రాలు, 8 కేంద్ర పాలిత ప్రాంతాల కలయికే భారతదేశం మరి అలాంటప్పుడు బడ్జెట్ లో ప్రతి రాష్ట్రానికి, ప్రతి కేంద్రపాలిత ప్రాంతానికి వాటా ఉండాలి కదా..! మరి మొన్న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్లో ప్రతి రాష్ట్రానికి, కేంద్ర పాలిత ప్రాంతానికి వాటాని కేటాయించినట్టుగా పేర్కొనబడలేదు.

మరి ముఖ్యంగా బిజెపి ప్రభుత్వయేతర రాష్ట్రాలకి సమృద్ధిగా బడ్జెట్లో వాటాని కేటాయించబడలేదు. ఒక్క బీజేపీ రాజకీయ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని బడ్జెట్ ని రూపొందించినట్టుగా ఆయా గణంకాలు నిరూపిస్తున్నాయి.ఇక తెలుగు రాష్ట్రాల విషయానికొస్తే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం కనుక ఏపీకి కొన్ని వేల కోట్లు కేటాయించినట్టుగా తెలుస్తున్నది కానీ తెలంగాణ విషయానికొస్తే వేల కోట్లు కాకుండా వందల కోట్లు కూడా కేటాయించకపోగా జీరో కేటాయింపు ఉన్నట్టుగా నిరూపణ కాపాడుతున్నది. మరి కొంత కాలంగా బిజెపి ఆధ్వర్యంలో గత 2014 నుండి ఎన్డీఏ ప్రభుత్వ హయాంలో దక్షిణాది రాష్ట్రాలకి బడ్జెట్లో రాజ్యాంగ బద్ధంగా ప్రజాస్వామ్యబద్ధంగా కేటాయింపు ఉండడం లేదు. కానీ కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్రల తరపున పన్నులు పంపే భాగంలో దక్షిణాది రాష్ట్రాల నుండి ఎక్కువ పన్నులు పోతున్నట్టుగా అనేక గణాంకాలు నిరూపిస్తున్నాయి.

అంటే దక్షిణాది రాష్ట్రాల నుండి కేంద్ర ఎన్డీఏ ప్రభుత్వం ఎక్కువ పన్నులు వసూలు చేస్తున్నది కానీ తిరిగి ఇవ్వడంలో దక్షిణాది రాష్ట్రాలకి ఘోర అన్యాయం చేస్తున్నట్టుగా దక్షిణాది రాష్ట్రాల ప్రాంతీయ పార్టీల నాయకులు పార్టీలకతీతంగా కేంద్ర ప్రభుత్వ తీరుని ఖండిస్తూనే ఉన్నారు. కానీ ఒక సగటు మనిషి బ్రతకాలంటే ముఖ్యంగా కావలసిన అవసరాలు మౌలిక సదుపాయాల తర్వాతనే ఏది ఐన మరి ఒక మనిషి బ్రతకాలంటే ప్రాథమికంగా కావలసినవి విద్యా వైద్యం ఉపాధి ఇల్లు భూమి కదా అనగా ఈ ఐదు మాత్రమే మనిషిని ఉన్న స్థితి నుండి ఉన్నతమైన స్థితిలోకి తీసుకెళ్లగలవు. మరి అలాంటప్పుడు ప్రభుత్వాలు వేటిపైన ఎక్కువ ఖర్చు చేయాలి తప్పకుండా అనివార్యంగా మౌలిక సదుపాయాల మీద బడ్జెట్లో కేటాయింపులు జరగాలి అదే గణతంత్ర రాజ్యానికి నిదర్శనం. మరి తాజాగా నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్లో విద్యా వైద్య ఉపాధి ఇల్లు భూమి కి ఎలాంటి ప్రాధాన్యత ఇవ్వకుండా మరి వేటికి ప్రాథమిక ఇచ్చినట్టు దీనికి ఎన్డీఏ నాయకులు సమాధానం చెప్పగలరా..? ప్రభుత్వాన్ని నడిపే ఆయా పార్టీల నాయకులు ప్రజలకు ప్రాథమికంగా ఇవ్వాల్సినవి మౌలిక సదుపాయాలు కదా అవి ఇవ్వకుండా రాజకీయ ప్రయోజనాల దృష్టిలో పెట్టుకొని ఎన్ని ఉచిత పథకాలు ఇచ్చిన మనిషిని ఉన్నతంగా తీర్చిదిద్దలేరు కదా అందుకనే భారతదేశం 75 సంవత్సరాల స్వాతంత్ర, గణతంత్ర రాజ్యాన్ని పూర్తి చేసుకున్న మానవ అభివృద్ధి సూచీలో మాత్రం అత్యంత వెనుకబడి ఉన్నది. మరి ఆ మానవ అభివృద్ధి సూచిలో ముందు వరుసలో ఉండాలంటే ఏమి కావాలి దేశంలో ఉన్న ప్రజలందరికీ కూడా కుల మతాలకతీతంగా, ప్రాంతాలకి పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరికి ప్రభుత్వం తరపున నాణ్యమైన సంపూర్ణమైన విద్యని వైద్యాన్ని ఉపాధిని ఇల్లుని భూమిని కల్పిస్తే ప్రతి కుటుంబం స్వశక్తిగా స్వతంత్రంగా బ్రతకగలరు.పరన్న జీవులుగా ప్రభుత్వంపై ప్రతిదానికి ఆధారపడరు అప్పుడు మానవ అభివృద్ధి సూచిలో భారతదేశం ముందు వరుసలో ఉండగలదు మానవ అభివృద్ధి సూచిలో ముందు వరుసలో ఉన్నదంటే అభివృద్ధి చెందిన దేశంగా భారతదేశం ప్రపంచ దేశాల ముందు పరికరించబడుతది. కానీ ప్రపంచంలో జనాభాలో రెండవ స్థానంలో భారతదేశం ఉన్నప్పటికీ ఏ దేశానికి లేని మానవ వనరులు, సహజ వనరులు, యువత దేశంలో ఉన్నప్పటికీ మానవ వనరులని మరి ముఖ్యంగా యువత నైపుణ్యాల్ని దేశపాలకులు వినియోగించుకోవడంలో తద్వారా దేశానికి ఆదాయాన్ని పెంచడంతో ఘోరంగా విఫలమవుతున్నట్టుగా నిరూపణ కాపాడుతున్నది. మరి తలసరి ఆదాయం పెరగాలంటే ఏమి చేయాలి ప్రభుత్వలని నడిపే పార్టీలు ఉపాధికి ప్రాముఖ్యతనిచ్చి ఉన్నతమైన చదువుని అభ్యసించిన ప్రతి ఒక్కరికి వారి అర్హతకు తగ్గట్టుగా ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించాలి, ప్రభుత్వ ఉద్యోగం కల్పించలేనప్పుడు పరిశ్రమలు ఏర్పాటు చేసి ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో లక్షలాది ఉద్యోగాలు కల్పించినప్పుడు దేశంలో నిరుద్యోగం రేటు తగ్గిపోతుంది తద్వారా ఉద్యోగ అవకాశాలు పెరిగి దేశానికి ఆదాయం పెరుగుతుంది, తద్వారా ప్రత్యక్షంగా పరోక్షంగా ప్రభుత్వానికి ఆదాయం పెరిగి, దేశ తలసరి ఆదాయం, జాతీయ ఆదాయం పెరుగుతుంది. అవి పెరగాలంటే ముందుగా ప్రభుత్వాలు దేశంలో యువతకి ఉపాధి అవకాశాలు కల్పించాలి కానీ మోడీ నాయకత్వంలో ఎన్డీఏ ప్రభుత్వ హయాంలో దేశంలో ఉన్న యువతకి ప్రభుత్వ, ప్రభుత్వయేతర ఉపాధి అవకాశాలు చాలా తక్కువ సంఖ్యలో కల్పించబడినవి కాబట్టి గత పది సంవత్సరాల నుండి దేశంలో నిరుద్యోగిత రేటు పెరుగుతుంది. ఇక మౌలిక సదుపాయాలు కల్పించడంలో భాగంగా విద్య, వైద్యానికి వస్తే దేశంలో ఉన్న ప్రతి రాష్ట్రంలోని జిల్లా, మండలాల్లో అత్య ఆధునిక సౌకర్యాలతో కేంద్ర ప్రభుత్వం తరపున పాఠశాల లని, వైద్యశాల లని ఏర్పాటు చేస్తామని తాజా బడ్జెట్లో ప్రవేశపెట్టి ఉండినట్లయితే విద్య వైద్య వ్యవస్థలో ఎన్డీఏ ప్రభుత్వం విప్లవాత్మకమైన విధానాలకి పునాది వేసినట్టుగా భావించే వాళ్ళం కానీ అది జరగలేదు. అదేవిధంగా దేశంలో నేడు సొంత ఇల్లు లేని వాళ్లు లక్షల కుటుంబాలు ఉన్నాయి. అంతే కాకుండా దేశంలో నేడు ఎవరిపై ఆధారపడకుండా స్వతంత్రంగా వ్యవసాయ సాగు చేసుకుని బ్రతకడానికి ఒక ఎకర కూడా భూములు లేని కుటుంబాలు లక్షల,కోట్ల మంది ఉన్నారు. మరి అలాంటప్పుడు ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ బడ్జెట్లో దేశంలో సొంత ఇల్లు లేని కుటుంబాలకి కేంద్ర ప్రభుత్వమే ఉచితంగా సొంత ఇల్లు కట్టించి, ప్రతి కుటుంబం స్వశక్తిగా బ్రతకడానికి సాగునీటి సౌకర్యంతో కూడిన ఒక ఎకరా ఉచిత వ్యవసాయ భూమిని కల్పిస్తామని అందుకు తగిన విధంగా చట్టం చేస్తామంటే, దేశ చరిత్రలో ఈ బడ్జెట్ చరిత్రత్మమైనదిగా ఉండును కానీ అలా జరగలేదు.

కానీ భారత రాజ్యాంగం ఏమో దేశ ప్రజలందరికీ ప్రాథమికంగా మౌలిక సదుపాయాలు ఐన నాణ్యమైన విద్యా వైద్య ఉపాధి ఇల్లు భూమిని ప్రభుత్వాలు ఉచితంగా కల్పించాలని చెప్తుంటే, దేశాన్ని గతంలో 50 ఏళు పాలించిన కాంగ్రెస్ పార్టీ, గత పదేళ్ల నుండి బిజెపి ఆధ్వర్యంలోని ఎన్డీఏ ప్రభుత్వం దేశ ప్రజలకి మౌలిక సదుపాయాలు కల్పించడంలో ఘోరంగా విఫలమైనట్టుగా నిరూపణ కాపాడుతున్నది. అందుకు నిదర్శనమే నేడు దేశంలో మౌలిక సదుపాయాలు లేక లక్షలాది కుటుంబాలు పేదరికంలో ఉంటూ తమ పిల్లల్ని ఉన్నతంగా చదివించుకోలేకపోతూ, ప్రభుత్వపరంగా నాణ్యమైన వైద్యాన్ని పొందలేకపోతున్నారు. ప్రభుత్వాల నుండి సమృద్ధిగా ఉపాధిని పొందలేకపోతున్నారు. ఉండడానికి సొంత ఇల్లుని కలిగి ఉండలేకపోతున్నారు. సాగు భూమిని చేసుకుని బ్రతకడానికి సొంత భూమిని కలిగి ఉండలేకపోతున్నారు.మరి వీటికి కారకులు ఎవరు..? దేశాన్ని పాలిస్తున్న బిజెపి ప్రభుత్వ నాయకులకి, బిజెపి కంటే ముందు కేంద్రంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ నాయకులకి దేశంలో ఉన్న నిరుపేదలకి సంపూర్ణమైన మౌలిక సదుపాయాలు కల్పించడంలో ఘోరంగా విఫలమైనట్టుగా చరిత్రలోని గణంకాలు రుజువు చేస్తున్నాయి. భారతదేశమంటే గణతంత్ర రాజ్యము కాబట్టి దేశ సంపదలో ప్రతి తలకి సమాన వాటా ఉండాలి. అధికారంలో కుల మతాలకతీతంగా, ప్రాంతాలకి పార్టీలకి అతీతంగా అధికారంలో సమాన వాటా ఉండాలి కానీ నాటి నుండి నేటి వరకు కేంద్ర ప్రభుత్వంలో ఉన్న బిజెపి కాంగ్రెస్ నాయకులు సామాజికంగా రాజకీయంగా ఆర్థికంగా సాంస్కృతికంగా ఉన్నతంగా ఉండిన 10% అగ్రవర్ణాలకే పెద్దపీట వేస్తున్నట్టుగా, దేశంలో మెజార్టీగా 100 కోట్ల పైగా ఉన్న బీసీ ఎస్సీ ఎస్టీ మధ్యతరగతి ప్రజలని సామాజికంగా రాజకీయంగా ఆర్థికంగా బలహీన పరుస్తున్నట్టుగా అనేక సర్వేలు గణంకాలు నిరూపిస్తున్నాయి. కేంద్రాన్ని పాలించే ఏ పార్టీ అయినా బడ్జెట్లో ముందుగా దేశంలో ఉన్న పేదరికం తగ్గించడంలో భాగంగా మౌలిక సదుపాయాలకి ఎక్కువ ధనాన్ని కేటాయించినట్లయితే తలసరి ఆదాయం, జాతియ ఆదాయం మెరుగ్గా ఉంటది. ప్రజలకి మౌలిక సదుపాయాలు కల్పించకుండా ఆకాశన్ని తలదన్నే విధంగా పెద్ద పెద్ద భవంతులు,భారీస్థాయిలో రోడ్లు, బుల్లెట్ ట్రైన్లు వేయడం మూలంగా పేదరికం తగ్గదు కదా సగటు మనిషిగా ప్రభుత్వం నుండి సంపూర్ణమైన మౌలిక సదుపాయాలు పొందలేకపోతున్నప్పుడు అత్యాధునిక టెక్నాలజీ ఉండి ఏమి లాభం..? కాబట్టి దేశాన్ని పాలిస్తున్న ఏ పార్టీలైనా ప్రజలకి ప్రాథమికంగా ఇవ్వాల్సినవి ఆయా ప్రభుత్వాల తరపున నాణ్యమైన అత్యాధునిక సౌకర్యాలతో కూడిన ఉచిత విద్య వైద్య ఉపాధి ఇల్లు భూమి మాత్రమే ఆ తర్వాతనే ఏదైనా అనే అంశాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టిలో పెట్టుకొని విధివిధానాలు అమలుపరచాలి అంతే కానీ అనవసరమైన ఉచిత పథకాలు ప్రవేశపెట్టి దేశ ఆర్థిక వ్యవస్థని బలహీనం చేయడమే అవుతాది. అదేవిధంగా ప్రజలు కూడా ఆయా పార్టీల ఉచిత పథకాలకి ఆకర్షితులై ఓట్లు వేసి మౌలిక సదుపాయాలు పొందలేకుండా మోసపోకుండా ముందుగా ఉన్నతంగా బ్రతకడానికి ప్రభుత్వాలు, పార్టీలు నాణ్యమైన విద్యా వైద్య ఉపాధి ఇల్లు భూమి కల్పించేలా ప్రజలు ప్రభుత్వాలను, ఆయా పార్టీ నాయకులని ప్రశ్నిస్తూ సాధించుకోవాల్సిన చైతన్యంలోకి రావాలి. అప్పుడు మాత్రమే దేశంలో సామాజిక రాజకీయ ఆర్థిక పరివర్తన గొప్పగా ఉంటది తప్ప, సగటు మనిషిగా ప్రభుత్వాల నుండి మౌలిక సదుపాయాలు పొందలేనంత కాలం భారతదేశం అభివృద్ధి పరంగా వెనక్కి నెట్టి వేయబడతది అనే అంశాన్ని పాలకులు గ్రహించాలి. ప్రపంచంలో నేడు అభివృద్ధిలో ముందు వరుసలో ఉన్న అమెరికా చైనా జపాన్ మొదలగు దేశాలు అగ్రస్థానంలో ఉండటానికి ప్రధాన కారణం ఆయా దేశ ప్రభుత్వాలు ప్రజలకి ఉన్నతమైన విద్యా వైద్య ఉపాధి ఇల్లు భూమి సౌకర్యలు కల్పిస్తూ తలసరి ఆదాయం జాతియ ఆదాయం పెంచుకుంటున్నారు. కాబట్టి ఆయా దేశాలు అగ్రస్థానంలో ఉండగలుగుతున్నవి, కాబట్టి భారతదేశాన్ని పాలిస్తున్న పాలకులు కూడా దేశంలో ఉన్న ప్రజల మధ్య కుల మతాలకతీతంగా, ప్రాంతాలు పార్టీలకతీతంగా తారతమ్య భేదాలు పెంపొందించకుండా నైతిక విలువలు మానవత విలువలు పాటిస్తూ ప్రజాస్వామ్య బద్ధంగా రాజ్యాంగ బద్ధంగా ప్రతి కుటుంబానికి ప్రభుత్వాల తరుపున అత్యున్నతమైన మౌలిక సదుపాయాలు కల్పించినప్పుడే భారతదేశం కూడా ప్రపంచ దేశాలతో అభివృద్ధిలో పోటీ పడగలదు. అంతిమంగా ఒక్క మాటలో చెప్పాలంటే భారత రాజ్యాంగాన్ని 100% సంపూర్ణంగా అమలు చేసినట్లయితే భారతదేశంలో లక్షల కోట్లు ఉన్న నిరుపేదలందరూ కూడా ఉన్నతులుగా తీర్చిదిద్దబడి అమెరికానే వెనక్కి నెట్టి భారతదేశమే అగ్రస్థానంలో ఉంటూ ప్రపంచ దేశాలకు పెద్దన్నగా ఉండగలదు. అంతటి శక్తి భారత రాజ్యాంగ గ్రంథానికి ఉన్నది కాబట్టి అందుకు తగిన విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నూతన విప్లవాత్మకమైన పథకాలు ప్రవేశపెట్టాల్సిన అవసరం ఉన్నదనే అంశాన్ని ఆయా పార్టీ నాయకులు గ్రహించి పరివర్తన చెందాలి. అప్పుడు మాత్రమే భారతదేశంలో సామాజిక రాజకీయ ఆర్థిక సాంస్కృతిక రంగంలో ఉన్నతమైన మార్పులు చూడగలము.

పుల్లెంల గణేష్ 9553041549



# మేం ఇజ్రాయెల్‌తో కలిసి ఇరాన్‌ను దెబ్బతీయడమా..?

మేం ఇజ్రాయెల్ తో కలిసి ఇరాన్ ను దెబ్బతీయడమా..?
ఇజ్రాయెల్ తో కలిసి ఇరాన్‌ను దెబ్బతీసేందుకు అమెరికా పని చేస్తోందంటూ కొన్ని మీడియాల్లో కథనాలు వచ్చాయి. ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమన్ నెతన్యాహు తో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భేటీ అనంతరం ఈ ఊహాగానాలు మొదలయ్యాయి. దీనిపై తాజాగా ట్రంప్ స్పందించారు. ఇవి కేవలం పుకార్లు మాత్రమేనంటూ కొట్టిపారేశారు.
"ఇరాన్‌ను దెబ్బతీసేందుకు ఇజ్రాయెల్‌తో కలిసి అమెరికా పని చేస్తోందంటూ వచ్చిన కథనాలు అతిశయోక్తిగా ఉన్నాయి. ఇరాన్ శాంతియుత అణ్వాయుధ ఒప్పందం కుదుర్చుకోవాలని ఆశిస్తున్నా. ఎందుకంటే, ఇది శాంతియుతంగా ఆ దేశం అభివృద్ధికి ఉపయోగపడుతుంది. ఇరాన్ గొప్ప దేశంగా ఉండాలని కోరుకుంటున్నాను. అణ్వాయుధాలు కలిగిన దేశంగా కాదు. ఇరాన్ వద్ద అవి ఉండకూడదు" అని ట్రంప్ స్పష్టం చేశారు.
కాగా.. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు అమెరికా పర్యటనకు వెళ్లిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా ఆయన.. ట్రంప్ తమ దేశానికి మిత్రుడని అన్నారు. అంతేకాకుండా, ఆయన ఆలోచన తీరు హమాస్ చర్యలను అడ్డుకోవడంతో ఉపయోగపడుతాయని పేర్కొన్నారు. నెతన్యాహుతో భేటీకి ముందు ట్రంప్ ఇరాన్ విషయంలో కీలక నిర్ణయం తీసుకున్నారు. టెహ్రాన్ చమురు ఎగుమతులను పూర్తిగా సున్నాకు తీసుకొచ్చి.. ఆ దేశ అణ్వాయుధ తయారీ యత్నాలను అడ్డుకోవడమే లక్ష్యంగా కఠిన నిబంధనలు పునరుద్ధరించారు. అందుకు సంబంధించిన పత్రాలపై ఆయన సంతకం చేశారు. నెతన్యాహు పర్యటనతో ఇరాన్‌కు వ్యతిరేకంగా ఇరుదేశాలు ప్రణాళిక రచిస్తున్నట్లు కథనాలు వచ్చాయి. దీనిపై తాజాగా స్పందించిన ట్రంప్.. ఈ వ్యాఖ్యలు చేశారు


# త్రివేణి సంగమంలో ప్రధాని మోడీ పుణ్యస్నానం

■ సంగమ్ వద్ద బోట్ లో విహారం ■ ఘాట్ నుంచి పడవలో మహాకుంభమేళా స్థలికి రాక ■ సాధు సంతులతో ప్రధాని భేటీ - పలు అంశాలపై చర్చ ■ మహాకుంభ మేళా ఏర్పాట్లపై ప్రధాని అధికారులతో సమీక్ష

ప్రయాగ : అతిపెద్ద ఆధ్యాత్మిక కార్యక్రమం మహాకుంభమేళాకు ఒక భారతదేశం నుంచే కాక.. ప్రపంచ వ్యాప్తంగా నలు దిక్కుల నుంచి భక్తులు పోటెత్తుతున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ మహా కుంభమేళాలో పాల్గొన్నారు. సంగమ్ వద్ద బోట్ ఆయన విహారించారు. ప్రధాని త్రివేణి సంగమంలో పుణ్య స్నానం చేశారు. అనంతరం నదిలోకి దిగి గంగాదేవి ప్రార్థన, ప్రత్యేక పూజలు చేశారు. ప్రధాని చేతిలో రుద్రాక్ష జపమాల పట్టుకుని మంత్రాలు జపిస్తూ సంగమంలో స్నానం ఆచరించారు. ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ కూడా ప్రధానితో ఉన్నారు. ముందు ప్రయాగ్ రాజ్ విమానాశ్రయంలో దిగిన ప్రధాని నరేంద్ర మోదీ అక్కడ నుంచి అరైల్ ఘాట్కు వచ్చారు. ఘాట్ నుంచి పడవలో మహాకుంభమేళా జరుగుతోన్న స్థలానికి వచ్చారు. పుణ్యస్నానం, ప్రత్యేక పూజల అనంతరం సాధు



సంతులతో ప్రధాని మోదీ భేటీ అయ్యారు. . మహాకుంభ మేళా ఏర్పాట్లపై ప్రధాని అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.
ప్రయాగ్ రాజ్లో గత నెల 13వ తేదీన మహాకుంభమేళా ప్రారంభమైంది. కుంభమేళాకు ప్రపంచ వ్యాప్తంగా భక్తులు తరలివస్తున్నారు. ఒక్క భారతదేశమే కాకుండా ఇతర దేశాల నుంచి కుంభమేళాకు వచ్చి పవిత్ర స్నానాలు చేస్తున్నారు. మహాకుంభ మేళా ఇంకా 20 రోజుల పాటు కొనసాగనుంది. ఫిబ్రవరి 26న మహాశివరాత్రి వరకు కుంభమేళా జరగనుంది. ఈ రోజు ఉదయం 8 గంటల వరకు 39 కోట్లకు పైగా భక్తులు గంగా, యమునా, ఆధ్మాత్మిక సరస్వతి సంగమంలో పవిత్ర స్నానం ఆచరించారు.
ప్రస్తుతం, మహా కుంభమేళా 24వ రోజు కొనసాగుతోంది. ఈ కుంభమేళాలో పాల్గొనేందుకు భక్తులు పోటేత్తి వస్తున్నారు.. గంగ, యమున, సరస్వతి సదులు కలిసే పవిత్ర త్రివేణీ సంగమం వద్ద కోట్లాది భక్తులు పుణ్యస్నానాలు ఆచరిస్తున్నారు. ఈ నేపథ్యంలో కుంభమేళా ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకూ కోట్ల మంది భక్తులు పుణ్య స్నానాలు ఆచరించారు. మహా కుంభమేళా ప్రారంభం నుంచి ఇప్పటి వరకూ 39 కోట్ల మంది భక్తులు పుణ్య స్నానాలు చేసినట్లు యూపీ అధికారులు తెలిపారు. కాగా.. ఈ రోజు ఉదయం 37 లక్షల మందికిపైగా భక్తులు పవిత్ర స్నానాలు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. అందులో 10 లక్షల మంది కల్పవాసీలు కూడా ఉన్నట్లు తెలిపారు. కాగా, సంక్రాంతి



సందర్భంగా జనవరి 13న ప్రారంభమైన ఈ మహాకుంభమేళా ఫిబ్రవరి 26 శివరాత్రి రోజున ముగియనుంది. 45 రోజులపాటు సాగే ఈ కుంభమేళాలకు దాదాపు 50 కోట్ల మంది హాజరవుతారని ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం అంచనా వేసింది. అందుకు తగ్గట్లుగానే భక్తులును దృష్టిలో ఉంచుకుని ఏర్పాట్లు చేసింది.




# 42 శాతం బిసి రిజర్వేషన్లు ఇక అందని ద్రాక్షేనా?




(తేజస్వి)

■ వివాదాల నడుమ పూర్తయిన బీహార్ కులగణన ■ వివాదాల నడుమ పూర్తయిన బీహార్ కులగణన ■ తెలంగాణలో సమగ్ర కుటుంబ సర్వే పేరుతో కుల గణన పూర్తి ■ అసలు బిసిల జనాభా యాభై శాతం పైమాటే అంటున్న సంఘాలు ■ గత ప్రభుత్వం అధికారంలో బిసి రిజర్వేషన్ శాతం తగ్గింది ■ దీంతో అందరి రూపు రేవంత్ సర్కారుపై నే

హైదరాబాద్‌: ఎప్పటినుండో దేశంలో జనగణనతో పాటు కులగణన కూడా జరగాలన్న డిమాండ్లు వినిపిస్తూ ఉన్నాయి. 2015 లో కర్ణాటక కులగణన వైపు అడుగులు వేస్తే తర్వాత 2023 లో వివాదాల నడుమ బీహార్ కూడా కులగణన పూర్తి చేసింది. ఆ తర్వాత ఈ కుల గణన ఇంకెక్కడా జరగలేదు. రాహుల్ గాంధీ పదేపదే ఈ అంశాన్ని ప్రస్తావిస్తూనే ఉన్నారు. మొత్తానికి ఇప్పుడు తెలంగాణ కూడా సర్కార్ సమగ్ర కుటుంబ సర్వే పేరుతో కుల గణన కూడా పూర్తి చేసింది. అందులో భాగంగా బీసిల శాతాన్ని 46 శాతంగా తేల్చింది. కానీ ఈ నిర్ణయంపై బిసి నేతలు ఆమోదం తెలపలేదు అలాగే సంతోషంగా కూడా లేరు, పైపెచ్చు విమర్శిస్తున్నారు. అసలు గణన చేయకపోయినా మాములుగానే బిసిల జనాభా యాభై శాతం పైనే ఉంటుందని, ఈ కుల గణన అశాస్త్రీయమైనదని, తమకు అన్యాయం జరిగిందనే బిసీ నాయకులు ఆరోపిస్తున్నారు.
ఎన్ టి రామారావు అధికారంలో ఉన్నప్పుడు స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు రిజర్వేషన్లు మొదటిసారి ప్రవేశపెట్టారు. మొదట్లో అది 20 శాతం ఉంటే, తర్వాత కోట్ల విజయ భాస్కర్ రెడ్డి నాయకత్వంలో 34 శాతానికి పెరిగితే, 2019 లో బి ఆర్ ఎస్ ప్రభుత్వం దాన్ని 22 శాతానికి కుదించింది. 2018 నుండి కాంగ్రెస్ కులగణనకు సానుకూల స్వరాన్నే వినిపిస్తూ ఉంది. 2018 లో బిసి కులగణన చేస్తామని కాంగ్రెస్ తమ మేనిఫెస్టో లో ప్రకటించింది కూడా. 2023 తెలంగాణ ఎన్నికల సమయంలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం కామారెడ్డిలో బిసి డిక్లరేషన్ సభ పెట్టి, స్థానిక సంస్థల్లో వారికి 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని భరోసా ఇచ్చింది. ఇప్పుడు మొత్తానికి తెలంగాణలో గత ప్రభుత్వం అధికారంలో బిసి రిజర్వేషన్ శాతం తగ్గడంతో కొత్త ప్రభుత్వం తప్పక తమకు న్యాయం చేస్తుందని బిసిలు ఎదురు చూసారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం తాము ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నామని ధీమాగా చెప్తున్నారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి అసెంబ్లీలో మాట్లాడుతూ, 'చట్టపరంగా బిసిలకు 42 శాతం రిజర్వేషన్ ఇవ్వాలంటే రాజ్యాంగ సవరణ జరగాలి' అన్నారు. ఇది నిజంగా సాధ్యమయ్యే విషయమేనా? ఇప్పుడున్న పరిస్థితుల్లో కేంద్రాన్ని ఒప్పించి రాజ్యాంగ సవరణను కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకురాగలదా? లేకపోతే ఇటు రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం ఒకరిపై ఒకరు నెపం వేసుకుంటూ ఈ విషయాన్నీ వెనక్కి నేట్టేస్తారా? ఇవన్ని తేలాల్సిన విషయాలు.
ఇక స్థానిక సంస్థల ఎన్నికల విషయానికి వస్తే ఎస్సి ఎస్టిలకు రిజర్వేషన్లు దామాషా పద్ధతి ప్రకారం రాజ్యంగబద్ధంగా కల్పిస్తున్నారు. కాని బిసిలకు మాత్రం ఆయా ప్రభుత్వాలే రిజర్వేషన్లు ప్రకటిస్తున్నాయి. ప్రభుత్వాలు ప్రకటించే రిజర్వేషన్ల గురించి ఎప్పుడు వివాదాలు, న్యాయ పరమైన అంశాలు తలెత్తడం కూడా ఒక పరిపాటిగా మారిపోయింది. ఈ రిజర్వేషన్ల పై ఒక కేసు సందర్భంలో సుప్రీమ్ కోర్టు కొన్ని మార్గదర్శకాలు కూడా ఇచ్చింది. అందులో ఒక మార్గదర్శకం ప్రకారం ప్రతి స్థానిక సంస్థలో ఓబిసి రిజర్వేషన్ల అమలు, ఫలితాలపై అధ్యయనం చేయడానికి ఒక డెడికేషన్ కమిటిని ఏర్పాటు చేయాలి. రెండవ దాని ప్రకారం జనాభా నిష్పత్తిని అనుసరించి ఈ రిజర్వేషన్లు నిర్ణయించాలి. మూడోది మొత్తం ఎస్సి,ఎస్టి, ఓబిసి మొత్తం కలిపి 50 శాతానికి మించకూడదు. ఈ నిబంధనలకు విరుద్ధంగా ఎక్కడా రిజర్వేషన్లు అమలు చేయకూడదని కూడా సుప్రీమ్ కోర్టు స్పష్టం చేసింది. సుప్రీమ్ కోర్టు మార్గదర్శకాలకు విరుద్ధంగా ప్రవర్తించిన గుజరాత్,మహారాష్ట్ర వంటి రాష్ట్రాల్లో స్థానిక సంస్థల ఎన్నికలు కూడా రద్దు చేసింది.
ఈ సుప్రీం కోర్టు ఆదేశాలను అనుసరించి చేస్తే బిసిలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీ ప్రకారం 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయడం దాదాపు అసాధ్యమైన విషయమనే చెప్పుకోవచ్చు. అందులోనూ ఇప్పుడు జరిగిన కులగణనలో బిసి జనాభానే 46 శాతంగా ప్రభుత్వం తెల్చినప్పుడు, ఇక మొత్తం ఎస్సి,ఎస్టి, ఓబిసి మొత్తం కలిపి 50 శాతం మించకూడదన్న మార్గదర్శకాన్ని అనుసరించి ఈ 42 శాతం అమలు చేయడం సుప్రీం కోర్టు మార్గదర్శ ఉల్లంఘనే అవుతుంది. ఇంకో వైపు బిసి నాయకులు ఈ కుల గణన అన్నది కేవలం ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని తమకు అనుకూలంగా ప్రభుత్వం అడ్జస్ట్ చేసి చేసినట్టు ఉందే తప్ప అసలు లెక్కలు లేవని ఆరోపిస్తున్నారు. అలాగే తెలంగాణా జనాభా 4 కోట్ల పది లక్షలు ఉంటె, ఈ నివేదికలో మాత్రం అది 3 కోట్ల 54 లక్షలుగా చెప్పారని ఎనలిస్ట్ శేషు పేర్కొన్నారు ఒక న్యూస్ డిబేట్ లో. ఇలా ఏ లెక్కన చూసినా ఈ బిసి కుల గణనను ప్రభుత్వం చేసినప్పటికీ ఊహించిన సానుకూల స్పందన మాత్రం బిసి వర్గం నుండి రాలేదు. నిరసనలు మాత్రమె వెల్లువెత్తుతున్నాయి.
కాంగ్రెస్ ఎమ్మెల్సిగా ఉన్న తీన్మార్ మల్లన్న, 'బిసిలను ఇంకా అణగద్రొక్కడానికి చేసిన ఒక కుట్ర ఈ నివేదిక. ఈ నివేదికను నేను ఎప్పుడు అంగీకరించను' అని గట్టిగా అనడమే కాకుండా ఆ కుల గణన నివేదికను బహిరంగంగా కాల్చేసాడు. బిసి నాయకుల్లో ఎవరూ కూడా ఈ కుల గణనను ఆహ్వానించిన దాఖలాలు లేవు. మొత్తం మీద తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన కుల గణన ఊహించిన స్థాయి సానుకులతను సొంతం చేసుకోలేకపోయింది. ఇక బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు అన్నది ప్రస్తుతానికి దూరమైన లక్ష్యంలాగానే అనిపిస్తుంది.

# ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతం

**ఓటు వినియోగించుకున్న ముర్ము, రాహుల్**
**స్వచ్ఛ రాజకీయాలు ఎక్కడంటూ కాంగ్రెస్ నేత ప్రశ్న**

ఢిల్లీః : ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఉదయం ఏడు గంటలకు మొదలైన ఓటింగ్ ప్రక్రియ 6గంటలకు ముగిసింది. సాయంత్రం 5గంటల వరకు 57.70 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. నార్త్-ఈస్ట్ దిల్లీ నియోజకవర్గంలో అత్యధికంగా 52.73శాతం పోలింగ్ నమోదుకాగా.. న్యూదిల్లీలో అత్యల్పంగా 43.1శాతం పోలింగ్ రికార్డైంది. తొలి గంటలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, దిల్లీ సీఎం ఆతిశీ, కేంద్ర మంత్రి జై శంకర్ సహా పలువురు ప్రముఖులు తొలి గంటల్లోనే తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.
అనంతరం ఎక్స్ తన భావాలను వ్యక్తం చేశారు రాహుల్గాంధీ. ఇవాళ ఓటు వేయడానికి మీరందరూ వెళ్లాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్కు మీరు వేసే ప్రతి ఓటు మీ హక్కులను కాపాడు తుందని మనసులోని మాట వెల్లడించారు. రాజ్యాంగాన్ని బలోపేతం చేస్తుందని, ఢిల్లీని తిరిగి ప్రగతి పథంలో నడిపిస్తుందని ప్రస్తావించారు. ఓటు వేసేటప్పుడు కలుషితమైన గాలి, మురికి నీరు, పాడైన రోడ్లకు బాధ్యులు ఎవరో గుర్తుంచు కోవాలని సున్నితంగా ఆమ్ ఆద్మీ పార్టీపై సెటైర్లు వేశారు. స్వచ్ఛ రాజకీయాలు చేస్తామని చెప్పి ఢిల్లీలో అతిపెద్ద కుంభకోణం చేసిందెవరు? అంటూ ప్రశ్నించారు. గడిచిన పదేళ్లు ఏఏపీలో ఢిల్లీలో అధికారంలో ఉంది. ఈ క్రమంలో వాటిపై ప్రస్తావించారన్నది కాంగ్రెస్ నేతల మాట. అటు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా రియాక్ట్ అయ్యారు. ఢిల్లీ ప్రజలు తమ అమూల్యమైన ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. మీ ఓటు ఢిల్లీలో మార్పుకు ప్రతీక అని రాసుకొచ్చారు. ఢిల్లీ మునుపటి మాదిరిలా అభివృద్ధి పథంలో ముందుకు సాగాలంటే, పని చేసిన వారిని ఎన్నుకోవాలన్నారు. తప్పుడు వాగ్దానాలు చేసి మిమ్మల్ని మోసం చేయలేదన్నారు. పాడైన రోడ్లు, మురికి నీరు, కలుషిత గాలి కోసం ఒక్క అడుగు కూడా ముందుకు వేయకుండా కేవలం సాకులు చెప్పేవారు ఈవీఎం బటన్ను నొక్కే ముందు మీ గురించి ఎంత శ్రద్ధ వహిస్తారో ఆలోచించాలన్నారు. కేవలం కుస్తీ పట్టి అధికారాన్ని నిలబెట్టుకోవాలనుకునే వారు మీ ఓటుకు అర్హులు కారని పేర్కొన్నారు. సోదరభావం, సామరస్యం, శ్రేయస్సు అందరితో కూడిన అభివృద్ధి చాలా ముఖ్యమైనవి రాసుకొచ్చారు. ఢిల్లీని ప్రగతి పథంలో నడిపించిన వారినే ఎన్నుకోవాలన్నారు. ఈ ప్రజాస్వామ్య ఉత్సవానికి మిమ్మల్ని స్వాగతించాలని, ఓటింగ్లో పాల్గొనాలని యువతను, ముఖ్యంగా మొదటిసారి ఓటర్లను అభ్యర్థించారు.
మరోవైపు ఆమ్ ఆద్మీ పార్టీ కూడా రియాక్ట్ అయ్యింది. బీజేపీ ప్రజల ఓటు హక్కును హరిస్తోందని రాసుకొచ్చింది. ఓటింగ్లో పాలుపంచుకోలేని విధంగా ఢిల్లీలో అమాయక ప్రజల చేతి వేళ్లపై బీజేపీ సిరా వేస్తోందన్నారు. ఈ విధంగా బీజేపీ.. పౌరుల





ఓటు హక్కును, పౌరుడిగా ఉండడాన్ని హరిస్తోందన్నారు. ఇదంతా ఢిల్లీ పోలీసులు, ఎన్నికల సంఘం సమక్షంలో జరుగుతున్నా ఇద్దరు మౌనంగా ఉన్నారని ప్రస్తావించింది.
హస్తిన పీఠానికి దాదాపు మూడు దశాబ్దాలుగా దూరమైంది బీజేపీ. ఈసారి ఎలాగైనా ఢిల్లీ కుర్చీని దక్కించుకోవాలని ఉవ్విల్లూరుతోంది. గెలుపు కోసం సర్వశక్తులు ఒడ్డుతోంది. దశాబ్దంపాటు అధికారంలో ఉన్న ఏఏపీ, ఎన్ని వివాదాలు ఎదురైనా మళ్లీ అధికారంలోకి వచ్చేది తామేనని కుండబద్దలు కొడుతోంది. కాంగ్రెస్ పార్టీ దశాబ్ద కాలంగా హస్తిన పీఠానికి దూరమైంది. సింపుల్గా చెప్పాలంటే గడిచిన కొన్నేళ్లు అక్కడి కుర్చీ జాతీయ పార్టీలకు అందని దాక్షగానే మిగిలింది.
డిల్లీలోని మొత్తం 70 అసెంబ్లీ స్థానాలకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు. 220 కంపెనీల పారామిలటరీ బలగాలను మోహరించారు. 19 వేల హెూంగార్డులు, 42వేల మంది పోలీసులు, 660 మంది ఫ్లయింగ్ స్క్వాడ్ లు ఈ ఎన్నికల్లో పటిష్ట భద్రత నిర్వహిస్తున్నారు. 10 రాష్ట్రాల నుంచి బలగాలను మోహరించింది

# పాక్ ఆక్రమిత కశ్మీరులో హమాస్..

■ హైఅలర్ట్‌లో నిఘా వర్గాలు..! ■ తదుపరి టార్గెట్ భారత్ అంటూ పుకార్లు ■ పీవోకే లో 'అల్ అక్సా ఫ్లడ్స్' పేరిట కార్యక్రమం ■ హాజరైన లష్కరే తోయిబా, జైషే మహమ్మద్ ఉగ్రసంస్థల సీనియర్ నాయకులు



న్యూఢిల్లీ : ఇజ్రాయెల్ దాడుల్లో తీవ్రంగా దెబ్బతిన్న పాలస్తీనా మిలిటెంట్ సంస్థ హమాస్ ఇప్పుడు పాక్ ఆక్రమిత కశ్మీర్లో అడుగుపెట్టబోతోందని ప్రచారం జరుగుతోంది. దీంతో భారత నిఘా వర్గాలు ఒక్కసారిగా అప్రమత్తం అయ్యాయి. కశ్మీర్ సంఘీభావ దినం సందర్భంగా బుధవారం పీవోకేలో 'అల్ అక్సా ఫ్లడ్స్' పేరిట ఏర్పాటుచేసిన ఓ కార్యక్రమంలో హమాస్కు చెందిన సీనియర్ నేత ప్రసంగించినట్లు తెలుస్తోంది. ఈ సభను రావల్కోట్లోని సబీర్ స్టేడియంలో ఏర్పాటుచేశారు. దీనిలో ఉగ్రసంస్థలైన లష్కరే తోయిబా, జైషే మహమ్మద్, సీనియర్ నాయకులు కూడా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో హమాస్ ప్రతినిధి ఖలీద్ కద్దామి ప్రసంగించనున్నట్లు కరపత్రాలు, ఇతర మార్గాల్లో ప్రచారం చేస్తున్నారు. అతడు కశ్మీర్లో పోరాటాన్ని పాలస్తీనాతో ముడిపెట్టి మాట్లాడొచ్చని ఇంటెలిజెన్స్ వర్గాలు చెబుతున్నాయి. జిహాదీ సంస్థలు తమ వాదనలకు బలం చేకూర్చేలా వాదనలు సృష్టించేందుకు దీనిని వాడుకోవచ్చు. మసూద్ అజర్ సోదరుడు తల్హాసైఫ్, అస్గరా న్, ఇలియాస్ మసూద్ వంటి ఉగ్రవాదులు సభకు హాజరుకావచ్చని చెబుతున్నారు. ఈ సమయంలో భారత హెూం మంత్రి అమిత్ షా మంగళవారం జమ్మూకశ్మీర్పై హైలెవల్ మీటింగ్ను నిర్వహించారు. అక్కడి భద్రతా పరిస్థితులను, కౌంటర్ టెర్రరిజం ఆపరేషన్ల పరిస్థితిని ఆయన పర్యవేక్షించారు. ఇంటెలిజెన్స్ నెట్వర్క్ను బలోపేతం చేయడం, సీమాంతర చొరబాట్లను అడ్డుకోవడం వంటి అంశాలపై దృష్టిపెట్టాలని అధికారులకు సూచించారు. కశ్మీర్లో వాహన తనిఖీలను కూడా తీవ్రతరం చేయాలని ఆదేశించారు. గతేడాది ఆగస్టులో హమాస్ నేతలతో లష్కరే ఉగ్రవాది సైఫుల్లా ఖలీద్ భేటీ అయ్యాడు. ఖతార్ రాజధాని దోహా దీనికి వేదికైంది. 2018లో సైఫుల్లాను అమెరికా ఉగ్రజాబితాలో చేర్చింది. లష్కరే వ్యవస్థాపకుడు హాఫీజ్ సయీద్కు అతడు సన్నిహితుడు.


# ఢిల్లీ పీఠం కమలందే

■ పలు జాతీయ ఛానెల్స్ ఎగ్జిట్ పోల్స్ అంచనాలు ■ ఈ సారి బీజేపీ, ఆప్ మధ్య గట్టి పోటీ ■ 2020 ఎన్నికలతో పోలిస్తే పెరిగిన 13శాతం ఓటింగ్ ■ గెలుపోటములపై ప్రభావం చూపే అవకాశం



ఢిల్లీః ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ముగిసింది.. సీలంపూర్, జంగ్పూర్, అకోలా నియోజకవర్గాలు మినహా మిగతా ప్రాంతాల్లో ప్రశాంతంగా ముగిసింది. కాగా.. సాయంత్రం 5 గంటల వరకు 58 శాతం పోలింగ్ నమోదయ్యింది. పలు నియోజకవర్గాల్లో ఆప్, బీజేపీ అభ్యర్థుల మధ్య టఫ్ ఫైట్ ఉంది. గెలుపుపై అటు బీజేపీ, ఇటు ఆప్ నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ కూడా కొన్ని నియోజకవర్గాల్లో గట్టి పోటీ ఇస్తున్నట్లు పేర్కొంటున్నారు. కాగా.. ఢిల్లీలో అంచనాలను మించి పోలింగ్ శాతం నమోదవడంతో.. అంచనాల్లో పార్టీలు తలమునకలవుతున్నాయి. 2020 ఎన్నికల్లో సాయంత్రం 5 గంటల వరకు 44.52 శాతం పోలింగ్ నమోదైంది.. 2025లో సాయంత్రం 5 గంటల వరకు 58 శాతం పోలింగ్ గత ఎన్నికలతో పోలిస్తే 13 శాతం పోలింగ్ పెరిగింది.. పెరిగింది అనుకూల ఓటా..? ప్రతికూల ఓటా..? అంటూ ఆమ్ ఆద్మీ పార్టీ, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు అంచనావేస్తున్నాయి.. ఈ క్రమంలోనే పోలింగ్ ముగియడంతో ఎగ్జిట్పోల్స్ విడుదలయ్యాయి..ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలపై జాతీయ ఛానెల్స్ ఎగ్జిట్ పోల్స్ ప్రకటించాయి.. 2020 ఎన్నికలతో పోలిస్తే 13శాతం ఓటింగ్ పెరగడంతో.. ఇది గెలుపోటములపై ప్రభావం చూపనుందని పేర్కొంటున్నాయి.. ఈ సారి బీజేపీ, ఆప్ మధ్య గట్టి పోటీ ఉందని కొన్ని ఛానెళ్లు అంచనా వేశాయి.. మరికొన్ని.. బీజేపీకి అనుకూలంగా.. ఇంకొన్ని ఆప్ గెలిచే అవకాశం ఉందని పేర్కొన్నాయి..

**ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై ఎగ్జిట్‌పోల్స్ అంచనాలు ఇవే..**




మ్యాట్రిజ్ %-% ఆప్ 32-37, బీజేపీ 35-40, కాంగ్రెస్ 0-1 స్థానాలు
పీపుల్స్ ఇన్సైట్- ఆప్ 25-29, బీజేపీ 40-44, కాంగ్రెస్0-1 స్థానాలు
రిపబ్లిక్ పీమార్క్- ఆప్ 21-31, బీజేపీ 39-49, కాంగ్రెస్ 0-1 స్థానాలు
కేకే సర్వే: ఆప్ 39, బీజేపీ 22, కాంగ్రెస్ 9స్థానాలు
టైమ్స్: ఆప్ 22-31, బీజేపీ 39-45, కాంగ్రెస్ 0-2
పీపుల్స్ పల్స్: ఆప్ 10-19, బీజేపీ 51-60
చాణక్య స్ట్రాటజీస్: బీజేపీ 39-44 స్థానాలు, ఆప్ 25-28, కాంగ్రెస్ 2-3
జేవీసీ ఎగ్జిట్పోల్: బీజేపీ 39-45 స్థానాలు, ఆప్ 22-31, కాంగ్రెస్ 0-2

అయితే.. ఢిల్లీ ఎగ్జిట్పోల్స్ ప్రకారం.. బీజేపీకే స్పష్టమైన ఆధిక్యం కన్పిస్తోంది. 25 ఏళ్ల తరువాత ఢిల్లీలో బీజేపీ గెలుస్తుందని మెజారిటీ ఎగ్జిట్పోల్స్ చెబుతున్నాయి. ఓట్ల శాతం పెరగడంతో బీజేపీకి అనుకూలంగా ఉంటుందన్న భావన కన్పిస్తోంది. ఢిల్లీ మొత్తం 70 స్థానాలు కాగా మెజారిటీ దక్కాలంటే 36 స్థానాలు దక్కాలి. పోల్ ఆఫ్ పోల్స్ కూడా బీజేపీకే ఆధిక్యం లభించింది.

# అమెరికా నుంచి అక్రమ వలసదారులు వెనక్కి

**అమృత్‌సర్‌కు ప్రత్యేక ఆర్మీ విమానంలో తరలింపు**



అమృత్సర్ : డొనాల్డ్ ట్రంప్ అధికారంలోకి రాగానే అక్రమ వలసదారులపై ఉక్కుపాదం మోపిన అమెరికా ప్రభుత్వం.. కొంతమంది భారతీయులను కూడా వెనక్కి పంపిన సంగతి తెలిసిందే. చట్టవ్యతిరేకంగా అగ్రరాజ్యంలో అడుగుపెట్టిన వారిని ప్రత్యేక విమానంలో స్వదేశానికి పంపింది. 104 మందితో టెక్సాస్ నుంచి బయల్దేరిన అమెరికా సైనిక విమానం సీ-17.. బుధవారం మధ్యాహ్నం 1.55 గంటలకు పంజాబ్లోని అమృత్సర్ అంతర్జాతీయ ఎయిర్పోర్టులో దిగింది.వీరిలో 30 మంది పంజాబ్, 33 మంది హరియాణా, 33 మంది గుజరాత్ వాసులతో పాటు మహారాష్ట్ర నుంచి ముగ్గురు, ఉత్తరప్రదేశ్కు చెందిన ముగ్గురు, ఇద్దరు చండీగఢ్ వాసులు ఉన్నట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. తొలుత, విమానంలో 205 మంది స్వదేశానికి వస్తున్నట్లు వార్తలు రాగా.. ఇప్పుడు ఆ సంఖ్య 104 అని విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. వలసదారుల సంఖ్యపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.అయితే, వీరిని అదుపులోకి తీసుకునేందుకు స్వదేశంలో ఎలాంటి ఆదేశాలు లేవని సమాచారం. అవసరమైన తనిఖీల అనంతరం ఎయిర్పోర్టు నుంచి బయటకు పంపించనున్నట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. వెనక్కి పంపేముందు ప్రతిఒక్కరి రికార్డులను పరిశీలించినట్లు దిల్లీలోని అమెరికా ఎంబసీ అధికారులు వెల్లడించారు. రానున్న రోజుల్లో మరిన్ని విమానాలు అమెరికా నుంచి భారత్కు రానున్నాయని వివరించారు.
**అమెరికా హెూంలాండ్ అధికారుల లెక్కల ప్రకారం..** 20,407 మంది భారతీయుల (%×అఎఖుఅ వీఅస్త్రతీఖుత్ం%) వద్ద సరైన పత్రాలు లేనట్లు గుర్తించిన అధికారులు.. 17,940 మందిని వెనక్కి పంపేందుకు తుది ఉత్తర్వులు జారీ చేశారు. 2,467 మంది ఎన్ఫోర్స్మెంట్ అండ్ రిమూవల్ ఆపరేషన్స్ (ఈఆర్వో) నిర్బంధంలో ఉన్నారు. తొలివిడతలో భాగంగా 205 మందిని వెనక్కి పంపించారు. అక్రమవలసదారులపై ట్రంప్ మొదటి నుంచి కఠినంగా ఉంటున్నారు. ఆయన పదవీ బాధ్యతలు చేపట్టడంతో వారి గుర్తింపు, తరలింపు ప్రక్రియను వేగవంతం చేశారు. ఈ క్రమంలోనే ఎల్ పాసో, టెక్సాస్, శాన్ డియాగో, కాలిఫోర్నియాలో ఉన్న 5,000 మంది అక్రమ వలసదారులను ఆయా దేశాలకు తరలించేందుకు పెంటగాన్ సిద్ధమైంది. ఇప్పటికే కొంతమందిని సైనిక విమానాల్లో గటేమాలా, పెరు, హెూండూరస్ తదితర దేశాలకు పలువురిని తరలించింది. అక్రమ వలసదారులపై అమెరికా అనుసరిస్తున్న విధానాల పట్ల ఇప్పటికే భారత్ తన స్పందనను తెలిపింది. అక్రమ వలసలకు తాము వ్యతిరేకమని, ఈ అంశం అనేక రకాల వ్యవస్థీకృత నేరాలతో ముడిపడి ఉందని పేర్కొంది. వీసా గడువు ముగిసినా లేదా సరైన దస్త్రాలు లేకుండా భారతీయులు అమెరికాతో సహా ఎక్కడ ఉన్నా వారిని తిరిగి తీసుకువచ్చేందుకు వీలు కల్పిస్తామని భారత విదేశాంగశాఖ స్పష్టం చేసింది.



# ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆలపాటి విజయం తథ్యం

## మంత్రి గొట్టిపాటి రవికుమార్

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ విజయం తథ్యమని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. గుంటూరు జిల్లా అమరావతిలో ఏర్పాటుచేసిన కూటమి నాయకుల సమీక్ష సమావేశంలో మంత్రి గొట్టిపాటి పాల్గొన్నారు.

స్థానిక ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యేలు ఈ సమావేశానికి హాజరయ్యారు. కూటమి ముఖ్య నేతలతో భేటీ అయిన మంత్రి గొట్టిపాటి రవికుమార్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై స్థానిక నాయకులతో చర్చించారు. నాయకులు ప్రణాళిక బద్ధంగా పని చేస్తే ఎమ్మెల్సీ ఎన్నికల్లో మరోసారి తెలుగుదేశం జెండా ఎగరవేయవచ్చని తెలిపారు.

ప్రజా ప్రతినిధులు, అబ్జర్వర్లు, పార్టీ క్యాడర్ ఎన్నికలను సీరియస్‌గా తీసుకోవాలని చెప్పారు. ఏడు నెలల కాలంలో కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిన సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్ సూచించారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా 64 లక్షల మందికి పింఛన్లు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి గ్రామాల్లో సిసి రోడ్ల నిర్మాణం జరుగుతుందని చెప్పారు.

సుమారు 1000 కోట్లు ఖర్చుపెట్టి గుంతల రోడ్లకు మరమ్మత్తు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో జరుగుతున్న అభివృద్ధిని క్షేత్రస్థాయి వరకు తీసుకెళ్లే బాధ్యత మనందరి మీద ఉందని చెప్పారు. వైసిపి నాయకులు చేస్తున్న తప్పుడు ప్రచారాలను తిప్పి కొట్టాలని మంత్రి గొట్టిపాటి పిలుపునిచ్చారు.

## కృష్ణ- గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు

# పకడ్బందీ ఏర్పాట్లు

- ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి వెల్లడి
- కృష్ణ-గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గంలో 3,46,529 మంది ఓటర్లు
- అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు నియామకం
- 416 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు
- ఎమ్మెల్సీ ఎన్నికల్లో బ్యాలెట్ పత్రాలు వినియోగం
- ఫిబ్రవరి 27 న పోలింగ్, మార్చి 3న. ఓట్ల లెక్కింపు



గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో : ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ శాసనమండలి ఎన్నికలకు ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం అవసరమైన అన్ని ఏర్పాట్లు పటిష్ట ప్రణాళిక ప్రకారం చేపడుతున్నామని రిటర్నింగ్ అధికారి మరియు జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి తెలిపారు.బుధవారం కలెక్టరేట్ లోని డీఆర్సి సమావేశ మందిరంలో ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ శాసనమండలి ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ శాసనమండలి ఎన్నికల ఏర్పాట్ల పై విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సంధర్భంగా జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి మాట్లాడుతూ ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ శాసనమండలి ఎన్నికల నోటిఫికేషన్ ఫిబ్రవరి 3వ తేదిన జారీ చేసి నామినేషన్ల స్వీకరణ ప్రారంభించటం జరిగిందన్నారు. నామినేషన్లు ఉదయం 11.00 గంటల నుంచి సాయంత్రం 03.00 గంటల వరకు స్వీకరిస్తారని, నామినేషన్లు ఫిబ్రవరి 10వ తేదీ వరకు స్వీకరించటం జరుగుతుందన్నారు. ప్రభుత్వ శెలవు దినాల్లో రెండవ శని, ఆదివారాలలో నామినేషన్లు స్వీకరించరని, సోమవారం నామినేషన్ల స్వీకరణకు చివరి రోజు అన్నారు. మంగళవారం నాటికి ఒక్క అభ్యర్ధి నామినేషన్ వేశారన్నారు. ఫిబ్రవరి 11వ తేది అభ్యర్ధులు అందించిన నామినేషన్ల స్క్రూటీని జరుగుతుందని, నామినేషన్ల ఉప సంహరణకు ఫిబ్రవరి 13వ తేది సాయంత్రం 3.00 గంటల వరకు సమయం ఉంటుందన్నారు. ఉప సంహరణ సమయం ముగిసిన రోజే పోటీలో ఉన్న అభ్యర్ధుల తుది జాబితా ప్రకటించటం జరుగుతుందన్నారు. పోలింగ్ ఫిబ్రవరి 27వ తేది ఉదయం 08.00 గంటల నుంచి సాయంత్రం 04.00 గంటల వరకు జరుగుతుందని, ఓట్ల లెక్కింపు మార్చి 3 వ తేది జరుగుతుందన్నారు. శాసనమండలి ఎన్నికలు బ్యాలేట్ పేపరు, ప్రాధాన్యత ఓటు విధానం లో జరుగుతున్నందున ఓట్ల లెక్కింపు రెండు నుంచి మూడు రోజులు జరిగే అవకాశం ఉందని, మార్చి 8 వ తేది నాటికి ఓట్ల లెక్కింపు పూర్తి చేయాలని ఎన్నికల సంఘం ఆదేశించిందన్నారు. ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ శాసనమండలి ఎన్నికల పరిధి గుంటూరు, పల్నాడు, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలు పూర్తిగా ఏలూరు, బాపట్ల జిల్లాలలో కొంత భాగం ఉందన్నారు. ఎన్నికలకు రిటర్నింగ్ అధికారిగా గుంటూరు జిల్లా కలెక్టర్ ఉంటారని, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులుగా గుంటూరు, పల్నాడు, బాపట్ల, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల జిల్లా రెవెన్యూ అధికారులు, ఏలూరు జిల్లా పోలవరం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ను నియమించటం జరిగిందన్నారు.

ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ శాసన మండలి ఎన్నికలకు జనవరి 30వ తేది నాటికి ఓటర్లు పురుషులు 2,06,176 , మహిళలు 1,40,307 , ట్రాన్స్ జెండర్స్ 46 మంది మొత్తం 3,46,529 మంది ఉన్నారన్నారు. జనవరి 31వ తేది వరకు ఓటరు నమోదుకు ధరఖాస్తులు స్వీకరించటం జరిగిందని, ధరఖాస్తులను ఫిబ్రవరి 10వ తేది నాటికి పరిష్కరించి తుది ఓటరు జాబితాను ప్రకటించటం జరుగుతుందన్నారు. ఓటరు నమోదుకు ధరఖాస్తు చేసుకోవటానికి సమయం ముగిసినందుకు నూతన ఓటు నమోదుకు, సవరణలకు, తొలగించటానికి ధరఖాస్తులు స్వీకరించటం కుదరదన్నారు. ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ శాసన మండలి ఎన్నికలకు 416 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, ఓటర్లు ఎక్కువుగా ఉన్న పోలింగ్ కేంద్రాలకు 67 యాగ్జిలరీ పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ఎన్నికల సంఘానికి ప్రతిపాదనలు అందించటం జరిగిందని, అనుమతులు మంజూరు చేస్తే 483 పోలింగ్ కేంద్రాలు ఉంటాయన్నారు. సాధారణ ఎన్నికల తరహాలోనే శాసనమండలి ఎన్నికలు జరిగే ప్రాంతాల్లో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లో ఉంటుందన్నారు. పట్టభద్రులను ప్రభావితం చేసే ఎటువంటి కార్యక్రమాలను నిర్వహించరాదన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి పర్యవేక్షణకు మండలానికి ఒకటి, నగరాల్లో జనాభాకు అనుగుణంగా మూడు నుంచి నాలుగు ఫ్లైయింగ్ స్క్వాడ్ లను ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. గుంటూరు జిల్లాలో 23 ఫ్లైయింగ్ స్క్వాడ్ లను ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. ఓటర్లకు నగదు పంపిణీ చేయటం, ప్రలోభాలకు గురిచేయటం, బెదరించటం వంటి కార్యక్రమాలను చేస్తే ఎన్నికల ప్రవర్తన నియమావళి ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. పోటీలో ఉన్న అభ్యర్ధులకు వ్యయ పరిమితిపై నిబంధనలు లేవని అందువలన ప్రత్యేకంగా ఖర్చుల పర్యవేక్షణకు బృందాలు ఉండరన్నారు. సాధారణ ఎన్నికల తరహాలోనే ప్రచారానికి సంబంధించి సమావేశాలు, ర్యాలీలకు ముందస్తుగా అనుమతి తీసుకోవాలన్నారు.

సంబంధిత జిల్లాలలోని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులే అనుమతులు మంజూరు చేస్తారన్నారు. సింగిల్ విండో ద్వారా ధరఖాస్తు చేసుకుంటే అనుమతులు మంజూరు చేస్తారన్నారు. టీవీ, రేడియో, ఇతర సామాజిక మాధ్యమాల్లో ప్రచార కంటెంట్ కు సంబంధించి ఎంసీఎంసీ కమిటీ నుంచి అనుమతులు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ముగ్గురు పోలింగ్ అధికారులతో పాటు, ఒక మైక్రో అబ్జర్వర్ ఉంటారన్నారు. దీనికి సంబంధించి అవసరమైన ఉద్యోగులు, సిబ్బంది వివరాలను సిద్ధం చేయటం జరిగిందన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో వీడియో గ్రాఫర్, వెబ్ కాస్టింగ్, మైక్రో అబ్జర్వర్ నియమించటం జరిగిందన్నారు. పోలింగ్ కు అవసరమైన మెటీరియల్ సిద్ధం చేయటానికి ఇప్పటికే నోడల్ అధికారులను నియమించటం జరిగిందన్నారు. శాసనమండలి ఎన్నికలు బ్యాలెట్ పేపరుతో మొదటి ప్రాధాన్యత ఓటు విధానంలో జరుగుతున్నందున చెల్లుబాటు అయ్యే విధంగా ఓటు వేసేలా ఓటర్లకు విస్తృత స్థాయిలో అవగాహన కోసం స్వీప్ కార్యక్రమాలను పట్టణాల్లో, గ్రామాల్లో నిర్వహించటం జరుగుతుందన్నారు. బ్యాలెట్ పేపర్లు, బ్యాలెట్ బాక్స్ లకు పూర్తి స్థాయిలో అన్ని భద్రత చర్యలు ఏర్పాటు చేయటం జరిగిందన్నారు.

# రోగుల సంతృప్తే సేవలకు ప్రాతిపదిక

- సూపరింటెండెంట్లు, ప్రిన్సిపాల్స్, అడ్మినిస్ట్రేటర్లు సమన్వయంతో పనిచేయాలి
- 30 పాయింట్ల కార్యాచరణ ప్రణాళికను మరింత పటిష్టంగా అమలు చేయాలి
- ఏపీ సచివాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి సత్యకుమార్ యాదవ్



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : ప్రభుత్వాసుపత్రుల్లో వైద్య సేవల విషయంలో రోగులు సంతృప్తి చెందడమే ప్రాతిపదికగా డాక్టర్లు పనిచేయాలని వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. ప్రభుత్వ సర్వజన ఆసుపత్రుల్లో(జిజిహెచ్లు) సూపరింటెండెంట్లు, ప్రిన్సిపాళ్లు, అడ్మినిస్ట్రేటర్లు సమన్వయంతో పనిచేసినప్పుడే మెరుగైన ఫలితాల్ని సాధించగలుగుతారన్నారు. రాష్ట్రంలోని అన్ని జిజిహెచ్ల సూపరింటెండెంట్లతో ఐవిఆర్ ఎస్ ఫీడ్ బ్యాక్ పై బుధవారం వెలగపూడి ఏపి సచివాలయం నుండి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో మంత్రి సత్యకుమార్ యాదవ్ పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రుల్లో డాక్టర్లు అందుబాటులో ఉంటున్నారా, పరిశుభ్రత, మందుల సరఫరా, సిబ్బంది ప్రవర్తన, అవినీతి తదితర అంశాలపై ఐవిఆర్ ఎస్ సర్వేలో వచ్చిన ఫీడ్ బ్యాక్ మేరకు ఎక్కడెక్కడ లోపాలున్నాయో సవరించుకుని సేవల్ని మెరుగుపర్చుకోవాలని మంత్రి సూచించారు. ప్రభుత్వాసుపత్రుల్లో 30 పాయింట్ల కార్యాచరణ ప్రణాళిక అమలు విషయంలో కొంతమేర ప్రగతి కనిపించినప్పటికీ మరింత పటిష్టంగా అమలు చేయాల్సిన అవసరముందన్నారు. ప్రభుత్వాసుపత్రుల్లో స్ట్రెచర్లు, వీల్ చెయిర్లు లేక గర్భిణిలు, వృద్ధులు ఇబ్బందులు ఎదుర్కోవడం వంటి చిన్న చిన్న సమస్యల పట్ల దృష్టి సారించాలన్నారు. ఉదయం రోగుల్ని ఏ డాక్టరైతే చూస్తారో టెస్ట్ ల రిపోర్టులొచ్చాక సాయంత్రం అదే డాక్టర్ చూసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఐవిఆర్ ఎస్ సర్వేలో వచ్చిన ఫిర్యాదులాధారంగా సేవల్ని మెరుగుపర్చేందుకు సూపరింటెండెంట్లు దృష్టి సారించాలన్నారు.

ప్రభుత్వాసుపత్రుల్లో వైద్య సేవలకు సంబంధించి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారని, పేద రోగులు సంతృప్తి చెందేలా సేవలందించే విషయంలో ఏ మాత్రం తాత్సారం ఉండకూడదని మంత్రి ఈ సందర్భంగా స్పష్టం చేశారు. వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు మాట్లాడుతూ ఐవిఆర్ ఎస్ సర్వే ఆధారంగా సేవల్ని ఎంతమేరకు మెరుగుపర్చగలమనేది దృష్టిలో ఉంచుకుని పనిచేయాలన్నారు. ప్రభుత్వాసుపత్రుల్లో సేవల విషయంలో సూపరింటెండెంట్లే పూర్తి బాధ్యత వహించాలన్నారు. ఇ-హెల్త్ ప్రాజెక్టుకు అత్యంత ప్రాధాన్యతనివ్వాలన్నారు. రోగి ఏ ఆసుపత్రికి వెళ్లినా ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డ్ (ఇహెచ్ ఆర్) అందుబాటులోకొస్తే సేవలు మరింత సులభతరమవుతాయన్నారు. వైద్య విద్యా సంచాలకులు ( డిఎంఇ) డాక్టర్ నరసింహం వర్చువల్‌గా పాల్గొన్నారు.

## ఫ్రూట్ బౌల్ ఆఫ్ ఇండియాగా అనంతను తయారు చేయడమే లక్ష్యం




అనంతపురం, ఫిబ్రవరి 05 : ఫ్రూట్ బౌల్ ఆఫ్ ఇండియాగా అనంతపురం జిల్లాలో తయారు చేయడమే లక్ష్యమని రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రివర్యులు పయ్యావుల కేశవ్ స్పష్టం చేశారు.అనంతపురం నగరంలోని బళ్లారి రోడ్ లో ఉన్న ఎంవైఆర్ కన్వెన్షనల్ హాల్ లో బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో అనంత ఉద్యాన సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రివర్యులు పయ్యావుల కేశవ్ అనంత ఉద్యాన సమ్మేళనం కార్యక్రమాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన 13 స్టాల్స్ ను మంత్రి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ మరియు రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీతమ్మ, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, సింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ, తాడిపత్రి మున్సిపల్ చైర్ పర్సన్ జెసి.ప్రభాకర్ రెడ్డి, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (హార్టికల్చర్, అగ్రికల్చర్, ఫిషరీస్) వ్యవసాయం సహకార శాఖ బి.రాజశేఖర్ ఐ.ఏ.ఎస్, ఎపి. డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్ సెరికల్చర్ డా. కే.శ్రీనివాసులు ఐఏఎస్, ఎపి ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ సిఈఓ డా.శేఖర్ బాబు ఐ.ఎఫ్.ఎస్., జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్, జిల్లా ఎస్పీ పి.జగదీష్, జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, డిస్టిక్ ఫారెస్ట్ ఆఫీసర్ విగ్నేష్ అప్పవు ఐ.ఎఫ్.ఎస్, తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎలైట్ బయో టెక్నాలజీస్, సీనాగ్రో ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ డిజిటల్ గ్రీన్, సంకల్ప్ రిటైల్ స్టోర్, రామ డ్రిప్ సిస్టమ్స్, కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్, బాయర్ క్రాఫ్ సైన్స్ లిమిటెడ్, జిఎం పవర్ సిస్టమ్స్, ఎకో జెన్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఇఫ్కో, ఫసల్, మొబిటెక్ వైర్లెస్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, నెట్ ఫిమ్ ఇరిగేషన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలు తమ ఉత్పత్తులను స్టాల్స్ నందు ప్రదర్శించగా, వారి ఉత్పత్తులు రైతులకు ఏ విధంగా ఉపయోగపడతాయో ఆ సంస్థల ప్రతినిధులు మంత్రి, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యేలు, వ్యవసాయం సహకార శాఖ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఎపి ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ సిఈఓ, జిల్లా కలెక్టర్ లకు వివరించారు.ఈ కార్యక్రమంలో వర్చువల్ గా జిల్లా ఇన్చార్జ్ మంత్రి మరియు రాష్ట్ర పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రివర్యులు టీజీ.భరత్, అనంతపురం ఎంపీ అంబిక లక్ష్మీనారాయణ, ఐఆర్టిఎస్, హైదరాబాద్ కంటైనర్ కార్పొరేషన్ సీనియర్ జనరల్ మేనేజర్ ఆఫీసర్ అనితా బారక్, తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడానికి స్ఫూర్తి అని, ఈ కార్యక్రమాన్ని రైతులకు అంకితం చేస్తున్నామన్నారు. రైతాంగం జీవితంలో మార్పు తీసుకురావాలని తమ ప్రధాన ఉద్దేశం అని, ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం పట్ల జిల్లా కలెక్టర్ ని అభినందిస్తున్నానన్నారు. ఒక చిన్న ప్రయత్నంతో అనంత ఉద్యాన సమ్మేళనం కార్యక్రమాన్ని మొదలుపెట్టామని, దాదావు 64 సంస్థలు ఈ కార్యక్రమానికి హాజరయ్యాయన్నారు. జిల్లా రైతాంగానికి బాసటగా నిలబడడమే తమ ఉద్దేశమని, ఎన్నికల్లో ఉమ్మడి అనంత జిల్లాలో 14 స్థానాలకు అన్ని స్థానాలకు గెలిపించిన రైతాంగానికి తాము అండగా ఉంటామన్నారు. నారు పోసే దగ్గర నుంచి పంట ఉత్పత్తులను నమ్ముకునే వరకు రైతులను అన్ని రకాలుగా ఆదుకుంటామన్నారు. జిల్లాలో మిరప, దానిమ్మ, సీతాఫలం లాంటి 24 పంటలు పండిస్తున్నారని, రైతు కష్టపడి పంట పండిస్తే సరైన మద్దతు ధర దక్కడం లేదని, వారిని ఆదుకుంటామన్నారు. అనంత జిల్లాను ఫ్రూట్ బౌల్ ఆఫ్ ఇండియాగా తయారు చేయడమే తమ లక్ష్యం అని, బ్రాండ్ అనేది చాలా ముఖ్యమని, బ్రాండ్ ఆంధ్ర ప్రదేశ్ సాధనకు కృషి చేస్తామన్నారు. ఉద్యాన పంటల సాగులో బ్రాండ్ అనంతను సృష్టించాలన్నారు. పంటల నాణ్యత మరింత పెరగాలని, మంచి విత్తనాలు ఎన్నుకోవాలని, ఎగుమతి చేయడం చేయాలన్నారు. అరటి ఎగుమతి జరగాలని, ఇప్పటికే ట్రైన్ ల ద్వారా అరటిని ఎగుమతి చేస్తున్నారని, జిల్లా బ్రాండ్ ను సృష్టించడం చేయాలన్నారు. ఢిల్లీకి వెళితే మన జిల్లా కర్బూజాకు మంచి గుర్తింపు ఉందని, అలా సహజంగానే కర్బుజాకి బ్రాండింగ్ వచ్చిందన్నారు.

# తిరిగి అధికారంలోకి వస్తా

## 30 ఏళ్లు ఏకధాటిగా పాలిస్తా



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : తిరిగి అధికారంలోకి వ్తాన్ని, ఈసారి ఏక్ధాటిగా 30ఏళ్లు ఎపిని పాలిస్తాన్ని వైసిపి అధినేత్, జగన్ వెల్లడించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు బెదిరిస్తారు.. దొంగ కేసులు పెడతారు.. అలాగే జైల్లో సైతం పెడతారని.. అయినా రెట్టించిన ఉత్సాహంతో పని చేస్తామని స్పష్టం చేశారు. మీకు మంచి చేసిన వారినీ.. అలాగే చెడు చేసిన వారినీ.. ఇద్దరినీ గుర్తుపెట్టుకోండంటూ పార్టీ శ్రేణులకు జగన్ కీలక సూచన చేశారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో విజయవాడ నగరపాలక సంస్థలోని వైసీపీ కార్పొరేటర్లతోపాటు ముఖ్య నాయకులతో జగన్ సమావేశమయ్యారు. ఒక్కటే గుర్తు పెట్టుకోండంటూ పార్టీ కేడర్‌కు ఆయన కీలక సూచనలు చేశారు. ఈ జగన్ 2.0 వేరుగా ఉంటుందన్నారు. ఈసారి కార్యకర్తల కోసం జగన్ ఏం చేస్తాడో చూపిస్తాని తెలిపారు. గతంలో పార్టీ శ్రేణులకు అధిక ప్రాధాన్యత ఇవ్వ లేకపోయానని చెప్పారు. అయితే పార్టీలోని కార్యకర్తలను ఇబ్బంది పెట్టిన వారిని ఎవరిని వదిలిపెట్టమని జగన్ హెచ్చరించారు. అక్రమ కేసులు పెట్టిన వారిపై ప్రైవేట్ కేసులు వేస్తామని స్పష్టం చేశారు. వారిని చట్టం ముందు నిలబెడతాంటూ వారికి భరోసా కల్పించారు. గత జగన్ ప్రభుత్వ హాయంలో కార్యకర్తలకు అంత గొప్పగా చేయ లేక పోయిండవచ్చు.. కానీ ప్రతి పథకం, ప్రతి విషయంలో మొట్టమొదటిగా ప్రజలే గుర్తుకు వచ్చారని.. వారి కోసమే తాను తాపత్రయపడ్డానని ఈ సందర్భంగా ఆయన వివరించారు. వారి కోసమే తన టైం కేటాయించానని.. ప్రజల కోసమే అడుగులు వేశానన్నారు.

అయితే ప్రస్తుతం సీఎం చంద్రబాబు.. మన కార్యకర్తలను పెడుతున్న ఇబ్బందులు చూశానన్నారు.

# నేటి నుంచి విజ్ఞాన్ మహోత్సవం

- మూడు రోజుల పాటు అలరించనున్న జాతీయ స్థాయి వేడుకలు
- సందడి చేయనున్న సినీతారలు
- ఆయా రాష్ట్రాల నుంచి 50 వేల మంది విద్యార్థులు రాక



గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో : చేబ్రోలు మండలం వడ్లమూడిలోని విజ్ఞాన్స్ యూనివర్సిటీ ప్రతిష్టాత్మకంగా నిర్వహించే జాతీయ స్థాయి విజ్ఞాన్ మహోత్సవ్ 18వ ఎడిషన్కు ఏర్పాట్లు పూర్తయ్యాయని వర్సిటీ వైస్ చాన్సర్ కల్నల్, ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వైస్ చాన్సర్ మాట్లాడుతూ 18వ ఎడిషన్ విజ్ఞాన్ మహోత్సవ్ కార్యక్రమాన్ని నేటి నుంచి మూడు రోజుల పాటు అత్యంత వైభవంగా నిర్వహించనున్నామని పేర్కొన్నారు.

జాతీయస్థాయిలో ప్రతి ఏటా విజ్ఞాన్ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. నేటి కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా ఇండియన్ సింగర్, మ్యూజిక్ కంపోజర్ డాక్టర్ సాలూరి కోటేశ్వరరావు ( కోటి), ఇండియన్ మ్యూజిక్ కంపోజర్ అండ్ ప్లేబాక్ సింగర్ ఎస్.ఎస్.థమన్, గౌరవ అతిథిగా మాజీ ఇండియన్ వాలీబాల్ ప్లేయర్ మన్యం తులసి రెడ్డి హాజరవుతారని వెల్లడించారు. రెండో రోజు కార్యక్రమానికి ఇండియన్ యాక్టర్, డైరక్టర్, స్క్రీన్ రైటర్, హీరో విశ్వక్ సేన్, హీరోయిన్ ఆకాంక్ష శర్మ, యాక్టర్ అభిమన్యు సింగ్ విచ్చేస్తున్నారని పేర్కొన్నారు. చివరి రోజు జరిగే ముగింపు కార్యక్రమానికి ఇండియన్ ఫిల్మ్ డైరక్టర్, స్క్రీన్ రైటర్ కే.ఎస్.రవీంద్ర (బాబీ), 2024 పారాలింపిక్స్ బ్రాంజ్ మెడలిస్ట్, ఇండియన్ పారా పిస్టల్ షూటర్, అర్జున అవార్డీ రుబినా ఫ్రాన్సిస్ రానున్నారని తెలియజేసారు. విజ్ఞాన్ మహోత్సవ్లో పాల్గొనేందుకు దేశవ్యాప్తంగా ఆయా రాష్ట్రాల నుంచి 50వేల మంది విద్యార్థులు తరలి రానున్నారని వెల్లడించారు. విజ్ఞాన్ మహోత్సవ్ పోటీల విజేతలకు రూ.15 లక్షలకు పైగా బహుమతులను అందజేస్తామని తెలిపారు.

**80 ఈవెంట్ల నిర్వహణ**

విజ్ఞాన్స్ యూనివర్సిటీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మహోత్సవ్లో మొత్తం 80 ఈవెంట్లను నిర్వహించనున్నారు.

తొలుత నిర్వహించే స్పోర్ట్స్ ఫీట్లో వాలీబాల్, బాస్కెట్బాల్, కబడ్డీ, టేబుల్ టెన్నిస్, చెస్, అథ్లెటిక్స్, త్రోబాల్, ఫుట్బాల్, హాకీ, తైక్వాండో, ఖోఖో, ట్రాక్ అండ్ ఫీల్డ్ ఈవెంట్స్, యోగాసన వంటి తదితర క్రీడాంశాల్లో జాతీయస్థాయిలో విద్యార్థులకు పోటీలు ఉంటాయని చెప్పారు. వీటితోపాటు మ్యూజిక్, లిటెరరీ, స్పాట్లైట్, డాన్స్, డ్రమాటిక్స్ అండ్ ఫిల్మ్ మేకింగ్, ఫ్యాషన్, ఫైన్ ఆర్ట్స్, కల్చరల్స్, థియేటర్ ఆర్ట్స్ వంటి తదితర రంగాలను కలుపుకుని సాంకేతిక, సాంస్కృతికాంశాల్లో జాతీయస్థాయిలో పోటీలు ఉంటాయని వివరించారు. దేశవ్యాప్తంగా విద్యార్థులంతా ఈ అవకాశాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో విజ్ఞాన్స్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, సీఈవో డాక్టర్ మేఘన కూరపాటి ( ఎమ్మెస్, ఎఫ్.పీ.ఓఎస్), వైస్ చాన్సర్ కల్నల్, ప్రొఫెసర్ పీ.నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు పాల్గొన్నారు.

# మానవత్వం చాటిన ఆర్టీసీ సిబ్బంది

- ఘనంగా సన్మానించిన యాజమాన్యం
- బస్సులో జన్మించిన చిన్నారికి జీవితకాలపు ఉచిత బస్ పాస్



తెలంగాణ బ్యూరోప్రతినిధిః విధి నిర్వహణలో మానవత్వం చాటుకున్న తమ సిబ్బందిని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(టీజీఎస్ఆర్టీసీ) యాజమాన్యం ఘనంగా సన్మానించింది. హైదరాబాద్ బస్ భవన్ లో బుధవారం ఉన్నతాధికారులతో కలిసి మణుగూరు డిపో పీహెచ్చీ డ్రైవర్ కోటేశ్వరరావు గద్వాల్ డిపో కండక్టర్ కిషోర్ కుమార్, డ్రైవర్ నరేందర్ గౌడ్, జగిత్యాల డిపో మేనేజర్ సునీతలను సంస్థ ఎండీ వీసీ సజ్జనర్, ఐపీఎస్ సత్కరించారు.

**డ్రైవర్ చాకచక్యం.. 10 తులాల బంగారు అభరణాలు అప్పగింత**

మణుగూరు డిపోకు చెందిన బస్సులో గత ఏడాది డిసెంబర్ 21న ప్రయాణికురాలి 10 తులాల బంగారు అభరణాలు అపహరణకు గురయ్యాయి. ఈ విషయాన్ని ఆమె విలపిస్తూ పీహెచ్చీ డ్రైవర్ కోటేశ్వరరావు కు చెప్పారు. వెంటనే అప్రమత్తమైన డ్రైవర్.. బస్సును భద్రాచలం బస్ స్టేషన్ లో ఆపి స్థానిక పోలీస్ స్టేషన్ కు సమాచారం ఇచ్చారు. బస్సులోని ప్రయాణికులందరినీ తనిఖీ చేశారు. ఆ సమయంలో ఒక ప్రయాణికురాలు వేగంగా వెళ్తున్న విషయాన్ని డ్రైవర్ గమనించి.. ఆమెను అనుసరించారు. బంగారు అభరణాలున్న బ్యాగ్ వేరే ప్రాంతంలో పెడుతుండగా గుర్తించారు. అభరణాలను అపహరించిన మహిళను పోలీసులకు అప్పగించారు. పోలీసుల సహకారంతో 10 తులాల బంగారు ఆభరణాలను ప్రయాణికురాలికి ఇప్పించారు.

**బస్సులో ప్రసవం.. ఆర్టీసీ సిబ్బంది ఉదారత**

గద్వాల డిపోనకు చెందిన బస్సులో జనవరి 2న రాయచూర్ నుండి గద్వాలకు ప్రయాణిస్తుండగా ఒక గర్భిణికి ఒక్కసారిగా పురిటినొప్పులు వచ్చాయి. ఈ విషయాన్ని గమనించిన కండక్టర్ కిషోర్ కుమార్.. డ్రైవర్ నరేందర్ గౌడ్ కు సమాచారం ఇచ్చారు. వెంటనే బస్సును పక్కకు ఆపి.. వారు 108 కి సమాచారం ఇచ్చారు. అంతలోనే పురిటినొప్పులు ఎక్కువ కావడంతో తోటి ప్రయాణికురాళ్లను సహకరించాలని కోరారు. వారు పురుడుపోయడంతో ఆడబిడ్డకు జన్మనిచ్చారు. అనంతరం తల్లి బిడ్డను ఆస్పత్రిలో చేర్పించారు.

**ప్రయాణికురాలికి గుండెపోటు.. డీఎం సీపీఆర్**

జగిత్యాల బస్ స్టేషన్ లో జనవరి 12న ఒక ప్రయాణికురాలికి గుండెపోటు వచ్చింది. సంక్రాంతి ఆపరేషన్స్ లో భాగంగా అక్కడే విధులు నిర్వహిస్తోన్న జగిత్యాల డీఎం సునీత.. వెంటనే అప్రమత్తమయ్యారు. సత్వరమే స్పందించి ఆమెకు సీపీఆర్ చేశారు. అనంతరం 108 సాయంతో జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. డీఎం సకాలంలో సత్వరమే స్పందించడంతో ప్రయాణికురాలికి ప్రాణాప్రాయం తప్పింది. సమయస్ఫూర్తితో వ్యవహరించి ఉదారతను చాటుకున్న సిబ్బందిని టీజీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనర్, ఐపీఎస్ అభినందించారు. ప్రయాణికులను క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చుతూనే.. సామాజిక బాధ్యతగా సేవాస్ఫూర్తిని ఆర్టీసీ ఉద్యోగులు చాటుతుండటం గొప్ప విషయమని కొనియాడారు. ఆర్టీసీ బస్సులు, బస్ స్టేషన్ లలో పుట్టిన పిల్లలకు జీవిత కాలపు ఉచిత బస్ పాస్ ను ఇవ్వాలని గతంలో యాజమాన్యం తీసుకున్న నిర్ణయం మేరకు.. గద్వాల డిపో బస్సులో జన్మించిన ఆడపిల్లకు లైఫ్ టైం ఫ్రీ బస్ పాస్ ను యాజమాన్యం మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీవోవో డాక్టర్ రవిందర్, ఈడీలు మునిశేఖర్, ఖుస్రోషా ఖాన్, రాజశేఖర్, ఫైనాన్స్ అడ్వైజర్ విజయపుష్ప లతో పాటు హెచ్ఓడీలు విజయభాస్కర్, వెంకన్న, శ్రీదేవి, ఉషాదేవి, తదితరులు పాల్గొన్నారు.

# జంపింగ్ జిలానీలలో మొదలైన వణుకు?

- సుప్రీం సూచనలతో అసెంబ్లీ కార్యదర్శి నోటీసులు
- ఫిరాయింపు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు కోసం సుప్రీంకోర్టులో బీఆర్ఎస్ పిటిషన్
- 10న విచారించనున్న ధర్మాసనం



తెలంగాణ బ్యూరోప్రతినిధిః తెలంగాణ రాజకీయం ఊహించని మలుపులు తిరుగుతోంది. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని కోరుతూ బీఆర్ఎస్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై విచారణ చేపట్టిన సుప్రీం ధర్మాసనం ఏడుగురు ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ చేసింది. అదేవిధంగా గతంలోనే మరో ముగ్గురిపై దాఖలైన పిటిషన్ ను విచారిస్తోంది. ఈ నెల 10న ఈ రెండు పిటిషన్లు కలిపి విచారించనుంది. ఈలోగా ఎమ్మెల్యేల వివరణ తీసుకోవాలని భావించి నోటీసులు జారీచేసింది. మరోవైపు సుప్రీం సూచనలతో అసెంబ్లీ కార్యదర్శి నరసింహాచార్యులు కూడా ఎమ్మెల్యేల వివరణ కోరుతూ నోటీసులిచ్చారు. ఇటు అసెంబ్లీ కార్యదర్శి, అటు సుప్రీంకోర్టు నుంచి నోటీసులు అందుకున్న పది మంది వలస ఎమ్మెల్యేలు ప్రత్యేకంగా సమావేశం కావాలని నిర్ణయించినట్లు సమాచారం. తాను అందుబాటులో లేకపోవడం వల్ల రేపు అందరం కలవాలని అనుకున్నామని పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మీడియాకు తెలిపారు. రేపు పది మంది ఎమ్మెల్యేలు ఓ చోట సమావేశమై ఉమ్మడి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున గెలిచిన పది మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ లో చేరారు. పార్లమెంట్ ఎన్నికలకు ముందు కొందరు.. ఆ తర్వాత కొందరు కాంగ్రెస్ హస్తాన్ని అందుకున్నారు. అయితే బీఆర్ఎస్ శాసనసభా పక్షాన్నే విలీనం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ నేతలు సుప్రీంకోర్టులో కేసు వేశారు. మొత్తం పది మందిపై అనర్హత వేటు వేయాలని స్పీకర్ ను ఆదేశించాలని కోరుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, కేపీ వివేకానంద సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేశారు. అదేవిధంగా ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రిట్ పిటిషన్ దాఖలు చేశారు. అయితే సుప్రీం కోర్టు నోటీసులతో తదుపరి నిర్ణయం తీసుకోడానికి పార్టీ మారిన ఎమ్మెల్యేలు ఒకచోట సమావేశం కావాలని నిర్ణయించడం ఆసక్తికరంగా మారింది. పార్టీ మారిన వారిలో మాజీ మంత్రులు దానం నాగేందర్, కడియం శ్రీహరి, పోచారం శ్రీనివాసరెడ్డితోపాటు ఎమ్మెల్యేలు సంజయ్ కుమార్ (జగిత్యాల), కాలె యాదయ్య (చేవెళ్ల), మహిపాల్ రెడ్డి (పటాన్ చెరు) అరికెపూడి గాంధీ (శేరిలింగంపల్లి), బండ్ల క్రిష్ణమోహన్ (గద్వాల), ప్రకాశ్ గౌడ్ (రాజేంద్రనగర్), తెల్లం వెంకట్రావు భద్రాచలం ఉన్నారు. వీరిలో కడియం కుమార్తె కాంగ్రెస్ పార్టీ నుంచి వరంగల్ ఎంపీగా పోటీ చేసి గెలిచారు. అదేవిధంగా దానం నాగేందర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉంటూ కాంగ్రెస్ గుర్తుపై సికింద్రాబాద్ నుంచి ఎంపీగా పోటీ చేసి ఓడిపోయారు. దీంతో తమ న్యాయపోరాటానికి తిరుగులేని ఆధారాలు లభించాయని బీఆర్ఎస్ చెబుతోంది. ఈ పరిస్థితుల్లో జంపింగ్ ఎమ్మెల్యేలు సుప్రీంకోర్టుకు ఏం చెబుతారన్నది ఉత్కంఠ రేపుతోంది.

# టీచర్ల గొంతుకగా పని చేస్తా

- డబ్బుసంచులతో వస్తున్న వారిని నిలువరిద్దాం
- ప్రభుత్వ విద్య బలోపేతానికి కృషి
- టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి వై. అశోక్ కుమార్



తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: తాను టీచర్ ఉద్యోగం పొందినప్పటి నుంచి రిటైర్డ్ అయ్యేంత వరకు ఉపాధ్యాయుల సంక్షేమం కోసం పనిచేశానని, టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి గా ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్, నిజామాబాద్ టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి గా గెలిపిస్తే టీచర్ల గొంతుకగా పనిచేస్తానని టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి వై. అశోక్ కుమార్ అన్నారు. మంగళవారం మెదక్ పట్టణంలోని టిఎన్జిఓ భవన్ లో సమావేశం జరిగింది. ఈ సమావేశానికి అశోక్ కుమార్ ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు.కార్పొరేట్ శక్తులు తమ స్వప్రయోజనాల కోసం డబ్బుసంచులతో వస్తున్న వారిని నిలువరిద్దామన్నారు.ప్రభుత్వ విద్య బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. పేదలకు ప్రభుత్వ విద్య దూరమవుతున్న పట్టించుకునే కరువయ్యారని ఆరోపించారు. ధన రాజకీయాలను ఓడించి ఉద్యమ నాయకులను ఎమ్మెల్సీ లు గా ఎన్నుకున్నట్లయితే ప్రభుత్వ విద్య బలోపేతం అవుతుందని అన్నారు.గత 35 సంవత్సరాలుగా నేను పూర్తిగా ఉపాధ్యాయ ఉద్యమంతో పాటు తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న వారిగా మీ ముందుకు వస్తున్నానన్నారు. ఉపాధ్యాయ సంక్షేమం, ప్రభుత్వ విద్యా రంగ పటిష్టతకు కృషి చేస్తూ విద్యా వ్యవస్థ పటిష్ఠతకు కృషి చేస్తామని తెలిపారు.ఈ సమావేశం లో టిఎస్ యూటీఎఫ్, టీపీటిఎఫ్ రాష్ట్ర నాయకులు లక్ష్మారెడ్డి, తిరుపతి రెడ్డి, టిఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పద్మారావ్, శ్రీనివాస్, టీపీటిఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కొంగోటి యాదగిరి, వెంకట్రామి రెడ్డి,టీపీటిఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షులు కొండల్ రెడ్డి ఆయా సంఘాల జిల్లా నాయకులు సంగయ్య, హిరలాల్, రవీందర్ రెడ్డి, రజిత తదితరులు పాల్గొన్నారు.



# పనివేళలు పెంచితే మానసిక వత్తిడే

### గత కొంతకాలంగా ప్రతిపాదనలు చేస్తున్న కార్పొరేట్ దిగ్గజాలు

### వారి ప్రతిపాదనను పరిగణనలోకి తీసుకోవడం లేదని తేల్చిన కేంద్రం


**దేశంలో ఉద్యోగుల పని గంటలపై చర్చ సాగుతున్న సంగతి తెలిసిందే. వారానికి గరిష్ట పని గంటలను 70 లేదా 90కు పెంచాలని కొందరు కార్పొరేట్ దిగ్గజాలు ప్రతిపాదిస్తున్న సంగతి తెలిసిందే. అయితే ఈ డిమాండ్లపై కేంద్ర ప్రభుత్వం స్పందించింది. వారానికి గరిష్ట పని గంటలను 70 లేదా 90 గంటలకు పెంచే ప్రతిపాదనను తాము పరిగణనలోకి తీసుకోవడం లేదని కేంద్రం ప్రభుత్వం పార్లమెంట్కు తెలిపింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి..**



దేశంలో ఉద్యోగుల పని గంటలపై చర్చ సాగుతున్న సంగతి తెలిసిందే. వారానికి గరిష్ట పని గంటలను 70 లేదా 90కు పెంచాలని కొందరు కార్పొరేట్ దిగ్గజాలు ప్రతిపాదిస్తున్న సంగతి తెలిసిందే. అయితే ఈ డిమాండ్లపై కేంద్ర ప్రభుత్వం స్పందించింది. వారానికి గరిష్ట పని గంటలను 70 లేదా 90 గంటలకు పెంచే ప్రతిపాదనను తాము పరిగణనలోకి తీసుకోవడం లేదని కేంద్రం ప్రభుత్వం సోమవారం రోజున పార్లమెంట్కు తెలిపింది. ఈ మేరకు కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ సహాయ మంత్రి శోభా కరంద్లాజే లోక్సభకు లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

## ఆర్థిక సర్వే విశ్లేషణ

"వారానికి గరిష్ట పని గంటలను 70 లేదా 90 గంటలకు పెంచే ప్రతిపాదన ఏదీ ప్రభుత్వ పరిశీలనలో లేదు" అని శోభా కరంద్లాజే పేర్కొన్నారు. కార్మికుల అంశం ఉమ్మడి జాబితాలో ఉన్నందున.. కార్మిక చట్టాల అమలును రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర ప్రభుత్వం వారి అధికార పరిధిలో నిర్వహిస్తాయని ఆమె సభకు తెలియజేశారు. కేంద్రం తరఫున సెంట్రల్ ఇండస్ట్రియల్ రిలేషన్స్ మెషనరీ (సీఐఆర్ఎం) తనిఖీ అధికారులతో పర్యవేక్షణ చేస్తుండగా, రాష్ట్రాలు ఆయా విభాగాల ద్వారా అమలు చేస్తాయని చెప్పారు. ప్రస్తుత కార్మిక చట్టాల ప్రకారం.. పని గంటలు, ఓవర్ టైం వంటి పని పరిస్థితులు ఫ్యాక్టరీల చట్టం 1948, సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాల షాప్స్ అండ్ ఎస్టాబ్లిష్మెంట్ చట్టాల నిబంధనల ద్వారా నియంత్రించబడతాయి. వారానికి 70 లేదా 90 గంటల పనికి సంబంధించిన చర్చ గురించి.. కేంద్ర బడ్జెట్కు ముందు ఆర్థిక సర్వేలో ప్రస్తావించింది. ఇందులో గత అధ్యయనాలను ఉదహరించారు. వారానికి 60 గంటలకు పైగా పని కోసం గడపడం వల్ల ప్రతికూల ఆరోగ్య ప్రభావాలు ఉంటాయని ఆర్థిక సర్వే వెల్లడించిందిరు. ఒకరు డెస్క్ వద్ద ఎక్కువ గంటలు గడపడం మానసిక శ్రేయస్సుకు హానికరం.. డెస్క్ వద్ద 12 లేదా అంతకంటే ఎక్కువ గంటలు గడిపే వ్యక్తులు మానసిక శ్రేయస్సు బాధాకరమైన లేదా కష్టతరమైన స్థాయిలను కలిగి ఉంటుందని వివిధ విశ్లేషణ ఫలితాలను ఉటంకిస్తూ ఆర్థిక సర్వే పేర్కొంది.



## ఆర్థిక లక్ష్యాలను సాధించాలంటే,

భారతదేశం తన ఆర్థిక లక్ష్యాలను సాధించాలంటే, ప్రజల జీవనశైలి ఎంపికలపై త్వరగా దృష్టి సారించాలి. పిల్లలు మరియు యువతలో ఈ జీవనశైలి ఎంపికలు ప్రారంభమవుతున్నాయి. కఠినమైన పని సంప్రదాయాలు, అదనపు పని గంటల వల్ల మానసిక ఆరోగ్యంపై ప్రభావం పడుతోంది. ఇది ఆర్థిక వృద్ధి వేగానికి అడ్డంకులను సృష్టిస్తోంది.

## ఒత్తిడి వల్ల ఏటా లక్ష కోట్ల డాలర్ల నష్టం

మానసిక వ్యాకులత, ఆందోళన కారణంగా అంతర్జాతీయంగా ఏటా 1,200 కోట్ల పని దినాలు నష్టపోతున్నాం. దీని వల్ల సుమారు 1 లక్ష కోట్ల డాలర్ల నష్టం ఎదురవుతోంది.

## జంక్ ఫుడ్ వల్ల మానసిక ఆరోగ్యంపై ప్రభావం

అల్ట్రా-ప్రాసెస్డ్ లేదా ప్యాకేజ్డ్ జంక్ ఫుడ్స్ తరచుగా తీసుకునే వారితో పోలిస్తే, వీటిని తక్కువగా తీసుకునే వారి మానసిక ఆరోగ్యం మెరుగ్గా ఉంటుంది.వ్యాయామాలు చేయకుండా, ఎక్కువగా సెల్ఫోన్లో సామాజిక మాధ్యమాలు చూస్తూ గడిపే వారి లేదా కుటుంబంతో పెద్దగా సమయం గడపని వారి మానసిక ఆరోగ్యం అధ్వానంగా మారుతోంది. ఆస్ట్రేలియాలో 16 ఏళ్ల లోపు పిల్లలను సామాజిక మాధ్యమాలు చూడకుండా నిషేధించడం ద్వారా, పిల్లలపై ఫోన్ల ప్రభావం ఎంత తీవ్రమైనదో తెలుస్తోంది.

## అల్ట్రా-ప్రాసెస్డ్ ఫుడ్స్ అరికట్టాలి

వీటిపై అధిక జీఎస్టీ, కఠిన ప్రమాణాలు అవసరం అల్ట్రా-ప్రాసెస్డ్ ఫుడ్స్ (యూపీఎఫ్లు) వినియోగాన్ని తగ్గించేందుకు కఠినమైన ఎఫ్ఎస్ఎస్ఏఐ లేబులింగ్ నిబంధనలు అమలు చేయాలని, వాటిపై జీఎస్టీ పెంచాలని ఆర్థిక సర్వే సూచించింది. వీటి వినియోగం తగ్గేలా అవగాహన కార్యక్రమాలు అమలు చేయాలని కూడా సలహా ఇచ్చింది. పోషకాహారమంటూ యూపీఎఫ్లపై ప్రచారం చేస్తున్న తప్పుడు సమాచారాన్ని అడ్డుకోవాలని సర్వే తెలిపింది. వీటి నిర్వచనం, ప్రమాణాల విషయంలో ఎఫ్ఎస్ఎస్ఏఐ స్పష్టత తీసుకురావాలని కోరింది. చక్కెర, ఉప్పు, సాచురేటెడ్ ఫ్యాట్స్ విషయంలో న్యూట్రియంట్ పరిమితులను ఆరోగ్య శాఖ తక్షణం విధించాలని సూచించారు. 18 ఏళ్లలోపు వారిని లక్ష్యంగా చేసుకుని, విడుదల చేస్తున్న అనారోగ్యకర ఆహారాలపై కఠినమైన మార్కెటింగ్ నిబంధనలు విధించాలని సూచనలు చేసింది. స్థానిక, సీజనల్ పళ్లు, కూరగాయలు తినడం అలవాటు చేసుకోవాలి. చిరుధాన్యాలు (మిలెట్స్), పళ్లు, కూరగాయల వినియోగం పెరిగేలా సానుకూల సబ్సిడీలను అందించాలని ప్రభుత్వాలకు కూడా ఈ సర్వే సూచించింది.

**బి.వి.రమణ,**
**94407 40015**

## క్వాంటిటీ కాదు.. క్వాలిటీ ముఖ్యం!




దేశంలోని టాప్ రేంజ్ కార్పొరేట్ పెద్దలు చేస్తున్న ఇలాంటి వ్యాఖ్యలపై ఆనంద్ మహీంద్రా వ్యాఖ్యానించారు. పని నాణ్యతను నమ్ముతానని పని ఎంత పరిమాణంలో చేశారనేది కాదని ఆనంద్ మహీంద్రా స్పష్టం చేశారు.

నేను ఒంటరిగా ఉన్నందున సోషల్ మీడియా ప్లాట్ఫామ్ 'ఎక్స్'లో లేనని చెప్పాడు. నా భార్య చాలా బాగుంది. ఆమెను చూడటం నాకు చాలా ఇష్టం. నేను సోషల్ మీడియాలో ఉన్నాను. ఎందుకంటే ఇది అద్భుతమైన వ్యాపార సాధనం. ప్రస్తుత పనిగంటలపై చర్చ తప్పు.. ఎందుకంటే.. ఇది పని గంటల కన్నా నాణ్యతపైనే ఆధారపడి ఉంటుందని ఆయన తెలిపారు.

నారాయణ మూర్తి (ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు) సహా ఇతరులను నేను చాలా గౌరవిస్తాను. నేను దానిని తప్పుగా తీసుకోను. కానీ, ఈ చర్చ తప్పు దిశలో సాగుతుందని నేను భావిస్తున్నాను. మేము పని గంటలపై కాకుండా పని నాణ్యతపై దృష్టి పెట్టాలని నేను నమ్ముతున్నాను. అని అన్నారు.

## అంత అవసరం లేదు



వర్క్ లైఫ్ బ్యాలెన్స్ గురించి ఐటీ, టెక్ రంగాల్లో విస్తృత చర్చ జరుగుతున్న క్రమంలో..ఈ అంశంపై తాజాగా దేశం లోనే నాలుగో అతిపెద్ద ఐటీ సంస్థ విప్రో ఛైర్మన్ రిషద్ ప్రేమ్జీ స్పందించారు. ఉద్యోగులు వారానికి 70 గంటలు, 90 గంటల చొప్పున పనిచేయాలని పలు కంపెనీల ఛైర్మన్లు ఇటీవల వ్యాఖ్యలు చేసిన తరుణంలో ఇప్పుడు రిషద్ మాట్లాడారు. పని-జీవిత సమతుల్యతను (వర్క్ లైఫ్ బ్యాలెన్స్) తాను నమ్ముతానని స్పష్టం చేశారు. పనిలో అనుకున్నది పూర్తి చేయడమే.. మనం కోరుకునే సమతుల్యత అన్నారు. ఇందుకోసం 70 గంటలు పనిచేయాల్సిన పని లేదని.. వర్క్ లైఫ్ బ్యాలెన్స్ను తాను నమ్ముతానని చెప్పుకొచ్చారు.

## నేను అలాగే పని చేసా



ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నారాయణ మూర్తి.. గతేడాది ఒక పాడ్కాస్ట్లో చేసిన వ్యాఖ్యల తర్వాత వచ్చింది. అభివృద్ధి చెందిన అమెరికా, చైనా, జపాన్ వంటి దేశాల సరసన భారత్ నిలబడాలంటే.. అభివృద్ధి చెందాలంటే దేశంలోని యువత వారానికి 70 గంటల చొప్పున పని చేయాలని సూచించారు. తాను అలాగే పనిచేశానని అన్నారు. దీనిపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ముఖ్యంగా ఐటీ, టెక్ రంగాల్లో ఉద్యోగులు తమ ఒత్తిడిని ప్రస్తావిస్తూ.. వర్క్ లైఫ్ బ్యాలెన్స్ను ప్రస్తావిస్తూ ఆయనపై విమర్శలు చేశారు. అయినా తర్వాత పలుమార్లు తన వ్యాఖ్యల్ని నారాయణ మూర్తి సమర్థించుకున్నారు. తాను అలా చేశానని.. అందర్నీ ఇలా చేయమని తాను చెప్పట్లేదని అన్నారు. ఎవరి ఇష్టం వారిది అని వదిలేశారు


## ఆదివారాలు కూడా పనిచేయాలి



ఎల్ అండ్ టీ ఛైర్మన్ ఎస్ఎన్ సుబ్రహ్మణ్యన్ ఇటీవల చేసిన వ్యాఖ్యలపై మరింత వ్యతిరేకత వ్యక్తమైంది. 'ఇంట్లో కూర్చొని భార్య ముఖం ఎంతసేపు చూస్తారు. ఆదివారాలు కూడా పనిచేయాలని ఉద్యోగులకు ఎందుకు చెప్పట్లేదు. వారంలో 90 గంటలు పనిచేయాలి.' అని ఇటీవల కంపెనీ వర్చువల్ మీటింగ్లో ఆయన మాట్లాడిన వీడియో వైరల్ అయింది. దీనిపై దిగ్గజ కంపెనీల అధినేతలు కూడా స్పందించి దీనిని తప్పుబట్టారు. ఎంత సేపు పనిచేశామన్నది కాదని.. నాణ్యతే ముఖ్యమని.. వర్క్ లైఫ్ బ్యాలెన్స్ ఉండాలని.. మీరు మీ భార్య ముఖం ఎందుకు చూడొద్దనుకుంటున్నారని.. ఇలా ఎన్నో కామెంట్స్ వచ్చాయి




# రోహిత్‌శర్మ రిటైర్మెంట్‌పై డేట్



టీమ్ ఇండియా కెప్టెన్ రోహిత్ శర్మ రిటైర్మెంట్ గురించి మరోసారి చర్చ మొదలైంది. 2024 లో టి-20 ప్రపంచ కప్ తర్వాత పొట్టి ఫార్మాట్ కి రిటైర్మెంట్ ప్రకటించిన రోహిత్ శర్మ.. ప్రస్తుతం వన్డేలు, టెస్ట్ లకు కెప్టెన్ గా వ్యవహరిస్తున్నాడు. అయితే రోహిత్ శర్మ నాయకత్వంలో టీమ్ ఇండియా మరో రెండు వారాల్లో ప్రారంభం కాబోయే ఛాంపియన్స్ ట్రోఫీలో బరిలోకి దిగనుంది. ఈ ఛాంపియన్స్ ట్రోఫీ తర్వాత రోహిత్ శర్మ రిటైర్మెంట్ ప్రకటిస్తాడని సమాచారం. ఎందుకంటే టీమిండియా భవిష్యత్తు సారథ్యంతో పాటు వరల్డ్ టెస్ట్ ఛాంపియన్షిప్ 2025 %-% 27 సీజన్, 2027 వన్డే వరల్డ్ కప్ కోసం జట్టును సిద్ధం చేసేందుకు బీసీసీఐ ప్రణాళికలు రచిస్తోంది. ఇందుకోసం రోహిత్ శర్మ తన భవిష్యత్తు ప్రణాళికలపై స్పష్టత ఇవ్వాలని బీసీసీఐ అతడిని అడిగినట్లు సమాచారం. నిజానికి బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా ఆస్ట్రేలియాతో జరిగిన టెస్ట్ సిరీస్ సమయంలోనే రోహిత్ శర్మ రిటైర్మెంట్ ప్రకటిస్తారని అంతా భావించారు. కానీ అలా జరగలేదు తాను మరికొంత కాలం పాటు కెప్టెన్ గా, ప్లేయర్ గా కొనసాగుతానని.. ఆ తర్వాత భవిష్యత్తు నిర్ణయం గురించి చెబుతానని రోహిత్ శర్మ బిసిసిఐకి చెప్పినట్టు వార్తలు వచ్చాయి. అయితే ఇప్పుడు ఛాంపియన్స్ ట్రోఫీ తర్వాత ఈ విషయంపై నిర్ణయం తీసుకోబోతున్నాడని సమాచారం. ఓ వార్తాపత్రిక నివేదిక ప్రకారం.. జూన్ %-% జూలైలో టీమిండియా ఇంగ్లాండ్ లో పర్యటించబోతోంది. ఈ పర్యటనకు రోహిత్ శర్మ ఎంపిక అయ్యే అవకాశం లేదు.ఎందుకంటే ఛాంపియన్ ట్రోఫీతోనే అతడి అంతర్జాతీయ కెరీర్ ముగియనుంది. ఛాంపియన్స్ ట్రోఫీలో భారత్ మూడు లీగ్ మ్యాచ్ లు ఆడాల్సి ఉంది. చివరి లీగ్ మ్యాచ్ మార్చి 2న జరగనుంది. ఒకవేళ జట్టు సెమీఫైనల్ వరకు వెళ్లలేకపోతే మార్చి 2 రోహిత్ శర్మ అంతర్జాతీయ కెరీర్ లో చివరి రోజు కావచ్చు.

# త్రిషకు భారీ నజరానా ప్రకటించిన సీఎం రేవంత్ రెడ్డి






మలేషియాలోని కౌలాలంపూర్ వేదికగా జరిగిన ఐసీసీ అండర్ 19 మహిళల టి-20 ప్రపంచ కప్ లో అద్భుతమైన ప్రదర్శన కనబరిచిన తెలంగాణ యువ క్రికెటర్ గొంగడి త్రిష.. భారత జట్టు గెలుపులో కీలకపాత్ర పోషించింది. ఈ నేపథ్యంలో గొంగడి త్రిష.. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా త్రిషను అభినందించారు సీఎం రేవంత్ రెడ్డి. భవిష్యత్తులో దేశం తరఫున మరింత పెద్ద స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. ఈ నేపథ్యంలోనే క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపిన సీఎం రేవంత్ రెడ్డి.. గొంగడి త్రిషకు రూ. కోటి రూపాయల నజరానా ప్రకటించారు. అలాగే అండర్ 19 వరల్డ్ కప్ టీమ్ హెడ్ కోచ్ నోషీన్, ట్రైనర్ శాలినికి పది లక్షల చొప్పున నజరానా ప్రకటించారు సీఎం రేవంత్ రెడ్డి.వీరితోపాటు అండర్ 19 వరల్డ్ కప్ జట్టు సభ్యురాలు అయిన తెలంగాణ క్రికెటర్ ధృతి కేసరికి పది లక్షలు ప్రకటించారు. తెలంగాణ ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహించేందుకు అన్ని విధాల సహకరిస్తుందని తెలిపారు సీఎం రేవంత్. ఈ కార్యక్రమంలో తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, తదితరులు పాల్గొన్నారు. కాగా తెలంగాణ ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహించడం పట్ల తెలంగాణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇక ఐసీసీ అండర్ 19 మహిళల టి-20 ప్రపంచ కప్ లో గొంగడి త్రిష ఆల్ రౌండ్ ప్రదర్శనకు గాను ఆమెను "ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్" గా ఎంపిక చేశారు. ఇక ఫిబ్రవరి 4వ తేదీ మంగళవారం రోజున ఆమె తిరిగి శంషాబాద్ విమానాశ్రయంలో అడుగుపెట్టింది. ఈ క్రమంలో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జగన్ మోహన్ రావు ఆమెకు ఘన స్వాగతం పలికారు. త్రిషను ఆదర్శంగా తీసుకొని మరింత మంది మహిళా క్రికెటర్లు తెలంగాణ నుంచి రావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా త్రిష మాట్లాడుతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది.

జట్టు పడిన కష్టానికి ప్రతిఫలం దక్కిందని.. ఇకపై మరింత కష్టపడి సీనియర్ జట్టులో చోటు సాధించడమే తన లక్ష్యమని తెలిపింది. తన ప్రతి విషయం లోనూ తన నాన్న ఉన్నారని పేర్కొంది. స్పోర్ట్స్ ని తమ కెరియర్ గా ఎంచుకోవచ్చని, సత్తా చాటితే మంచి భవిష్యత్తు ఉంటుందని తెలిపింది. ఇక ఐసీసీ అండర్ 19 మహిళల టి-20 ప్రపంచ కప్ టోర్నీ మొత్తంలో ఏడు మ్యాచ్ లలో గొంగడి త్రిష 309 పరుగులు చేసింది. వరల్డ్ కప్ గెలవడంలో "కీ" ప్లేయర్ గా నిలవడమే కాదు.. మంచి ఫామ్ లో ఉంటూ యావరేజ్ 77, స్ట్రైక్ రేట్ 144 తో క్రీడాభిమానులను అలరించింది. గొంగడి త్రిష నుంచి ముందు మరిన్ని అద్భుతమైన రికార్డులను ఇండియా చూడడం ఖాయం

# నెంబర్ 1 జట్టుగా టీమిండియా




అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) తాజాగా విడుదల చేసిన టి-20 ర్యాంకింగ్స్ లో టీమిండియా మొదటి స్థానంలోకి దూసుకొచ్చింది. తాజాగా ఇంగ్లాండ్ తో జరిగిన ఐదు టి-20 ల సిరీస్ ని 4-1 తో భారత్ కైవసం చేసుకోవడంతో ఐసీసీ టీ-20 ర్యాంకింగ్స్ లో టీమిండియా అగ్రస్థానంలో నిలిచింది. 73 మ్యాచ్ లు ఆడిన భారత్ 268 రేటింగ్ పాయింట్లతో అగ్రస్థానాన్ని దక్కించుకుంది. ఇక ఆస్ట్రేలియ 259 పాయింట్లతో రెండవ స్థానం లో నిలిచింది. ఇంగ్లాండ్ 205 పాయింట్లతో మూడవ స్థానం, వెస్టిండీస్ 247 పాయింట్లు నాలుగవ స్థానం, న్యూజిలాండ్ 2047 పాయింట్లతో 5వ స్థానంలో నిలిచాయి. సౌత్ ఆఫ్రికా, పాకిస్తాన్, శ్రీలంక తర్వాత స్థానాలను దక్కించుకున్నాయి. ఇక టి-20 బ్యాటింగ్ విభాగంలో టీమిండియా యంగ్ ప్లేయర్ అభిషేక్ శర్మ 829 పాయింట్లతో 38వ స్థానం నుంచి రెండవ స్థానంలోకి దూసుకొచ్చాడు. అభిషేక్ శర్మ కేవలం టి-20 బ్యాటింగ్ ర్యాంక్స్ లో మాత్రమే కాకుండా ఆల్రౌండర్ విభాగంలోనూ 31 స్థానాలు వేగబాకి 13వ ర్యాంక్ కి చేరుకున్నాడు. ఆస్ట్రేలియా ప్లేయర్ ట్రావిస్ హెడ్ 855 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు.

ఇక మూడవ స్థానంలో మరో టీమిండియా యంగ్ ప్లేయర్ తిలక్ వర్మ 803 పాయింట్లతో రెండవ స్థానం నుంచి మూడవ స్థానానికి పడిపోయాడు. నాలుగవ స్థానంలో కొనసాగుతున్న సూర్య కుమార్ యాదవ్ ఒక మెట్టు దిగి 738 పాయింటులతో 5వ స్థానంలో కొనసాగుతున్నాడు. అలాగే బౌలింగ్ లో ప్రస్తుతం వరుణ్ చక్రవర్తి మానియా నడుస్తోంది. రీఎంట్రీ ఇచ్చిన తర్వాత అతని స్టైల్, యాటిట్యూడ్ పూర్తిగా మారిపోయింది.

ఇది అతని ఐసీసీ ర్యాంకింగ్స్ ని కూడా ప్రభావితం చేసింది. ఐసీసీ టి-20 బౌలర్ల ర్యాంకింగ్స్ లో వరుణ్ చక్రవర్తి 705 పాయింట్లతో మూడవ స్థానంలో కొనసాగుతున్నాడు. 705 పాయింట్లతో ఇంగ్లాండ్ ప్లేయర్ ఆదిల్ రషీద్ రెండవ స్థానంలో ఉండగా, 707 పాయింట్లతో వెస్టిండీస్ ప్లేయర్ అకేల్ హొసేన్ అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. కాగా టి-20 ఆల్ రౌండర్ల జాబితాలో 251 పాయింట్లతో హార్దిక్ పాండ్యా అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు.

161 పాయింట్లతో మరో ఇండియా ఆల్రౌండర్ అక్షర్ పటేల్ ఒక స్థానం ఎగబాకి 11వ స్థానంలోకి దూసుకొచ్చాడు. ఇంగ్లాండ్ తో జరిగిన ఐదు టి-20 సిరీస్ లో బ్యాటింగ్ లో అద్భుత ప్రదర్శన కనబరిచిన అభిషేక్ శర్మ, తిలక్ వర్మ, బౌలింగ్ లో వరుణ్ చక్రవర్తి, ఆల్ రౌండర్ ప్రదర్శనతో హార్దిక్ పాండ్యా ఐసీసీ టి-20 ర్యాంకింగ్స్ లో వారి స్థానాలను మెరుగుపరుచుకున్నారు. ఈ నేపథ్యంలో భారత యువ ఆటగాళ్లపై సోషల్ మీడియా వేదికగా ప్రశంసలు కురిపిస్తున్నారు

## కర్నూల్ పేపర్ బాయ్..

# సెపక్తక్రా క్రీడల్లో విశ్వవిజేత




కర్నూలుకు చెందిన సరస్వతి ఎర్రన్నలకు నలుగురు కుమారులు. ఎర్రన్న రుమాల్ రోటి తయారు చేయడంలో సిద్ధంహస్తుడు. చెఫ్గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. అనివార్య కారణాలవల్ల 2014లో అనారోగ్యం పాలై ఎర్రన్న మృతి చెందాడు. దీంతో కుటుంబ భారం అంతా తల్లి సరస్వతిపై పడింది.

కుటుంబ ఆర్థిక పరిస్థితులు తెలుసుకున్న ముగ్గురు పిల్లలు అశోక్ కుమార్, శివకుమార్, చిరులు తల్లికి చేదోడువాదులుగా ఉండేవారు.

ఇక రెండవ కుమారుడైన శివకుమార్.. తండ్రి బాటలో పయనిస్తూ పార్ట్ టైంగా ఉదయం పేపర్ బాయ్గా పని చేస్తూ అనంతరం మైదానంలో సెపక్తక్రా క్రీడను సాధన చేసేవాడు. ఓవైపు పనులు చేస్తూనే, మరోవైపు ఆట ఆడుతూ బీకాం పూర్తి చేశాడు.

చిన్నప్పుడు చేసిన కఠోర సాధన నేడు అంతర్జాతీయ స్థాయిలో భారతదేశానికి బంగారు పథకాలను తెచ్చిపెడుతోంది.

అన్న అశోక్ కుమార్ కూడా సెపక్తక్రా క్రీడలో ప్రతిభ కనబరిచి స్పోర్ట్స్ కోటాలో హైదరాబాదులో పోస్టల్ శాఖలో ఉద్యోగం సాధించాడు. తమ్ముడు చిరు బెంగళూరులో సాఫ్ట్వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. శివకుమార్ సెపక్తక్రాలులో దాదాపు 20 పైగా రాష్ట్రస్థాయి జాతీయస్థాయి ఛాంపియన్ షిప్లో పాల్గొన్నాడు. ఐదుసార్లు అంతర్జాతీయ స్థాయిలో భారతదేశం తరపున ప్రాతినిధ్య వహించాడు. 2024 జులైలో ముంబైలో ఇన్కమ్ టాక్స్ ఇన్స్పెక్టర్గా స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం సాధించాడు.

ఈ ఉద్యోగానికి దాదాపు పదివేల మంది క్రీడాకారులు దరఖాస్తు చేసుకోగా అంతర్జాతీయ స్థాయిలో బంగారు పతకాలు సాధించడంతో ఉద్యోగం శివకుమార్ను వరించింది. 2022లో సీనియర్ రెగు వరల్డ్ ఛాంపియన్షిప్ బ్యాంకాక్లో గోల్డ్ మెడల్ సాధించాడు. 2023లో బ్యాంకాక్ లో జరిగిన వరల్డ్ ఛాంపియన్షిప్ లో బ్రాంజ్ మెడల్ సాధించాడు. 2024లో సౌత్ ఏషియన్ ఛాంపియన్షిప్ పోటీల్లో మూడు బంగారు పథకాలు సాధించి రికార్డు సృష్టించాడు.

# వరుస విజయాలతో శివం దూబే ప్రపంచ రికార్డ్..

శివం దూబే టీం ఇండియా తరపున ఆడితే విజయం ఖాయం. గత 30 టీ20 మ్యాచ్ల ఫలితాలే దీనికి నిదర్శనం. ఈ ఫలితాలతో, శివం దూబే ఇప్పుడు టీ20 క్రికెట్లో మరెవరూ చేయలేని ఒక ప్రత్యేకమైన ప్రపంచ రికార్డును నెలకొల్పాడు. అది కూడా వరుసగా 30 విజయాలతో..! అవును, %%20 క్రికెట్లో వరుసగా 30 మ్యాచ్లను గెలిచిన ప్రపంచంలోనే తొలి ఆటగాడిగా శివం దుబే ప్రపంచ రికార్డు సృష్టించాడు. అంటే, దూబే ఆడిన గత 30 టీ20 మ్యాచ్లలో టీం ఇండియా ఒక్క టీ20 మ్యాచ్లోనూ ఓడిపోలేదు. జనవరి 2020లో ప్రారంభమైన ఈ విజయ పరంపర ఇప్పుడు ఇంగ్లాండ్తో జరిగిన సిరీస్లో కూడా కొనసాగింది. 2020లో టీం ఇండియా న్యూజిలాండ్ను 5-0 తేడాతో ఓడించినప్పుడు దుబే భారత జట్టులో భాగం.2024లో టీం ఇండియా ఆడిన 15 మ్యాచ్లో దూబే ఆడాడు. ఈ మ్యాచ్లన్నింటిలోనూ టీం ఇండియా గెలిచింది. అదేవిధంగా, 2024 టీ20 ప్రపంచ కప్లో, భారత జట్టు 8 విజయాలతో ప్రపంచ ఛాంపియన్గా నిలిచింది. ఈ మ్యాచ్లన్నింటిలోనూ దూబే ఆడాడు.

**భారత బ్యాటర్లకు చుక్కలు చూపించిన లెఫ్ట్ ఆర్మ్ పేసర్లు వీరే..** ఇంగ్లాండ్తో జరిగే 5 మ్యాచ్ల సిరీస్లోని చివరి రెండు మ్యాచ్ల కోసం దూబే ఇప్పుడు మైదానంలో ఉన్నాడు. ఈ మ్యాచ్లలో కూడా టీం ఇండియా గెలిచింది. దీనితో, శివం దుబే అంతర్జాతీయ టీ20 క్రికెట్ చరిత్రలో వరుసగా 30 మ్యాచ్లు గెలిచిన తొలి ఆటగాడిగా నిలిచాడు.

**33 మ్యాచ్లో విజయాలు..** శివం దుబే 2019 లో టీం ఇండియా తరపున అరంగేట్రం చేశాడు. బంగ్లాదేశ్తో జరిగిన సిరీస్తో అంతర్జాతీయ అరంగేట్రం చేసిన దూబేకు ఓటమి ఎదురైంది. దీని అర్థం దూబే తొలి మ్యాచ్లో టీమ్ ఇండియా 7 వికెట్ల తేడాతో ఓడిపోయింది.ఆ తరువాత, శివం దుబే ఆడిన మూడు మ్యాచ్లలో టీం ఇండియా గెలిచింది. కానీ, 5వ మ్యాచ్లో టీమ్ ఇండియా మరో ఓటమిని చవిచూసింది.ఈ ఓటమి తర్వాత శివం దూబే మళ్లీ ఎప్పుడూ ఓడిపోకపోవడం విశేషం. అంటే 2020 నుంచి డ్యూబ్ ఆడిన




30 మ్యాచ్లోనూ టీమ్ ఇండియా గెలిచింది. దీనితో, శివం దూబే ఇప్పుడు వరుస విజయాలో కొత్త చరిత్ర సృష్టించాడు.

# రికీ పాంటింగ్ ఆల్ టైమ్ గ్రేట్




ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్, క్రికెట్ చరిత్రలో అత్యుత్తమ ఆటగాడిగా దక్షిణాఫ్రికా ఆల్-రౌండర్ జాక్వెస్ కల్లిస్ను అభివర్ణించారు. అతను 13,000ం టెస్ట్ పరుగులు, 300 వికెట్లు, 45 సెంచరీలు సాధించిన అద్భుతమైన క్రికెటర్. పాంటింగ్ మాట్లాడుతూ, కల్లిస్ స్లిప్స్లో అద్భుతమైన క్యాచర్, నిశ్శబ్దమైన వ్యక్తిత్వంతో ఎంతో గొప్ప ఆటగాడిగా మరిచి పోయాడు. జాక్వెస్ కల్లిస్ టెస్ట్, వన్డే క్రికెట్లో 10,000ం పరుగులు, 200ం వికెట్లు సాధించిన ఏకైక ఆటగాడిగా గుర్తించబడ్డాడు. అతని ఆట ప్రపంచ క్రికెట్లో చిరస్థాయిగా నిలుస్తుంది. ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్ క్రికెట్ చరిత్రలో అత్యుత్తమ క్రికెటర్గా ఎవరు నిలిచారనే అంశంపై తన అభిప్రాయాన్ని వెల్లడించారు. చాలా మంది అభిమానులు సచిన్ టెండూల్కర్, బ్రియాన్ లారా, డాన్ బ్రాడ్మన్ వంటి దిగ్గజాలను ఊహించినా, పాంటింగ్ మాత్రం దక్షిణాఫ్రికా ఆల్రౌండర్ జాక్వెస్ కల్లిస్ను 'గ్రేటెస్ట్ క్రికెటర్'గా అభివర్ణించారు.

**కల్లిస్ అసమాన ప్రతిభం:** "జాక్వెస్ కల్లిస్నే ఇప్పటివరకు ఆడిన గొప్ప క్రికెటర్ అని నేను భావిస్తున్నాను. 13,000 టెస్ట్ పరుగులు, 45 సెంచరీలు, 300 వికెట్లు! వీటిలో ఏదైనా ఒక్కటి సాధించినా అది గొప్ప విషయం. కానీ కల్లిస్ రెండింటినీ సాధించాడు. అతను అసలు క్రికెటర్గా పుట్టాడు," అని పాంటింగ్ 'ద హెూవీ గేమ్స్' పాడ్కాస్ట్లో వెల్లడించారు "అతను స్లిప్స్లో అద్భుతమైన క్యాచర్. కొంత అసాధారణ శైలి ఉన్నప్పటికీ, అతను ఇప్పటివరకు క్యాచ్ ఏదీ వదలలేదు. అతని నైజం నిశ్శబ్దంగా ఉండటంతో, అతని గొప్పతనాన్ని చాలామంది మర్చిపోయారు," అని పాంటింగ్ అభిప్రాయపడ్డారు.

**అద్భుత రికార్డులు :** జాక్వెస్ కల్లిస్, క్రికెట్ చరిత్రలోని ఒక అద్భుతమైన ఆల్-రౌండర్గా నిలిచాడు. అతను టెస్ట్ మరియు వన్డే క్రికెట్లో 10,000ం పరుగులు సాధించి, 200ం వికెట్లు తీసిన ఏకైక ఆటగాడు. 12,000ం పరుగులు మరియు 500ం వికెట్లు తీసిన ఏకైక క్రికెటర్. అతనికి 23 సార్లు టెస్ట్ క్రికెట్లో 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది. మొత్తం 57 సార్లు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డులు గెలుచుకున్నాడు.

2007లో పాకిస్తాన్తో జరిగిన టెస్ట్ మ్యాచ్లో, మొదటి ఇన్నింగ్స్లో 155 పరుగులు చేసి, రెండవ ఇన్నింగ్స్లో 100 పరుగులతో దక్షిణాఫ్రికా విజయానికి దోహదం చేశాడు.

**అద్భుత బ్యాటింగ్, బౌలింగ్ ప్రతిభ :** జాక్వెస్ కల్లిస్ తన కెరీరులో 10,000ం టెస్ట్ పరుగులు, 12,000ం వన్డే పరుగులు సాధించి, బ్యాటింగ్లో అసాధారణ ప్రతిభను ప్రదర్శించాడు. అతను 45 టెస్ట్ సెంచరీలు, 17 వన్డే సెంచరీలు చేశాడు. అలాగే, బౌలింగ్లో కూడా జాక్వెస్ కల్లిస్ 200ం టెస్ట్ వికెట్లు మరియు 270ం వన్డే వికెట్లు తీసి, ఆల్-రౌండర్గా తన ప్రతిభను నిరూపించాడు.కల్లిస్ తన కెరీర్లో 200ం వికెట్లు తీసి, 10,000ం పరుగులు చేసిన మొదటి ఆటగాడిగా ఆల్-రౌండర్గా అద్భుతమైన మైలురాయి సృష్టించాడు. అతని ప్రతిభ అనేక సార్లు జట్టు విజయాలను నడిపించింది. క్రికెట్ ప్రపంచంలో జాక్వెస్ కల్లిస్ ఒక అద్భుతమైన ఆల్-రౌండర్గా పేరుగాంచాడు. అతని బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ ప్రతిభలు అసాధారణమైనవి. అతని వ్యక్తిత్వం మరియు ఆలోచనా విధానాలు కూడా స్ఫూర్తిదాయకం. ఈ విధంగా, జాక్వెస్ కల్లిస్ క్రికెట్ చరిత్రలో అత్యుత్తమ ఆల్-రౌండర్గా నిలిచిపోతాడు.

# పంత్ VS రాహుల్!

2025 ఛాంపియన్స్ ట్రోఫీ కోసం భారత జట్టులో బ్యాటర్-కీపర్ ఎంపికపై రిషబ్ పంత్ మరియు కెఎల్ రాహుల్ మధ్య పోటీ మొదలైంది. రాహుల్ స్థిరత్వం మరియు క్రమబద్ధమైన ఆటను ప్రదర్శిస్తుండగా, పంత్ స్పిన్నర్లను శక్తివంతంగా తలపిస్తున్నాడు. మహ్మద్ షమీ తన అనుభవంతో పేస్ దళాన్ని నడిపించడానికి సిద్ధంగా ఉన్నాడు. ఈ సిరీస్ భారత జట్టులో కీలక ఎంపికలపై కీలక ఆధారాలను ఇస్తుంది, తద్వారా 2025 ఛాంపియన్స్ ట్రోఫీకి మరింత శక్తివంతమైన జట్టు సిద్ధమవుతుంది. 2025 ఛాంపియన్స్ ట్రోఫీకి భారత జట్టులో బ్యాటర్-కీపర్ స్థానంలో ఎవరిని ఎంపిక చేయాలనే ప్రశ్న ప్రస్తుతం చర్చకు వస్తోంది. రిషబ్ పంత్ లేదా కెఎల్ రాహుల్, ఈ ఇద్దరి ఆటగాళ్ల మధ్య ఎంపిక గమనించినప్పుడు, టీమ్ ఇండియా కోచ్ గౌతమ్ గంభీర్, కెప్టెన్ రోహిత్ శర్మకు కఠినమైన నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. గురువారం నుండి ఇంగ్లాండ్తో జరిగే వన్డే సిరీస్ ఈ ఎంపికపై ఆసక్తికరమైన ఆధారాలను అందిస్తుంది.ఈ శిక్షణా సెషన్లో రాహుల్ తన బ్యాటింగ్ పరిమితులను పెంచే ప్రయత్నం చేస్తూ, వికెట్ కీపింగ్ కసరత్తులు కూడా నిర్వహించాడు. అతను అత్యంత ఖచ్చితత్వంతో వికెట్ కీపింగ్ చేయడానికి తన కసరత్తును పెంచుకుంటూ, భారత జట్టులో వికెట్ కీపర్గా తన స్థాయిని నిరూపించాడు. పంత్ బ్యాటింగ్పై దృష్టి పెట్టాడు. ఒంటి చేత్తో సిక్సర్లు, చీకింగ్ ర్యాంప్లు, తన ట్రేడ్మార్క్ ఫాలింగ్ స్లాగ్, రివర్స్ స్వీప్లను చేస్తూ స్పిన్నర్లను అశ్రద్ధగా తలపించాడు.రాహుల్ తమ




దృష్టిలో క్రమబద్ధమైన ఆటను ప్రదర్శిస్తాడు, అతని స్థిరత్వం భారత టాప్ ఆర్డర్లో ఉపయోగకరమైనది. 2023 వన్డే ప్రపంచ కప్లో రాహుల్ బాగా రాణించాడు, 452 పరుగులు చేసినప్పటికీ, పంత్ అనౌన్స్ చేయని అనూహ్యత, శక్తి, పెద్ద స్కోర్లను సాధించగల సామర్థ్యం అతన్ని మరింత విలువైన ఎంపికగా మారుస్తుంది.

ఇటీవల శ్రీలంకతో జరిగిన వన్డే సిరీస్లో, రాహుల్ 31, 0 పరుగులు చేశాడు, అయితే పంత్ మూడవ గేమ్లో 6 పరుగులు మాత్రమే చేయగలిగాడు. భారత జట్టు ఎంపికను కష్టతరంగా తీసుకోవడం, అందులో అయ్యర్కు నష్టం కలిగించే అవకాశం ఉంది.

ఫాస్ట్ బౌలింగ్ విషయంలో మహ్మద్ షమీ తన అనుభవాన్ని చాటుకున్నాడు. సర్జరీ నుండి కోలుకున్న షమీ, పేస్ అటాక్లో భారత జట్టుకు నాయకత్వం వహించాలని భావించాడు. అతను దాదాపు గంటన్నర పాటు పూర్తి వంపులో బౌలింగ్ చేశాడు, ఈ మధ్యలో కెప్టెన్ రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీతో కలిసి ఈ సవాలను ఆస్వాదించాడు.

# 'తండేల్' నా కెరీర్ లో బిగ్గెస్ట్ మూవీ



యువ సామ్రాట్ అక్కినేని నాగచైతన్య, సాయి పల్లవి హైలీ యాంటిసిపేటెడ్ మూవీ 'తండేల్'. చందూ మొండేటి దర్శకత్వంలో మెగా ప్రొడ్యూసర్ అల్లుఅరవింద్ సమర్పణలో గీతాఆర్ట్స్ బ్యానర్‌పై ఫ్యాషనేట్ ప్రొడ్యూసర్ బన్నీవాసు నిర్మించిన ఈ చిత్రం ఫిబ్రవరి 7న ప్రపంచ వ్యాప్తంగా భారీగా విడుదల కానుంది. ఇప్పటికే రిలీజైన ప్రమోషన్స్ కంటెంట్ హ్యూజ్ బజ్ ని క్రియేట్ చేసింది. ఈ సందర్భంగా హీరో అక్కినేని నాగచైతన్య విలేకరుల సమావేశంలో 'తండేల్' విశేషాలు పంచుకున్నారు.

**'తండేల్' సినిమాపై ఆడియన్స్ లో చాలా అంచనాలు వున్నాయి. మీలో ఎలాంటి ఎక్సయిట్మెంట్ వుంది ?**
నా కెరీర్ లో బిగ్గెస్ట్ ప్రొడక్షన్, హై బడ్జెట్ మూవీ. క్యారెక్టర్, స్టోరీ అన్ని రకాలుగా బిగ్ స్పాన్ వున్న సినిమా ఇది. చాలా ఎక్సయిట్మెంట్ వుంది. ఆల్రెడీ సినిమా చూశాం. చాలా కాన్ఫిడెంట్‌గా వున్నాం. సెకండ్ హాఫ్ అయితే యునానిమాస్‌గా చాలా బాగా చెప్పారు. నాకు కూడా ఎమోషనల్ హై ఇచ్చింది. చివరి ముప్పై నిమిషాలు వెరీ సాటిస్ఫాక్షన్. క్లైమాక్స్ గ్రేట్ ఎమోషనల్ హై ఇస్తుంది.

**'తండేల్' కథ ఎలా వచ్చింది ?**
దూత సమయంలో ఈ కథ విన్నాను. వాసు గీత ఆర్ట్స్‌లో ఈ కథని హోల్డ్ చేశారని తెలిసింది. డెవలప్ చేసి మంచి సేఫ్ వస్తే చెప్పమన్నాను. నేను మొదట విన్నప్పుడు ఒక డాక్యుమెంటరీలా వుంది. సినిమాటిక్ లాంగ్వేజ్‌లోకి తీసుకురావడానికి వర్క్ చేయాలి. అలా వర్క్ చేసిన తర్వాత అద్భుతంగా వచ్చింది.

**శ్రీకాకుళం వెళ్లి అక్కడి వారిని కలవడం ఎలా అనిపించింది ?**
ఈ కథ మొదట ఓ ఐడియాగా చెప్పారు. పాత్రకు తగ్గట్టుగా మారా లంటే వాళ్ళ లైఫ్ స్టయిల్ తెలుసుకోవాలి. అలా తెలుసుకో వడానికి వాళ్ళని నేరుగా కలవాలని వెళ్లాం. మొత్తం హోం వర్క్ చేశాక నేను చేయగలనని కన్విన్స్ అయిన తర్వాత జర్నీ మొదలైయింది.

**మీరు ఈ సినిమాకి ప్రాణం పెట్టి వర్క్ చేశారని బన్నీ వాసు చెప్పారు. యాక్టర్ గా నెక్స్ట్ లెవల్ కి వెళ్తారని అంటున్నారు ?**
ప్రతి సినిమాతో ఇంకా బెటర్ అవ్వాలని ప్రతి యాక్టర్ కి వుం టుంది. అయితే ఈ కథ రియల్ లైఫ్ క్యారెక్టర్ దొరికింది కాబట్టి ఇంకా మోటివేట్ అయ్యాను. యాక్టర్ గా నెక్స్ట్ స్టెప్ వెళ్ళే అవకాశం ఈ సినిమాలో కనిపించింది. దాదాపు ఎనిమిది నెలలు స్క్రిప్ట్, నా ట్రాన్స్ ఫర్మేషన్ మీదే వున్నాను. శ్రీకాకుళం యాస గురించి ట్యూ షన్ తీసుకున్నాను. యాస రియల్లీ ఛాలెంజింగ్‌గా అనిపించింది.

**రాజు పాత్రని ఎంచుకోవడానికి కారణం ?**
నాకు ఎప్పటి నుంచో రియల్ లైఫ్ స్టోరీస్ ఆధారంగా సినిమా చేయాలని వుండేది. పైగా ఇది మన తెలుగోళ్ళ కథ. ఇది నాకు స్ఫూర్తిని ఇచ్చింది. రూటెడ్‌గా వుండే కథలు చేయడానికి ఇష్టపడతాను.

**డైరెక్టర్ చందూ గురించి ?**
చందుతో నాకు ఇది మూడో సినిమా. తనతో ట్రావెల్ అవ్వడం ఇష్టం. నన్ను కొత్తగా ప్రజెంట్ చేయడానికి ప్రయత్నిస్తాడు. నా కోసమే ఆలోచిస్తుంటాడు. ఈ సినిమా కమర్షియల్‌గా తీసుకురావ డానికి చాలా కష్టపడ్డాడు.

**ఇందులో ప్రేమకథకి ఎంత స్కోప్ వుంటుంది ?**
'తండేల్' అవుట్ అండ్ అవుట్ లవ్ స్టోరీ. లవ్ స్టోరీ వెనుక మిగతా లేయర్స్ వుంటాయి.

**'తండేల్' మీనింగ్ ఏమిటి ?**
శ్రీకాకుళం నుంచి గుజరాత్ వెళ్లి అక్కడ బోట్స్ ని లీజ్ కి తీసుకొని ఫిషింగ్ చేసుకొని అక్కడే అమ్మి తిరిగివస్తారు. 'తండేల్' అంటే లీడర్. ఇది గుజరాతీ వర్డ్. సినిమాని దాదాపు సముద్రంలో షూట్ చేశాం. రియల్ లొకేషన్ లో షూట్ చేయడం పెర్ఫార్మెన్స్ కి కూడా ప్లస్ అవుతుంది. జైల్ ఎపిసోడ్స్ చాలా ఎమోషనల్ గా వుంటాయి.

# సలార్ 2 ఎప్పుడంటే?




ప్రభాస్ ప్రశాంత్ నీల్ కాంబోలో వచ్చిన సలార్ మొదటి పార్ట్ కమర్షియల్ గా బాగానే వర్క్ అవుట్ అయ్యింది. ఐతే కె.జి.ఎఫ్ రేంజ్ లో సినిమా రాలేదన్న టాక్ అయితే ఉంది. ప్రభాస్ లాంటి కటౌట్ కి తగిన సినిమానే అయినా సలార్ 1ని ఎందుకో కె.జి.ఎఫ్ పైన ఉంచలేకపోయారు. ఐతే ప్రశాంత్ నీల్ కూడా ఇదే విషయాన్ని చెబుతూ సలార్ 2 నెక్స్ట్ లెవెల్ లో ఉంటుందని వెల్లడించాడు. సలార్ 2 కచ్చితంగా ఊహించిన దాని కన్నా భారీగా ఉండబోతుంది. ఐతే ప్రస్తుతం ప్రభాస్ మారుతితో రాజా సాబ్ సినిమా చేస్తున్నాడు. ఆ సినిమాతో పాటు హనుతో ఆల్రెడీ ఫౌజీని మొదలు పెట్టాడు. ఇక లైన్ లో సందీప్ వంగ స్పిరిట్ కూడా ఉంది. ప్రభాస్ తో కల్కి 2 సినిమా ఈ ఇయర్ సెకండ్ హాఫ్ నుంచి చేయాలని నాగ్ అశ్విన్ ప్లాన్ చేస్తున్నాడు. ఎలాగు ప్రశాంత్ నీల్ నెక్స్ట్ ఎన్టీఆర్ తో సినిమా చేస్తున్నాడు కాబట్టి ప్రభాస్ ఈలోగా ఈ ప్రాజెక్ట్ లను పూర్తి చేసే అవకాశం ఉంది. ఈ లెక్కన చూస్తే ప్రశాంత్ నీల్ ప్రభాస్ సినిమా 2026 కూడా కాదు 2027 లోనే సెట్స్ మీదకు వెళ్లేలా ఉంది. ప్రశాంత్ నీల్ కచ్చితంగా తారక్ సినిమా పూర్తి చేశాకనే అది ఉంటుంది. సలార్ 2 విషయంలో తన కమిట్మెంట్ ఐడియాలజీ ఏంటన్నది సలార్ 1 వన్ ఇయర్ పూర్తి చేసుకున్న సందర్భంగా చేసిన ఇంటర్వ్యూలో ప్రశాంత్ నీల్ తెలిపాడు. సో సలార్ 1 కన్నా సలార్ 2 చాలా పెద్దగా ఉండబోతుంది. ఐతే అది ఎలా ఉంటుంది అన్నది మాత్రం ఇప్పుడప్పుడే చెప్పడం కష్టం. సెట్స్ మీద ఉన్న ప్రభాస్ సినిమాల రిలీజ్ అంచనాలు చూస్తే ఈ ఇయర్ రాజా సాబ్ ఒక్కటే వచ్చే ఛాన్స్ కనబడుతుంది. స్పిరిట్ కన్నా ఫౌజీ ఎక్కువ స్పీడ్ గా షూట్ జరుగుతుంది. సో నెక్స్ట్ ఇయర్ సమ్మర్ ఫౌజీ రిలీజ్ ఉండొచ్చు. ఆ నెక్స్ట్ స్పిరిట్ లేదా కల్కి 2 వస్తుంది. ఇక స్పిరిట్ ని కూడా షూటింగ్ పూర్తి చేసి ఆ తర్వాత ప్రశాంత్ నీల్ తో సలార్ 2 కి డేట్స్ ఇస్తాడు.

# కోర్టు నన్ను నిర్దోషిగా తేల్చింది. నా న్యాయపోరాటం గెలిచింది -నిర్మాత శింగనమల రమేష్ బాబు

'నేనొక ఫిల్మ్ ఫైనాన్షియర్‌ని. సినిమా అంటే పాషన్ తో నిర్మాతగా మారాను. సినిమా నాకు తల్లి లాంటిది. మహాబలిపురంలో ఉన్న నా 10 ఎకరాల స్థలాన్ని ఒకరికి తెలియకుండా మరొకరికి.. ఇలా పలువురు వ్యక్తులకు అమ్మానని నాపై కేసు పెట్టారు. 14 ఏళ్ల పాటు న్యాయ పోరాటం చేశాను. అది తప్పుడు కేసని తేలింది. న్యాయస్థానం నన్ను నిర్దోషిగా తేల్చింది. తప్పుడు కేసులు కోర్టు ముందు నిలబడవు. నా న్యాయపోరాటం గెలిచింది'అన్నారు నిర్మాత శింగనమల రమేష్ బాబు. 'కొమరంపులి', 'ఖలేజా' లాంటి బిగ్ స్టార్ చిత్రాలని నిర్మించిన ఆయన ఓ కేసు నిమిత్తం 14 ఏళ్ల పాటు న్యాయపోరాటం చేశారు. ఈ కేసును విచారించిన కోర్టు ఇటీవల ఆయన్ని నిర్దోషిగా తేల్చి, కేసు కొట్టి వేసింది. ఈ క్రమంలోనే ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు.

రమేష్‌బాబు మీపై కేసు పెట్టిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవాలనుకుంటున్నారు?
నాకు ఎలాంటి కక్ష సాధింపులు లేవు. ఏదైనా న్యాయపరంగానే పోరాటం చేస్తా.

భవిష్యత్‌లో సినిమాల్లో కొనసాగుతారా ?
నేనొక ఫిల్మ్ ఫైనాన్షియర్‌ని. సినిమా అంటే పాషన్ తో నిర్మాతగా మారాను. సినిమా నాకు తల్లి లాంటిది. భవిష్యత్తులోనూ ఇదే రంగంలో కొనసాగుతా. నాకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. వారిద్దరూ హీరోలుగా చేశారు. హిట్ అందుకున్నారు. ఇప్పుడు డైరెక్షన్ రైటింగ్ చేయాలని అనుకుంటున్నారు. నేను కూడా నిర్మాతగా చేస్తా. ఫైనాన్షియర్‌గా చేస్తాను.



మీ మీద కేసు పెట్టింది ఎవరు? వాళ్లకు సినీ రంగంతో సంబంధం ఉందా?
నాపై కేసు పెట్టిన వాళ్లు ఇండస్ట్రీ చెందిన వారు కాదు.

అగ్ర హీరోల చిత్రాలను నిర్మించి నష్టపోయారా?
అప్పట్లో సినిమాలు ఆరు నెలలు, లేదా సంవత్సరంలోగా పూర్తయ్యేవి. కానీ నా దురదృష్టం కొద్దీ నేను తెరకెక్కించిన కొన్ని పెద్ద హీరోల చిత్రాలు దాదాపు మూడేళ్ల సమయం చిత్రీకరణలోనే గడిచిపోయింది. అందుకు చాలా కారణాలు ఉన్నాయి. ఆ రెండు చిత్రాలకు రూ.100 కోట్ల వరకూ నష్టపోయా.

అసలు మీపై పెట్టిన కేసు ఏమిటి?
రూ.14 కోట్లు మోసం చేశానని నా మీద అభియోగం. మహాబలిపురంలో ఉన్న నా 10 ఎకరాల స్థలాన్ని ఒకరికి తెలియకుండా మరొకరికి.. ఇలా పలువురు వ్యక్తులకు అమ్మానని కేసు పెట్టారు. సుదీర్ఘంగా న్యాయ విచారణ జరిగింది. న్యాయస్థానం నన్ను నిర్దోషిగా తేల్చింది. ఇప్పటికీ ఆ ఆస్తులు నా పేరు మీదే ఉన్నాయి.

మీ స్టోరీనే సినిమా కథలా వుంది.. సినిమా చేసే అవకాశం ఉందా ?
వెబ్ సిరిస్ చేస్తే వెయ్యి ఎపిసోడ్ పెట్టొచ్చు. అయితే నా కథ ఎవరు చూస్తారు(నవ్వుతూ)

ఫైనాన్స్ బిజినెస్ ఎంత లాభదాయకం ?
మేము సంపాదించింది ఫైనాన్స్ బిజినెస్ వలనే. నాన్న గారి నుంచి అది నాకు వచ్చింది. ఐతే సినిమా మేకింగ్ అనేది ఎప్పటికీ ఓ జూదమే. ఆ గ్యాంబ్లింగ్ వలనే నాకు రెండు సినిమాల్లో వందకోట్లు పోయింది. అయితే ప్రజెంట్ సినిమా నిర్మాణం బావుందని వింటున్నాను. నిర్మాతకు పది రూపాయలు మిగులుతాయని బయట అంటున్నారు.

ఈ జర్నీలో మీరు నేర్చుకున్న పాఠం ?
24 క్రాఫ్ట్స్ మన గ్రిప్ లో ఉన్నప్పుడే సినిమా తీయాలి.

# W/O అనిర్వేష్ చిత్ర బృందాన్ని అభినందించిన



గజేంద్ర ప్రొడక్షన్స్ పతాకంపై మహేంద్ర గజేంద్ర సమర్పణలో గంగ సప్తశిఖర దర్శకత్వంలో వెంకటేశ్వర్లు మెరుగు, శ్రీ శ్యామ్ గజేంద్ర నిర్మాతలుగా జబర్దస్త్ రాంప్రసాద్, జెమినీ సురేష్ , కిరీటి , సాయి ప్రసన్న ,సాయి కిరణ్ , నజియా ఖాన్ , అద్వైత చౌదరి తదితరులు నటించిన %ఔ/సా% అనిర్వేష్ చిత్రం యొక్క కొన్ని సన్నివేశాలను చూసి దర్శకుడు గంగ సప్తశిఖర ను ప్రశంసించారు హీరో అల్లరి నరేష్. కొత్త తరహా స్క్రీన్ ప్లే తో అలరించబోతున్న ఈ సినిమాకి స్క్రీన్ ప్లే అందించింది సీనియర్ రైటర్ బాబీ కె ఎస్ ఆర్. ఒక కొత్త రకమైన క్రైమ్ థ్రిల్లర్ స్టోరీని ఎంగేజింగా ప్రేక్షకులకు త్వరలో చూపించబోతున్నటువంటి ఈ చిత్రం కచ్చితంగా విజయం చేకూర్చుతుందని అల్లరి నరేష్ అన్నారు.

సంగీత దర్శకుడు షణ్ముఖ మ్యూజిక్ ఈ సినిమాకి ప్రాణం పోసిందని, వి ఆర్ కె నాయుడు కెమెరామెన్ గా తన ప్రతిభను చూపించారని కొని ఆడారు చిత్ర దర్శకుడు గంగ సప్తశిఖర. ఈ చిత్రాన్ని. ఎస్ కె ఎం ఎల్ మోషన్ పిక్చర్స్ ద్వారా ఆంధ్ర తెలంగాణలో త్వరలో రిలీజ్ చేయబోతున్నారు.






# నాన్నకు నేనే హీరో అఖిల్ మారిశెట్టి



హీరో కావాలన్న తన తనయుడు మారిశెట్టి అఖిల్ అభిరుచిని గమనించి, అతనిని హీరోగా పరిచయం చేసేందుకు పూనుకున్నారు అనకాపల్లి జిల్లాకు చెందిన ప్రముఖ రాజకీయవేత్త, మారిశెట్టి శ్రీకాంత్. మారిశెట్టి అఖిల్ హీరోగా, భానుశ్రీ హీరోయిన్ గా శ్రీధన్ దర్శకత్వంలో ఎ.కె. టెక్ మార్కెటింగ్ మూవీ క్రియేషన్స్ పతాకంపై మారిశెట్టి శ్రీకాంత్. నిర్మించే నూతన చిత్రం చిత్రీకరణ మంగళవారం సాయంత్రం అనకాపల్లి జిల్లా చోడవరం మండలం లోని నిర్మాత సొంత గ్రామమైన లక్ష్మీపురంలోని రామాలయంలో ప్రారంభమైంది. టైటిల్ నిర్ణయించాల్సిన ఈ చిత్రం ముహూర్తపు సన్నివేశానికి సీనియర్ నిర్మాత నట్టి కుమార్ క్లాప్ నిచ్చిన అనంతరం మాట్లాడుతూ, సినిమా పరిశ్రమ ఆంధ్ర ప్రదేశ్ కు తరలి రావాలని, షూటింగులు ఆంధ్ర ప్రదేశ్ లో చేయాలని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఏదైతే ఆకాంక్షించారో అందుకు అనుగుణంగా చిన్న సినిమా నిర్మాతలు ఆంధ్రప్రదేశ్ కు తరలివచ్చి, షూటింగులు చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. అలా వచ్చిన నిర్మాతలకు సింగిల్ విండో సిస్టంలో పర్మిషన్ లు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదా?. తెలియజేయాలని కోరుతున్నాను. టూరిజం లొకేషన్స్ ను మరింతగా అభివృద్ధి చేయాలి. పాడేరు, అరకు, విశాఖ వంటి తదితర లొకేషన్స్ లో షూటింగ్ లకు అనువైన లొకేషన్స్ ను గుర్తించి, వాటి అభివృద్ధితో పాటు నిర్మాతలకు అక్కడ షూటింగులు చేసుకునేందుకు సింగిల్ విండో సిస్టమ్ కింద త్వరితగతిన అనుమతులు ఇవ్వాలి. చిన్న సినిమాల మనుగడకు తగిన చర్యలను తీసుకోవాలని సీఎం చంద్రబాబు నాయుడుని, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ని, ఐటీ మంత్రి నారా లోకేష్ని, సినిమాటోగ్రఫీ మంత్రి దుర్గేష్ ని కోరుతున్నాను. అనకాపల్లి రాజకీయాలలో మంచి పేరున్న మారిశెట్టి శ్రీకాంత్ తన కుమారుడి ఆసక్తిని గమనించి, సినిమా నిర్మాణానికి పూనుకోవడం అభినందనీయం" అని అన్నారు.

**PRINTED & PUBLISHED BY NUKARAPU PADMAJA ON BEHALF OF SPR PUBLICATIONS PVT.LTD**, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. **PRINTED AT SPR PRINTING PRESS,** SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081**, TELANGANA, PUBLISHED AT SPR PUBLICATIONS PVT.LTD,** SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR,NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081**. EDITOR : NUKARAPU PADMAJA. Fax No:040-30473232** RNI Registration No. **APTEL/2007/22044**